సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి మార్చి సోమవారం 20 - ఆదివారం 26 మార్చి, 2017 సంపుటి : 2 సంచిక 26 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00



వివరాలు 2లో...  పౌరులు- చట్టాలు

వివరాలు 3లో...  విద్యా సంస్థల్లో అసహనం వద్దు

వివరాలు 4లో...  డీహైడ్రేషన్.. తగు జాగ్రత్తలు

వివరాలు 6లో... యూపీ విజయానికి RELIANCE

వివరాలు 7లో...  విపక్షాలను చిత్తుచేసేందుకు విలువలకు పాతర


## రాష్ట్రపతి రేసులో అద్వానీ, జోషి, రామోజీ


ఎల్‌కే అద్వానీ


మురళీ మనోహర్ జోషి


రామోజీరావు

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పదవీవిరమణ జూలైలో జరగనుంది. ఈ లోపుగా కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవాల్సి ఉంది. గురుతుల్యులు, ఈ స్థానానికి చేరుకునేందుకు వేలుపట్టి అడుగులు వేయించిన కురువృద్ధులు మురళీ మనోహర్ జోషి, ఎల్‌కే అద్వానీలలో ఎవరో ఒకరికి రాష్ట్రపతి పదవిని మోడీ కట్టబెడతారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయంగా మోడీ ప్రారంభ దశలో ఉండగా, ప్రతిరోజూ సాయంత్రం పూట మురళీ మనోహర్ జోషి చెప్పే పాఠాలను మోడీ వినేవారని,1992లో శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో జోషి మూడు రంగుల జెండా ఎగరేసినప్పుడు కూడా మోడీ పక్కనే ఉన్నారన్నారు. మోడీ సంక్షోభంలో ఉన్నప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రి పదవి నుంచి ఆయనను తప్పించాలని తీవ్ర ఒత్తిడి వచ్చినా, ఎల్‌కే అద్వానీ మోడీకి గట్టి మద్దతుగా నిలబడి పదవినుంచి దూరంకాకుండా రక్షించారు. దీంతో వీళ్లిద్దరి పట్ల మోడీకి కృతజ్ఞతాభావం ఉందని, దీంతో వారిలో ఒకరిని ఆయన రాష్ట్రపతి పదవికి ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే మోడీ మాత్రం ఈ ఆలోచనలన్నింటికీ భిన్నంగా వ్యవహరించి అందరినీ ఆశ్చర్యపరుస్తారని కేంద్రంలోని ఓ సీనియర్ మంత్రి వ్యాఖ్యానించారు. తెలుగురాష్ట్రాల నుంచి మీడియా మొఘల్ రామోజీరావు ఈ పదవిపై ఆశపెట్టుకున్నారు. ఇందుకోసం తెలుగురాష్ట్రాల్లో ఫోర్త్ ఎస్టేట్ అయిన ప్రెస్ ఆయన మోడీకి వ్యతిరేకంగా ఒక్క వాఖ్యం కూడా రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మోడీ చేసే ప్రతిపనిని పొగుడుతూ మాత్రమే ఆర్టికల్స్ ప్రచురిస్తున్నారు. మోడీకి అంబానీ, ఆదానిల సహకారం ఉంటుందని, అలాగే రాష్ట్రానికి చెందిన వెంకయ్యనాయుడు కూడా తనకు సహకరిస్తారన్న నమ్మకంతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఉత్తరాది వారిని, బీజేపీ వర్గీయులను కాకుండా చంద్రబాబునాయుడుకు అత్యంత అనుకూలంగా పేరుతెచ్చుకున్న రామోజీరావు పేరు పరిశీలకు రావడం కష్టమైన పనే...

### కావాల్సిన ఓట్లు

రాష్ట్రపతిని ఎన్నుకొనే ఎలక్టోరల్ కాలేజిలో మొత్తం 10,98,882 ఓట్లుంటాయి. అందులో సగం ఓట్లకు పైగా వస్తేనే రాష్ట్రపతిగా ఎన్నికవుతారు. అంటే, 5,49,442 ఓట్లు కావాలన్న మాట. ఉత్తరప్రదేశ్‌లో 321 స్థానాలు, ఉత్తరాఖండ్‌లో 57 స్థానాలతో పాటు మణిపూర్, గోవాలలో సాధించిన విజయాలతో ఎన్డీయే చాలావరకు ఈ సంఖ్యకు దగ్గరగా వచ్చింది. ఇక మరో 25,354 ఓట్లు సంపాదిస్తే చాలు.. రాష్ట్రపతి ఎన్నికకు మార్గం సుగమం అయిపోతుంది. ఎన్నికల ఫలితాలకు ముందు ఈ తేడా 79,274గా ఉండేది. ఇప్పుడది గణనీయంగా తగ్గింది. మొత్తం అన్ని రాష్ట్రాలలో ఉన్న ఎమ్మెల్యేల ఓట్లతో ఎలక్టోరల్ కాలేజి ఉంటుంది. నామినేటెడ్ ఎమ్మెల్యేలకు ఇందులో ఓటుహక్కు ఉండదు. రాష్ట్ర జనాభాను బట్టి ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఓటుకు ఒక విలువ ఉంటుంది. ఉదాహరణకు ఎంపీలకు ప్రతి ఓటుకు గరిష్టంగా 708 విలువ ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక్కో ఎమ్మెల్యే ఓటు విలువ 208. యూపీ దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రం కావడంతో కేవలం ఆ రాష్ట్రంలోనే మొత్తం 83,824 ఓట్లుంటాయి. ఇలా.. అన్ని రాష్ట్రాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు వాళ్ల వాళ్ల ఓటు విలువను బట్టి రాష్ట్రపతి ఎన్నికలలో ఓటు వేస్తారు.

## ఇలాగైతే కాంగ్రెస్ ఖతం



**రాజధాని వార్తలు డెస్క్ :** ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు, ఇది కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీకి బాగా వర్తిస్తుంది. మణిపూర్, గోవా ఎన్నికల ఫలితాలు రాబట్టినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో చూపిన అలక్ష్యం ఆ పార్టీ శ్రేణులను నిర్వీర్యం చేస్తోంది. దీనికి పార్టీ సీనియర్ నాయకుడు దిగ్విజయ్‌సింగ్ క్షమాపణలు చెప్పారుకూడా. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజే గోవా, మణిపూర్‌ల్లో కూడా మా ప్రభుత్వమే వస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ప్రకటించినప్పటికీ జాగ్రత్త పడకుండా ఆపై ఎంత చింతించినా ఏం ప్రయోజనం ? ఈ పరిస్థితితో కార్యకర్తలంతా నిరుత్సాహంలో మునిగిపోయారు. ఎంత చేసినా అధినాయకత్వం స్పందన లేకపోతే ఇలాగే ఉంటుందని ఉస్సూరంటున్నారు. గోవాలో మొత్తం స్థానాలు 40 ఉండగా కాంగ్రెస్ 18, బీజేపీ 14 గెలుచుకున్నాయి. ఎన్నిలక ఫలితాలను బట్టి గవర్నర్ కాంగ్రెస్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సి ఉండగా, ఆఘమేఘాలమీద బీజేపీని ఆహ్వానించారు. దీని వెనుక ప్రధానిమోడీ, అమిత్‌షాల అమిత కృషి ఉంది. కాంగ్రెస్‌మాత్రం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఇప్పుడు ఎంత గింజుకున్నా ప్రయోజనం లేకపోయింది. గోవా బలపరీక్షలో మనోహర్‌పారికర్ 22 ఓట్లతో బలనిరూపణ చేసుకున్నారు. పొత్తు పార్టీలకు మంత్రి పదవులు ఆశ చూపి వారు ప్రభుత్వాన్ని సునాయాసంగా ఏర్పాటు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి పొత్తులు పెట్టుకోవడం పెద్ద కష్టం కాదు. మణిపూర్‌లోకూడా సేమ్ టు సేమ్ ఇదే పరిస్థితి...మొత్తం సీట్ల సంఖ్య 60 ఉండగా, కాంగ్రెస్ 28, బీజేపీ 21లతో ఉన్నాయి. కేవలం రెండు సీట్ల స్వతంత్ర అభ్యర్థులను తెచ్చుకుంటే సరిపోయేది, గవర్నర్ తమనే ఆహ్వానిస్తారులే అనుకుంటూ జాగారం చేసినందుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇది ఇలా కొనసాగితే దశాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ దేశం నుంచి కనుమరుగవుతుంది.

## ఆరోగ్య రక్ష పథకాన్ని ప్రారంభించిన సీఎం

**రావా ప్రతినిధి, గుంటూరు :** రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జిల్లాలోని గోళ్లపాడులో శనివారం ఉదయం జరిగిన బహిరంగ సభలో కేంద్రమంత్రి సుజనాచౌదరి, స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో కలిసి ఆరోగ్యరక్ష పథకాన్ని ఆయన ప్రారంభించారు.అంతకు ముందు ఆయన కస్తూర్బా గాంధీ విద్యార్థులతో జరిగిన ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్క ఊరికి నెలకోసారి వైద్యులను పంపి చికిత్స చేయిస్తున్నామన్నారు. అన్ని పురపాలక సంఘాల్లో ఒక హెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రికి అప్పజెప్పి వైద్యం చేయిస్తున్నామన్నారు. మధ్యతరగతి ప్రజల కోసమే ఆరోగ్య రక్షను తీసుకొచ్చినట్లు సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు.



గుంటూరు : కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

## ఏప్రిల్ 14న స్మృతివనం శంకుస్థాపన



- 125 అడుగుల విగ్రహం ఏర్పాటు
- నాలుగు ప్రదేశాలను పరిశీలించిన రావెల
- శాఖమూరు, ఐనవోలు రెవెన్యూలోనే..
- 20 ఎకరాలు కేటాయించనున్న సీఆర్‌డీఏ

**రా.వా.ప్రతినిధి తుళ్ళూరు:** రాజధాని అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా 97.69 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. 125 అడుగుల ఎత్తయిన కాంస్య విగ్రహ స్థాపనకు ప్రభుత్వం స్థల పరిశీలన చేపట్టింది. శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రావెల కిషోర్ బాబు సీఆర్‌డీఏ అధికారులతో కలిసి శాఖమూరు, ఐనవోలు రెవెన్యూ పరిధిలో నాలుగు ప్రదేశాలను పరిశీలించారు. శాఖమూరు పరిధిలోని జస్టిస్ సిటీ ప్రాంతంలో అంబేద్కర్ స్మృతి వనానికి స్థలం అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే 200 ఎకరాల్లో సీఆర్‌డీఏ గ్రీనరీ పార్క్ ఏర్పాటు చేస్తోంది. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని స్మృతి వనానికి శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి రావెల కిషోర్‌బాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 14కి జ్ఞాన కేంద్రం, లైబ్రరీ పూర్తి చేస్తామని మంత్రి అన్నారు. స్థల పరిశీలనలో సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్, సీఆర్‌డీఏ భూవ్యవహారాల ఇన్‌చార్జ్ డైరెక్టర్ రఘునాథరెడ్డి, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

### నల్లమడవాగు ఆధునీకీకరణకు నిధుల మంజూరు :

రా.వా. గుంటూరు : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని నల్లమడ వాగు ఆధునీకీకరణకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి నియోజకవర్గ స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతిపాటి నియోజకవర్గం ఎమ్మెల్యే,సాంఘిక, గిరిజన సంకేమ శాఖల మంత్రి శ్రీ రావెల కిషోర్ బాబు గారి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గం జడ్పీటీసీలు, యంపిటిసిలు, గ్రామ సర్పంచ్‌లు, రైతులు, ప్రజలు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని సచివాలయంలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వందల సంవత్సరాల నుండి నల్లమడవాగు వర్షాకాలంలో భారీ వర్షాలు, వచ్చినప్పుడల్లా ముఖ్యంగా పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని అనేక గ్రామాలు నీట మునగటం. పంట పొలాలు ఇసుక మేట వేసి పంటలకు పనికి రాకుండా పోవడం, పంట నష్టం జరగటం, పశు సంపద చనిపోవడం, ప్రాణనష్టం జరగటంలాంటి తీవ్ర ఇబ్బందులకు గురికావడం జరుగుతోందని మంత్రి తెలిపారు. నల్లమడ వాగు ఆధునీకీకరణకు మొత్తం 324 కోట్లు ఖర్చు కానున్నదని అంచనా వేసి 20-1-2017 తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో మొదట విడతగా సర్వే, ఇన్వెస్టిగేషన్‌తో పాటు భూసేకరణకు ఇతరత్రా రూ.240 కోట్లు మంజూరు చేసినందుకు నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం



**రా.వా ప్రతినిధి,అమరావతి :** కృష్ణానది కరకట్ట వద్దనున్న ఏపీ సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం రేపింది. ప్రకాశం బ్యారేజీ దాటాక కరకట్ట మీద నుంచి సీఎం నివాసానికి వెళ్లే మార్గంలో దీన్ని భద్రతా సిబ్బంది గుర్తించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయాణించే మార్గంలో రోజూ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తుంటాయి. ఈ ఉదయం కూడా కరకట్టకు ఇరువైపులా భద్రతా సిబ్బంది తనిఖీ చేస్తున్నప్పుడు ఆరడుగుల కొండచిలువను వీరు గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది కొండచిలువను పట్టుకుని మంగళగిరి కొండప్రాంతానికి తరలించారు. ఇదే మార్గంలో మరో 10 అడుగుల కొండచిలువ కూడా తిరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

## బీఎండబ్ల్యూలో మంటలు

### ప్రొఫెషనల్ రేసర్ దుర్మరణం



**చెన్నై:** భారత ప్రొఫెషనల్ రేసర్ అశ్విన్ సుందర్, అతని భార్య నివేదిత దుర్మరణం చెందారు. వారు ప్రయాణిస్తున్న బీఎండబ్ల్యూ కారు రోడ్డుపక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. ఈ మంటలలో దంపతులిద్దరూ ఆహూతి అయ్యారు. శనివారం తెల్లవారుజామున చెన్నైలోని శాంతమ్ హైరోడ్డు ప్రాంతంలో ఈ దురెటన చోటుచేసుకుంది.బీఎండబ్ల్యూ చెట్టును ఢీకొన్న తర్వాత.. వాహనంలోంచి బయటకు వచ్చేందుకు సుందర్ దంపతులు ప్రయత్నించారని, కానీ కారు డోర్లు తెరుచుకోలేదని, ఇంతలోనే చెట్టు, ఓ గోడ మధ్య చిక్కుకున్న బీఎండబ్ల్యూలో మంటలు ఒక్కసారిగా ఎగిశాయని, ఈ మంటలలో దంపతులిద్దరూ సజీవ దహనమయ్యారని పోలీసులు తెలిపారు. భారత జాతీయ కారు రేసింగ్ చాంపియన్ అయిన సుందర్ ఈ సమయంలో వాహనాన్ని నడుపుతున్నారు. ఆయన భార్య నివేదిత ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. స్థానికులు వాహనానికి నిప్పు అంటుకున్న విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## తాజ్‌మహల్ వద్ద జంటపేలుళ్లు..



**ఆగ్రా:** భారత్‌లోని చారిత్రక కట్టడం తాజ్‌మహల్‌పై దాడి చేసేందుకు ఐసిస్ ఉగ్రవాదులు గురిపెట్టినట్టు వార్తలు వస్తున్నాయి... ఆగ్రాలో శనివారం ఉదయం పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఆగ్రా రైల్వే స్టేషన్ సమీపంలో రెండు చోట్ల చిన్నపాటి పేలుళ్లు జరగడం కలకలం రేపింది.. ఆగ్రా కంటోన్మెంట్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో చెత్తను తరలించే ట్రాక్టర్‌లో ఒక పేలుడు సంభవించగా... రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న ఓ ఇంటిపై మరో పేలుడు చోటుచేసుకుంది. ఈ రెండు ఘటనల్లోనూ ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. ఈ జంట పేలుళ్లను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. మరోవైపు భారత ఆర్కియోలాజికల్ సర్వే సిబ్బంది సహా భద్రతా దళాలు, పోలీసులు తాజ్ మహల్ చుట్టూ 500 మీటర్ల పరిధిలో అణవణువూ జల్లెడపడుతూ పహారా కాస్తున్నారు.

## ఈవారం రాజధాని

- రాష్ట్రంలో 84 వైద్యశాలలకు కొత్త భవనాలు : మంత్రి కామినేని శ్రీనివాసరావు
- ఏప్రిల్ 14న అంబేద్కర్ స్మృతివనానికి భూమి పూజ పార్కు : ముఖ్యమంత్రి సీఎం
- 19న విజయ కీలాద్రిపై మండలాభిషేక మహోత్సవాలు : పురుషోత్తమదాసు
- 25 నుండి ఢిల్లీలో పర్యావరణంపై ప్రపంచస్థాయి సదస్సు : ఎన్‌జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ స్వతంతర్
- అమరావతిలో వంద ఎకరాల్లో ఫోర్త్ జనరేషన్ టెక్నాలజీ పార్కు ఏర్పాటు : ముఖ్యమంత్రి
- ఎక్సైజ్ అదనపు డ్యూటీ లక్ష్యం 1,400 కోట్లు

## రోజాపై సస్పెన్షన్ వేటు ?



**రా. వా ప్రతినిధి -అసెంబ్లీ :** మరో ఏడాది పాటు సభ నుంచి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే రోజాపై సస్పెన్షన్ వేటు వేయాలని ప్రివిలేజ్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. ప్రివిలేజ్ కమిటీ తన నివేదికను ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో టేబుల్ చేసింది. గతంలో, అసెంబ్లీ సమావేశాల గలాటాలో ఇప్పటికే రోజాపై ఏడాదిపాటు సస్పెన్షన్ వేటు పడిన విషయం విదితమే. ఇప్పుడు తాజా సస్పెన్షన్, ఎమ్మెల్యే అనితపై రోజా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మళ్లీ వేటు వేస్తారని సమాచారం. 'రోజా నేరమే చేశారని అనుకుందాం.. అయినా ఒక్క నేరానికి రెండు సార్లు శిక్షలు విధిస్తారా.?' అంటూ వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పటికే టీడీపీ సర్కార్ తీరుపై మండిపడ్డారు. సభలో ఎటూ, టీడీపీదే మెజార్టీ గనుక.. టీడీపీ ఎలాగూ రోజాపై కక్షపూరితంగా వ్యవహరిస్తోంది గనుక, ఇంకో ఏడాదిపాటు ఆమెపై సస్పెన్షన్ వేటు తప్పకపోవచ్చు.

## ఈ నెల 25, 26 తేదీల్లో మెగా జాబ్ మేళా

**రావా ప్రతినిధి, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని మలినేని ఇంజనీరింగ్ కాలేజి,పుల్లడిగుంటలో మెగా జాబ్ మేళ 25,26 వ తేదీలలో తేదీలలో నిర్వహిస్తున్నామని మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఎమ్.డి. హిదాయత్ అన్నారు.దేశంలోని ప్రసిద్ధి చెందిన 35 కంపెనీలు తమ తమ కంపెనీలలో మైనారిటీ నిరుద్యోగ యువతకు అవకాశాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన అన్నారు. విజయవాడలో సి.ఎం. క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో హిదాయత్ మాట్లాడుతూ మైనారిటీ యువతలో నిరాశ, నిస్పృహలను తొలగించి ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించటం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంకిత భావంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు విజయవాడ, నెల్లూరులలో జరిగిన "జాబ్ మేళా" లలో 900 ల మంది నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి లభించిందని అన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో జరగబోవు జాబ్‌మేళాకు ఐటీ, ఫార్మశి,మార్కెటింగ్,బి.పి.ఓ., బ్యాంకింగ్,ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయని అన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ మైనారిటీ యువతి, యువకులు తమ దరఖాస్తులను www.apsmfc.com లేక www.vikasajobs.com వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఎస్.ఎస్.సి., ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్,బి.ఫార్మసీ,డి ఫార్మసీ,ఎమ్.ఫార్మసీ, బి.టెక్,ఎం.బి.ఏ,ఎం.సి.ఏ, సి.ఎ,ఐ.సి.డబ్ల్యు.ఏ.ఐ కోర్సులు చేసిన ముస్లింలు, క్రిస్టియన్‌లు, బౌద్ధులు, సిక్కులు,జైనులు, మొదలగువారు 20 వ తేది మార్చి 2017 లోపల 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.జాబ్‌మేళా రోజు అభ్యర్థులు రెజ్యూమ్ 10 కాపీలు, ఆధార్‌కార్డ్, ఐ.డి. ప్రూఫ్, పాస్‌పోర్ట్ ఫోటో తీసుకొని హాజరు కావాలని అన్నారు. సమావేశంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ లాల్ వజీర్, మోహిద్దీన్, నాయకులు షౌకత్, హజ్‌కమిటి డైరెక్టర్ హసన్ భాష, మస్తాన్ షరీఫ్,డి.యమ్.డబ్ల్యు.ఓ. ఆషిరి, ఇ.డి. విజయకుమార్‌లు పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఎమ్.డి. హిదాయత్

## ఎస్ఐ కిడ్నాప్ చేశారు..!

**రా.వా ప్రతినిధి, విజయవాడ:** మార్కాపురం ఎస్ఐ తనను కిడ్నాప్ చేశారని, కిడ్నాప్ అనంతరం బయటపడ్డ స్థిరాస్తి వ్యాపారి రామకోటేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 27 అర్ధరాత్రి మార్కాపురం ఎస్ఐ పిస్తోల్‌తో ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించి తనను తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం మార్కాపురం డీఎస్పీ వద్దకు తీసుకెళ్లి సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిపారు. తనను హత్య చేస్తానని ఎస్ఐ, డీఎస్పీ బెదిరించినట్లు చెప్పారు. సందుల రంగారెడ్డి అనే వ్యక్తితో కలిసి ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు తెలిపారు.




రాజధాని వార్తలు కలం

# జర్నలిస్టుల ఊసేలేని బడ్జెట్

బడ్జెట్ అంటే ప్రజల డబ్బును ప్రజల కోసం ఖర్చుపెట్టడమే అయినా అది ప్రణాళికా బద్ధంగా ఖర్చు పెట్టడానికి రూపొందించుకున్న పథకం. ప్రజలకు ఏఏ రంగాల్లో ఎంత ఖర్చుచేస్తున్నాం, దీనిపై ఎంత సేవలు,లేదా లాభాలు అందుకోబోతున్నాం అనేది స్పష్టంగా చెప్పడం దాని ముఖ్య ఉద్దేశం. ముఖ్యరంగాల్లో బడ్జెట్ కేటాయింపులు చాలా నాసిరకంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం అయిన ప్రెస్‌కు ఏ విధమైనా కెటాయింపు జరపలేదు. రాజధాని ప్రాంతంలో ఇంతవరకు ప్రెస్‌క్లబ్ లేదు.. మరో తెలుగు రాష్ట్రం తెలంగాణాలో అంతకు ముందున్న నిధులకు రూ. 30 కోట్లు కలిపి, దానిపై వచ్చే వడ్డీతో జర్నలిస్టుల సంక్షేమానిక కృషి చేస్తున్నారు. కేరళ,అసోం రాష్ట్రాలు విశ్రాంత జర్నలిస్టులకు 10 వేల రూపాయల పింఛన్ అందచేస్తుండగా, బీహార్ రూ.8000 అందచేస్తోంది. తమిళనాడులో వితంతు పింఛన్ రూ. 8000కు పెంచింది జయలలిత ప్రభుత్వం. యూపీలో కూడా అఖిలేష్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎటువంటి కార్యక్రమాలు చేయకపోవడం విడ్డూరం. అసెంబ్లీ, సచివాలయాలు ఇక్కడికి తరలించడంతో ఎక్కడనుంచో వచ్చిన విలేకరులకు ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం, రాష్ట్ర ఆర్థిక మంత్రి దాని ఊసే ఎత్తకపోవడం జర్నలిస్టులను విస్మయ పరుస్తోంది.

రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు చెప్పేవాటికి అమలుకు చాలా తేడాలు వస్తున్నాయి. దేశ మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్, రాజ్యసభలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీకి, తిరుపతి ఎన్నికల సభలో తల్లిని చంపి బిడ్డను తీశారు, 15 ఏళ్లపాటు ప్రత్యేకహోదా అని ప్రస్తుత ప్రధాని మోడీ వాగ్దానం ఎందుకూ కొరకాకుండా పోయింది. ఆ స్థానంలో ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్దత వచ్చింది. దీంతో నిరుద్యోగుల ఆశలన్నీ అడుగంటాయి. నిజానికి రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడే నాటికి లక్షా ఇరవై ఐదువేల ఉద్యోగాలు ఉన్నాయి. ఇప్పటివరకు పూరించినవి అంతంత మాత్రమే.. ఈ బడ్జెట్‌లో పదివేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ఆర్థిక మంత్రి సెలవిచ్చారు. దీంతో బాబువస్తే జాబు అన్న నినాదానికి సంపూర్తిగా తూట్లు పడ్డట్టే..దీంతో మూడ్రోజుల క్రితం శంకర్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే... ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం అని నిరుద్యోగ భృతి అని పదవిలోకి వచ్చిన టీడీపీ రెండున్నరేళ్లపాటు ఆ ప్రస్తావనే మర్చిపోయింది. విపక్షాల ఆందోళనల మేరకు మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ఆ వాగ్దానాన్ని నెరవేర్చుతాం అని ప్రకటించింది. దీనికోసం బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ. 500 కోట్లు. రాష్ట్రంలో నిరుద్యోగులకు కేవలం రూ. 100 వస్తాయి. దానికి సరికొత్త నిబంధనలు ఏమంటే సమాజిక సేవ చేయాలని, అంటే అక్షరాస్యతా,పారిశుధ్యం, మొక్కలపెంపకం వంటివి చేపట్టాలని షరతులు పెట్టారు. ఇవి బయట చేస్తే రూ.10 వస్తాయని నిరుద్యోగులు కలత చెందుతుంటే, పార్టీకార్యకర్తల కోసమేనని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. తెలుగు దేశం పార్టీ గెలుపుకు సహాయపడింది రైతు రుణమాఫీలు నిజానికి అది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేని మొత్తం. అయితే పదవికోసం అలవికాని వాగ్దానాలన్నీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడు మొత్తం రైతు రుణాలు రూ. 87,612 కోట్లు..ఈ ఏడాది రూ. 3,600 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్లతో కలుపుకొని ఇప్పటి వరకు 14,500 కోట్లు చెల్లించారు. అంటే దీనిమొత్తం రుణాల వడ్డీలో మూడో వంతు. ఎప్పటికి తీరేను రైతు రుణాలు. వ్యవసాయ రంగానికి గతేడాది 6.4 శాతం నిధులు కేటాయించగా, ఈ ఏడాది 5.79 శాతం కేటాయింపులు జరిగాయి. తీవ్ర కరువు బారిన పడి పక్కరాష్ట్రాల్లో నానా అవస్థలు పడుతున్న రైతులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రాష్ట్రంలో 20 లక్షల మంది కౌలు రైతులుండగా, కేవలం 80 వేల మందికి మాత్రమే రూ. 202 కోట్లు రుణాలిచ్చింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు ఎలా చేస్తారో నోబెల్ గ్రహీతలు కూడా చెప్పలేరు. రాష్ట్రం నుంచి నోబెల్ బహుమతి తెచ్చుకుంటే రూ. 100 కోట్లు ఇస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి శాస్త్ర,సాంకేతిక విద్యకు కేవలం రూ. 29 కోట్లు కేటాయించారు. ఇళ్ల నిర్మాణం కోసం ఎంత తక్కువ చెబితే అంత మంచిది.కేంద్రం ఇచ్చిన ఇళ్లను కూడా నిర్మించలేని స్థిలో రాష్ట్రం ప్రభుత్వం ఉంది. ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్లు ఎత్తివేసి కాంపొనెట్ పేరుపెట్టడం ద్రోహం. అన్ని పథకాలను చంద్రన్న భీమా పథకంతో ముడిపెడుతున్న ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన రూ. 500 కోట్లు ఖర్చుపెట్టకుండా చిత్తశుద్దితో వ్యవహరించాలి. రాష్ట్రంలో 20 లక్షల మంది మత్స్యకార సంక్షేమానికి ప్రభుత్వం రూ. 282 కోట్లు కేటాయించింది. అసంఘటిత కార్మిక రంగాల్లో పనిచేస్తున్న పనిచేస్తున్న 2 కోట్ల మంది కోసం జమచేసిన నిధుల నుంచి తీసుకున్న రూ. 270 కోట్లు బీమా సంస్థకు చెల్లించారే తప్ప కార్మికులకు పైసా విదల్చకుండా అన్యాయం చేశారు. బీసీల్లో వెనుక బడిన వర్గాలకు సంబంధించి బీసీఏలోని 14 కులాలు, బీసీబీలోని 26 కులాలకు నిధులు కేటాయించకుండా కేవలం 12 కులాలకు మాత్రమే నిధులు కేటాయించడం అమానుషం. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించింది గ్రామాణాభివృద్ధి, రోడ్లు నిర్మాణాలకు మాత్రమే.

## మాయావతి ఆరోగ్యంపై జోకేసి ఆస్పత్రి పాలయ్యాడు



**లక్నో :** యూపీ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కేశవ్ ప్రసాద్ మౌర్య తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఢిల్లీలోని రామ్ మనోమర్ లోహియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి డాక్టర్లు ఆయనను ఐసీయూలో రక్తపోటు ఎక్కువగా ఉందని తెలిపారు. రేపటి వరకు తమ తమ అబ్జర్వేషన్లో ఉంచుకుంటామని ఆరోగ్యం కుదుట పడిన వెంటనే డిశ్చార్జి చేశారు. మౌర్య ఆధ్వర్యంలో యూపీలో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. కేశవ్ ప్రసాద్ మౌర్య మీడియాతో మాట్లాడుతూ బహుజన్ సమాజ్ వాదీ పార్టీ చీఫ్ మాయావతిని ఎద్దేవా ఆమె హాస్పిటల్కు వెళ్లి తన ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటే మంచిదన్నారు. అయితే మాయావతి హాస్పటల్కు వెళ్లి చికిత్స చేయించుకోవాలని ఎద్దేవా చేసిన కొన్ని గంటల్లోనే ఆయన ఆస్పత్రి పాలయ్యారు. ఇటీవల జరిగిన యూపీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ ఘోరంగా ఓటమి చవిచూసింది. ఆ పార్టీకి కేవలం 19 సీట్లు మాత్రమే దక్కాయి. ఆ ఫలితాలపై మాయావతి సీరియస్ కామెంట్స్ చేస్తూ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించిందని ఆమె ఆరోపించారు. బీఎస్పీకి వేసిన ఓట్లు బీజేపీకి వెళ్లాయని ఆమె వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.






## 1935 చట్టంలో అధికారవికేంద్రీకరణ

# పౌరులు–చట్టాలు

Law-Citizen

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది
98495 68901 / 83309 68901
katuruRavindraTrivikram@gmail.com



విభిన్నరాష్ట్రాలన్నీ కలిసి ఒకే దేశంగా అంటే భారతదేశం (republic of india) గా ఏర్పడ్డాయి. ఈ ఘనత సర్దార్ వల్లభాయ్‌పటేల్‌ది, నెహ్రూ అడ్డుపడకపోతే కాశ్మీరు కూడా మనదేశంలో కల్సిపోయేది. నెహ్రూది చారిత్రకతప్పిదం. పర్యవసానంగా కాశ్మీరు కొరకరాని కొయ్యగా, అశాంతికి నిలయంగా, పాకిస్థాన్‌కి పాచికగా మారిపోయింది.

రాష్ట్రాలకు ప్రత్యేక ప్రభుత్వాలను ప్రజాప్రతినిధుల ద్వారా అక్కడి ప్రజలు తమ అభీష్టానుసారం ఎన్నుకుంటారు. అలాగే పార్లమెంటు సభ్యున్ని కూడ ఎన్నుకుంటారు. 1935 చట్టం కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలను విభజించింది. కొన్ని చట్టాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోను, మరికొన్ని రాష్ట్రప్రభుత్వ పరిధిలోనూ చేయబడతాయి.మరికొన్ని కేంద్ర, రాష్ట్ర పరిధుల్లో చేయబడతాయి. కేంద్రపాలిత ప్రాంతాలమీద గవర్నర్ జనరల్ (ప్రస్తుతం రాష్ట్రపతి)కి అధికార నియంత్రణ ఉంటుంది. బ్రిటిష్‌వారి కాలంలో ఫెడరల్ కోర్టు (ప్రస్తుతం సుప్రీంకోర్టు)కి గవర్నర్ జనరల్ (రాష్ట్రపతి)కి వారు కోరినప్పుడు న్యాయసలహాలను ఇవ్వవచ్చును.

1946లో 'కేబినేట్ కమిషన్ ప్లాన్' లో రాజ్యాంగం చేయబడింది. రాజ్యాంగ రచనకి సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించడానికి కాన్స్టిట్యూట్ అసెంబ్లీ' వివిధ కమిటీలను ఏర్పాటుచేసింది. వారి నివేదికల ఆధారంగా 'రాజ్యాంగ రచన' తయారు చేయబడింది.

రాజ్యాంగంల్లో 315 అధికరణలు (articles) , ఎనిమిది అధ్యాయాలు (schedules ) ఉన్నాయి. రాజ్యాంగానికి నిర్మాణ దశలోనే ఎన్నో సవరణలు చేయబడ్డాయి. రాజ్యాంగరచన 26 నవంబరు 1949 నాటికి సిద్ధమైంది. 26 జనవరి 1950న అమలులోకి వచ్చింది.

**రాజ్యాంగ వికేంద్రీకరణ**

భారతరాజ్యాంగం ప్రధానంగా ' సంయుక్త' (federal) విధానం గలది. అలాగని కేంద్రీయ లక్షణాలు లేకపోలేదు.

**సమాఖ్య లక్షణాలను చూద్దాం**

**ద్వంద్వ ప్రభుత్వం :** కేంద్రీకృత దేశంలో(unitary state) జాతీయ ప్రభుత్వం(national government ) ఒక్కటే ఉంటుంది. పరిపాలనా సౌలభ్యంకోసం జాతీయ ప్రభుత్వం స్థానిక ఉపసంఘాలను (local sub divisions) ఏర్పాటు చేయవచ్చు. అయితే, వీటికి ప్రాతినిధ్యం అధికారాలే ఉంటాయి. ఏ సమయంలో నైనా జాతీయ ప్రభుత్వం ఈ అధికారాలను రద్దు చేయవచ్చు.

సమాఖ్య ప్రభుత్వంలో (federal government) – కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలుగా రెండంచెల పరిపాలన ఉంటుంది. ఈ రెండు రకాల ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగం నుండి గ్రహిస్తాయి. రాష్ట్రప్రభుత్వాలకు కొన్ని అంశాలలో స్వయంప్రతిపత్తి (autonomy) ఉంటుంది.

**అధికారాల పంపకం :** కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య అధికార పంపకం ఉండటం సంయుక్త (federal ) ప్రభుత్వ లక్షణం. భారత రాజ్యాంగంలో కేంద్రజాబితా, రాష్ట్ర జాబితాలుగా రెండు రకాలుగా అధికార వికేంద్రీకరణ ఉంటుంది.

(సశేషం)

# మయసభలా ఉందే... : కామినేని



**రా.వాప్రతినిధి – అమరావతి :** అమరావతిలో ఇప్పటిదాకా నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలు రెండు. అవి ఒకటి తాత్కాలిక సచివాలయం కాగా, రెండోది ఇటీవలే అందుబాటులోకి వచ్చిన తాత్కాలిక అసెంబ్లీ భవన సముదాయం. అధికారులు మంత్రుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక సచివాలయంలో లోపల వసతులు కాస్తంత మెరుగ్గానే ఉన్నా, విశాలంగా లేవంటూ అందులో అడుగుపెట్టేందుకు ససేమిరా అన్న మంత్రుల అలకలు మనకు తెలిసిందే. ఎలాగోలా మంత్రులను దారికి తెచ్చుకున్న చంద్రబాబు...తాత్కాలిక అసెంబ్లీ భవన సముదాయంపై తెలుగు తమ్ముళ్లు విసురుతున్న చలోక్తులకు ఎలా కళ్లెం వేస్తారో చూడాలి.ఉదయం ఉభయ సభలు ప్రారంభం కాగానే... అధికార పార్టీ సభ్యులతో పాటు విపక్ష సభ్యులు కూడా నిర్ణీత సమయానికే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తమ పార్టీ లెజిస్లేచర్ కార్యాలయాలు (టీడీఎల్పీ – వైసీఎల్పీ) ఎక్కడున్నాయన్న విషయం అర్థం కాక తెలుగు తమ్ముళ్లు తికమక పడ్డారట. ఇక బాబు కేబినెట్లో కీలక శాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ అయితే... అసలు శాసనమండలి ప్రవేశ ద్వారం ఎక్కడుందో కూడా కనిపెట్టలేకపోయారట. ఈ క్రమంలో ఆయన వేరే హాలులోకి ప్రవేశించబోయి లోపలకు చూసిన వెంటనే అది మండలి భవనం కాదని తెలుసుకుని వెనుదిరిగారట. ఈ విషయాన్ని గమనించిన మీడియా ప్రతినిధులు అదేంటీ మీరు కట్టించిన భవనం ప్రవేశ ద్వారాలు కూడా మీకు తెలియవా? అంటూ ప్రశ్నించారట. దీంతో స్పందించిన తప్పని పరిస్థితిలో నోరు విప్పిన కామినేని అసెంబ్లీ భవన సముదాయం మయసభలా ఉందని వ్యాఖ్యానించారట. ఏదెక్కడుందో అర్థం కావడం లేదు. మంత్రుల చాంబర్లు – ఆయా పార్టీల శాసనసభాపక్ష కార్యాలయాలు – అసెంబ్లీ గేట్లు – మండలి ప్రవేశ ద్వారాలు ఎక్కడున్నాయన్న విషయంపై నేనొక్కడినే కాదు. చాలా మంది తికమక పడుతున్నారు. కొత్త భవనం కదా. ఇంకా అలవాటు కాలేదు. అలవాటు పడేదాకా ఈ ఇబ్బంది తప్పదులి అని కామినేని వివరణ ఇచ్చారట. ఇక టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కూడా ఇదే తరహా వాదనను వినిపించడం గమనార్హం.

## అంతని...ఇంతని .. అలా చేశారా ?

చంద్రబాబు ఏం చేసినా హైటెక్‌లో ఉంటుందని, ప్రపంచ స్థాయిలో ఉంటుందని , ఆరునెలల్లో నిర్మించామని చెబుతున్న అసెంబ్లీని ప్రతిపక్షమేకాకుండా అధికార పక్షం కూడా విమర్శించడం అసెంబ్లీ నిర్మాణం ఎంత అపసవ్యంగా నిర్మించారో తెలపడానికి ఒక ఉదాహరణ. ఈ అయోమయ డిజైనింగ్ పై చివరకు మంత్రులు కూడా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఏకంగా కొత్త అసెంబ్లీని ఉద్దేశించి అసంత ృప్తితో.. ఇదేం అసెంబ్లీ యాక్... అని అన్నట్లుగా టీడీపీ వర్గాల్లో వినిపిస్తోంది. అసెంబ్లీ నిర్మాణంపై పలువురు మంత్రులు.. చంద్రబాబుకు భజన చేసేవారు మాత్రం చంకలు గుద్దుకుంటున్నారు. మంత్రి దేవినేని ఉమా కూడా ఇదే తరహాలో అసెంబ్లీ చాలా బాగుందని వ్యాఖ్యానించగా, మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే మండిపడ్డారట. బాత్రూంలో నీళ్లకు కూడా దిక్కులేదంటూ వ్యాఖ్యానించారని తెలుస్తోంది. దీంతో కంగుతిన్న దేవినేని సైలెంటయిపోయారట. కాగా బాత్రూమ్కు వెళ్లిన తర్వాత చేతులు కడుక్కునేందుకు నీరు కూడా రావడం లేదని మరో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కూడా అసంత ృప్తి వ్యక్తం చేశారు. బాత్ రూంలు కూడా మగవాళ్లకు ఆడవాళ్లకు పక్కన పక్కనే నిర్మించడం పైనా పలువురు మహిళా సభ్యులు.. అధికారిణులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని గురువారం మహిళా ప్రజాప్రతినిధులు నేరుగా సీఎంను కలిసి వివరించారు. ఇటీవల కాలంలో చంద్రబాబు అచ్చెన్నకు తరచూ క్లాస్ పీకడంతో చంద్రబాబు అంటే అచ్చెన్న మండిపడుతున్నట్లు తెలుస్తోంది.

– హిడింబిణి



వసుంధర రాజే, దేవేంద్రఫడ్నవీస్, శివరాజ్ సింగ్ చౌహాన్

# ముగ్గురు సీఎంల రాజీనామా ?

**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీలో కీలకమైన మార్పులు జరగనున్నట్టుగా తెలుస్తోంది. అటు రాష్ట్రాలకు ముఖ్యమంత్రుల నియామకం, ఇటు కేంద్రమంత్రి వర్గంలో మార్పులు ఒకదానిపై మరోటి ప్రభావం చూపుతున్నట్టుగా సమాచారం. ఇప్పటికే గోవాలో ముఖ్యమంత్రి పదవి కోసం రక్షణశాఖ మంత్రి పారికర్ తో రాజీనామా చేయించి గోవా ముఖ్యమంత్రిగా పంపారు. కాగా మరో ముగ్గురు ముఖ్యమంత్రులతో రాజీనామా చేయించి వారిని కేంద్ర మంత్రులుగా చేయలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవీస్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లు ఈ జాబితాలో ఉన్నారు. వీరి పనితీరు మోడీకి బాగా నచ్చిందని, వారి సేవలు రాష్ట్రాలకు పరిమితం అయితే చాలదు.. దేశానికి కావాలని అనుకుంటున్నారట. పారికర్ కు గతంలో ఏ లాజిక్కులనైతే చెప్పారో.. ఇప్పుడు వీరి విషయంలోనూ అదే విషయాన్ని చెబుతున్నారు. వీరి స్థానాల్లో ఆ మూడు రాష్ట్రాలకూ కొత్త వ్యక్తులను సీఎంలుగా నియమించడానికి కూడా కసరత్తు మొదలైందట.

# గట్టెక్కిన పారికర్

**ప్రభుత్వానికి అనుకూలంగా 22 ఓట్లు వ్యతిరేకంగా 16 ఓట్లు**



**పనాజీ :** గోవా అసెంబ్లీలో మనోహర్ పారికర్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గింది. 40 మంది సభ్యులు గల అసెంబ్లీలో 22 మంది ఎమ్మెల్యేలు పారికర్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో ప్రస్తుతానికి గోవాలో రాజకీయ అనిశ్చితికి తెరపడింది. వాస్తవంగా గోవాలో కాంగ్రెస్ 17 మంది ఎమ్మెల్యేలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించలేదు. కేంద్రంలో అధికారంలో ఉండటంతో అన్ని విధాలా లోబరచుకొని చిన్నాచితకా పార్టీలు, ఇండిపెండెంట్ల మద్దతుతో బీజేపీ ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.విశ్వాస పరీక్షకు కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వజిత్ రాణె దూరంగా ఉన్నారు. విశ్వాస పరీక్షకు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. విశ్వాస పరీక్షలో నెగ్గిన తర్వాత పారికర్ మాట్లాడుతూ కంగ్రెస్‌కు కావాల్సినంత సంఖ్యాబలం లేదని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటు చేసింది. విశ్వాస పరీక్షలో తామేనెగ్గామని పారికర్ తెలిపారు. విశ్వాస పరీక్షలో తాము నెగ్గినందున రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దిగ్విజయ్‌సింగ్ తన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేయాలని సీఎం డిమాండు చేశారు. సభలో 23 మంది సభ్యుల బలం ఉందని దేశ ప్రజలకు నిరూపించామని అన్నారు. తమకు సంఖ్యా బలం ఉందని చెప్పడమే కాకుండా సభలోనూ నిరూపించుకున్నామన్నారు. మొదటి నుంచీ కాంగ్రెస్‌కు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సినంత సంఖ్యాబలం లేదని అన్నారు. కేవలం కాంగ్రెస్ గందరగోళం సృష్టించడానికే ప్రయత్నించిందన్నారు. దిగ్విజయ్‌సింగ్ ఇక ఆనంతం పొందడం కోసం గోవా రావాలని, పనిచేయడానికి కాదని ఎద్దేనా చేవారు. గోవాలో బీజేపీకి కేవలం 12 మంది శాసనసభ్యులు బలమే ఉంది. గోవా ఫార్వర్డు పార్టీ (జిఎఫ్‌పీ) ఎమ్మెల్యేలు ముగ్గురు, మహారాష్ట్రవాదీ గోమంతక పార్టీ(ఎంజీపీ)కి చెందిన ముగ్గురు, ముగ్గుకు ఇండిపెండెంట్లు ఎన్‌సీపీ సభ్యుడు విశ్వాస పరీక్షకు అనుకూలంగా ఓటేశారుజ బీజేపీ ఎమ్మెల్యే ఒకరు ప్రొటెం స్పీకర్‌గా ఉన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేసి పారికర్ బలనిరూపణ చేసుకున్నారు.

## బీజేపీ -ఆర్ఎస్ఎస్‌లకు ప్రత్యామ్నాయం అవసరం : సీపీఎం



**న్యూఢిల్లీ :** బీజేపీ – ఆర్ఎస్ఎస్‌లకు ఒక స్పష్టమైన ప్రత్నామ్నాయ రాజకీయ, సైద్ధాంతిక వేదిక అవసరాన్ని ఉత్తరప్రదేశ్ ఎన్నికల తీర్పు తెలియజేస్తోందని సీపీఎం పేర్కొంది. 'నయా ఉదార విధానాలకు ఒక ప్రత్నామ్నాయ విధాన వేదిక, హిందూ మతోన్మాద అజెండాకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరం' అని సీపీఎం పత్రిక 'పీపుల్స్ కీయం ద్వారా బలమైన హిందూ మత జాతీయ వాదాన్ని ఎదుర్కోవచ్చు. లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశంలో మితవాద ఎదురుదాడి ప్రారంభమైందన్న దానికి సూచిక ఉత్తరప్రదేశ్ లో బీజేపీ విజయం. ఒకటిగా కలిపిసోయిన నయా ఉదాం, హిందూత్వం భవిష్యత్తులో మరింత సుస్థిరం కావచ్చు. ఫలితంగా లౌకిక విలువలు, భావనా ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం మక్కులపై మరిన్ని దాడులు జరుగుతాయి. అన్ని రంగల్లో ప్రజాస్వామ్య హక్కులపై మరిన్ని దాడులు జరుగుతాయి. అన్ని రంగాల్లో సమైక్య ఉద్యమాల ద్వారా ప్రతిఘటించి పెరుగుతాయి. అన్ని రంగాల్లో సమైక్య ఉద్యమాల ద్వారా ప్రతిఘటించి పెరగు తున్న నిరంకుశత్వాన్ని నిలువరించ వలసొన అవసరం ఉంది' అని సీపీఎం పేర్కొంది. లోక్‌సభలో పోలైన ఓట్ల శాతం కంటే తక్కువగా అంటే 41.4 శాతం ఓట్లు మాత్రమేయూపీ లో బీజేపీకి వచ్చాయి. 'నిజానికి లోక్‌సభ ఎన్నికలలో నరేంద్ర మోడీ, అమిత్‌షాలు మత శక్తులను విస్తృతమైన కులాల కూటమితో మమేకం చేయడం ద్వారా సాధించిన మహా విజయాన్ని, ఈసారి మత జాతీయవాద ప్రచారాన్ని జత చేసి కొనసాగిం చారు' అని సీపీఎం తెలిపింది. అభివృద్ధిని సాధించే బలమైన జాతీయవాద నాయకుడిగా మోడీ కొనసాగు తున్నాడు. ఇందులో మెజార్టీ మతాంశం మిళితమై ఉంది. ఉత్తరప్రదేశ్‌కు బీఎస్‌పీ, సమాజ్‌వాది పార్టీ వంటివి ప్రాంతీయ పార్టీలే అయినప్పటికీ అవి ప్రాంతీయ గుర్తింపు కలిగి లేవని సీపీఎం వివరించింది. 'రాష్ట్రంలో ప్రాంతీయ రాజకీయాలు చేపట్టలేదు. ఉత్తరప్రదేశ్ ప్రజలు తాము రాష్ట్ర విశిష్ట గుర్తింపు గలిగి ఉన్నామని భావించడం లేదు. అదే సమయంలో జాతీయవాదులుగా ఉన్నారు. ఈ విషయంలో వారు జాతీయవాదానికి ఎక్కువగా స్పందించారని చెప్పవచ్చు.

# చంద్రబాబు మైనార్టీల ఆత్మబంధువు : హిదాయత్

**రా.వాప్రతినిధి – అమరావతి :** మైనార్టీల సంక్షేమానికి 2017–18 ఆర్థిక సంవత్సరంలో రు.840 కోట్లు కేటాయించడం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మైనార్టీలకు ఆత్మబంధువయ్యారని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ హిదాయత్ చెప్పారు. మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేషన్ డైరక్టర్లతో కలిసి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 340 – 345 కోట్లుగా ఉన్న మైనార్టీ బడ్జెట్‌ను రాబోయే ఆర్థిక సంవత్సరానికి రు.840 కోట్లు మంజూరు చేయడంతో ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియచేశారు. మైనార్టీ విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యలను అందించాలన్న లక్ష్యంతో రూ. 260 కోట్ల , రెసిడెన్షియల్ పాఠశాలలకు వంద కోట్లు కేటాయింపులు చేశారన్నారు. ఈ ఏడాది స్వయం ఉపాధి శిక్షణ కింద 13,700 మందికి అవకాశం కల్పించామన్నారు. 2017–18 లో రూ. 98 కోట్లు స్వయం ఉపాధికి బడ్జెట్ ని కేటాయించి 20 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ అందించనున్నట్లు ఆయన వివరించారు. దుల్హాన్ పథకంలో ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున 17 వేల మందికి ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. వచ్చే ఏడాది అర్హులైన ప్రతి ఒక్కొరికి దుల్హాన్ ఈ పథకంలో ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముస్లిం ఇమామ్, మౌజన్‌లకు గౌరవ పారితోషకం అందించడానికి రూ. 24 కోట్ల కేటయింపులు చేశామని, ఆదాయం అంతగా లేని మసీదులకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు 15 కోట్ల రూపాయలు కేటాయింపులు చేయడం సంతోషదాయకం అన్నారు.



వక్ఫ్ ఆస్తులు పరిరక్షణ కోసం కమీషనరేట్ ఏర్పాటు చేసి ఆస్థుల సర్వేకు రూ. 50 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. ముస్లిం రిజర్వేషన్ కేసు సుప్రీం కోర్టులో ఉందని , ఆ రిజర్వేషన్స్ కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు 25 కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా, జెరూసలేం యాత్రకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు లక్షా 25 వేల మందికి స్కాలర్‌షిప్స్ అందించామని వీటిని లక్షా50వేలకు ఈ ఆర్థిక సంవత్సరంలో పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో చైర్మన్ ఎండి. హిదాయత్ తో పాటు డైరక్టర్లు శ్రీమతి సయ్యద్ నర్గీస్ , జనాబ్ మోహిద్దీన్ , బషీర్ అహ్మద్ , మైనార్టీ నాయకులు సయ్యద్ సుభాని , ఖలీల్ , కుద్దీస్ , బాబుఖాన్ తదితరులు ఉన్నారు.

**మైనార్టీ నిధులపై శ్వేత పత్రం విడుదల చేయండి : ఆసిఫ్**

**రాజధాని ప్రతినిధి,విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ ఆసిఫ్ తెలిపారు. ప్రభుత్వం రూ.712 కోట్లు ఖర్చు చేసిందనటం వాస్తవంకాదన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ మైనార్టీలకు కేటాయించిన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయలేదన్నారు. దీని మీద శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ఖర్చు చేసిన పూర్తి వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించాలని ఆయన డిమాండు చేసారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు రుణాలు ఇస్తున్నామని చెప్తున్నారని,ఇప్పటి వరకు కేవలం 20 మందికే రుణాలు ఇచ్చారన్నారు. విద్యార్థి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. ముస్లింల కోసం హజ్‌హౌస్ నిర్మాణం మొదలు పెట్టలేదన్నారు. ఇమాంలకు వేతనాలు ఇవ్వటంలో తెలుగుదేశం ప్రభుత్వం విఫలమైందన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత జలీల్‌ఖాన్‌కు లేదన్నారు. జలీల్‌ఖాన్ గురించి మాట్లాడుతూ ఆయనకు ముస్లింలకే సిగ్గు తెచ్చారని, వైఎస్సార్‌సీపీ టిక్కెట్టు పై గెలిచి పార్టీ మారిన జలీల్ ఖాన్‌కు ముస్లింలు సపోర్టు చేయరని ఆసిఫ్ తెలిపారు.

# నాన్న కోరిక తీరాకే ఏడుస్తా !



## బాధను కసిగా మార్చుకొని ప్రజలకోసం పనిచేస్తా : అఖిలప్రియ

**రా.వా ప్రతినిధి - అమరావతి :** నంద్యాలలో పేదల కోసం 10వేల ఇళ్ళుకట్టాలి, అక్కడ రోడ్లు విస్తరించాలి, నంద్యాలను బాగా అభివృద్ధి చేయాలని నాన్న బాగా పరితపించారని, వాటిని ముఖ్యమంత్రి సహాయంతో త్వరగా పూర్తిచేసి తండ్రి కోరిక తీర్చిన తర్వాత బాగా ఏడవాలని అనుకుంటున్నానని భూమా నాగిరెడ్డి కుమార్తె ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ కన్నీటి పర్యంతమయ్యారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన భూమా నాగిరెడ్డి సంతాప తీర్మానానికి ఆమె హాజరయ్యారు. తనను సభకు రావాలని ఎవరూ ఆహ్వానించలేదని, కాని తానే నాన్న కార్యక్రమానికి హాజరుకావాలన్న ఉద్దేశంతోవచ్చానన్నారు. అమరావతి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తాను తొలిసారిగా మాట్లాడాలని అనుకున్నానని, కాని నాన్న గరించి ఇలా మాట్లాడాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదని కంటతడిపెట్టారు. ఉబికి వస్తున్న కన్నీళ్ళను దిగమింగు కుంటూనే అమ్మా, నాన్న కోసం, వారి ఆశయాల సాధకోసం బాధను కసిగా మార్చుకొని పనిచేయాలన్న పట్టుదల పెంచుకుంటున్నానన్నారు. ముగ్గురు అన్న దమ్ములు చనిపోయినా ధైర్యంగా వున్న నాన్న ఇటీవల అమ్మ చాలా ప్రేమగా చూసుకునేవారు. వారిద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్స్. అమ్మ చనిపోయిన తర్వాత కూడా రోజూ అమెకు దీపం పెట్టిన తర్వాతే పడుకునేవారు. అన్నదమ్ములందరూ చనిపోయినా వారి పిల్లలందర్నీ ప్రయోజకుల్ని చేశారు. ఇప్పటికీ అందరూ ఉమ్మడి కుటుంబంగానే వుంటున్నాం. ఇదంతా నాన్న గొప్పతనమే. ఆయనకు కుమార్తెగా పుట్టడం గర్వంగా భావిస్తున్నారని ఆమె చెప్పారు. తాను చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా ఎన్నికైనా నాన్న చేయి పట్టుకొని అసెంబ్లీలోకి అడుగుపెట్టడంతో ఎటువంటి భయంకాని, ఆందోళన కాని కల్గలేదన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అందరికీ తనను పరిచయం చేశారని, తన కోసమే నాన్న ఈ మూడేళ్ళు బ్రతికాడేమో అనిపిస్తుందని ఆమెవాపోయారు. నాన్న గురించి అసెంబ్లీలో సభ్యులు అనేకమంది గొప్పగా చెప్పడం తనకు గర్వంగా వుందని చెపుతూ వారికి కృతజ్ఞతలు తెలిపిన అఖిల ప్రియ, ప్రతిపక్ష సభ్యులు కూడా వచ్చి సంతాపం తెలియజేస్తారని ఆశించానని చెప్పారు. ప్రతిపక్ష నేత జగన్ ఇబ్బందుల్లో వున్నప్పుడు అమ్మా, నాన్నలు వారి పిల్లల్ని వదిలిపెట్టి మరీ వారికి సహాయపడ్డారని, కాని వారు దానిని మర్చిపోయి రాకపోవడం వారి విజ్ఞతకే వదలివేస్తున్నానంటూ తన సీటులో కూర్చున్నారు.

**బావ, బావమరిదిలాగాకుండా స్నేహితుల్లా వుండేవారం-మోహనరెడ్డి**

మేమిద్దరం బావ, బావమరిది అయినప్పటికీ చిన్నప్పటినుండి స్నేహితుల్లా కల్సి తిరిగామని ఎమ్మెల్యే ఎస్వీ మోహనరెడ్డి చెప్పారు. నాగరెడ్డి చిన్నప్పటినుండీ అనేక ఇబ్బందులు పడ్డాడు. 5వ తరగతి చదువుతున్నప్పుడే కిడ్నాప్ ప్రయత్నం జరిగింది. దీంతో ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరంగా వుంచాలని తామిద్దర్నీ మద్రాసు, బెంగళూరుల్లో చదివించారు. కాని ఇంటర్ చదువుతుండగానే నాగిరెడ్డి తండ్రిని హత్య చేయడంతో రాజకీయాల్లోకి రావల్సి వచ్చింది. ఒకసారి నేదురుమల్లి జనార్ధనరెడ్డి సేఎంగా వుండగా ఉప ఎన్నికలో చివరిరోజు నాగిరెడ్డి నామినేషన్‌కు వెళుతుంటే బాంబులతో దాడి చేశారు. కాని తప్పించుకొని ఒక లారీలో వెళ్ళి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికంటేనే మాకు భయమేస్తోంది. వారి నాన్న, అమ్మ, ముగ్గురు సోదరులు, భార్య, చివరకు తను కూడా ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగానే చనిపోయారని వివరించారు.

## రాయపూడిలో మే నుంచి శాశ్వత భవనాల నిర్మాణం

**రా.వా. ప్రతినిధి, అమరావతి :** నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సంబంధించి శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణం మే నుంచి రాయపూడిలోప్రారంభిస్తామని, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ఇక్కడ అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేంద్ర నిధులతో రాజధాని భవనాలను శాశ్వతంగా నిర్మించాల్సి ఉందని, అసెంబ్లీ సచివాలయం, రాజ్‌భవనన్,హైకోర్టు భవనాలకు డిజైన్ల రూపకల్పన జరుగుతోందని, మే నెలలో వీటి పైలెట్ పనులు మొదలు పెడతామన్నారు. 2018 చివరి నాటికి వీటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. లోపల నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను ముందుగా తయారు చేయించి పనులు ప్రారంభించాలని భావిస్తున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల కోసం వచ్చే మూడేళ్ళలో సుమారు రూ.25 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## రుణాల వేటలో ఎన్ఎండీసీ

**షేర్ బై బ్యాక్, డివిడెండ్‌తో తరిగిపోయిన నగదు నిల్వలు**

**హైదరాబాద్:** దేశీయ ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి దిగ్గజం ఎన్ఎండిసి.. రెండు దశాబ్దాల అనంతరం రుణాలను తీసుకునేందుకు సమాయత్తమవుతోంది. ముడి ఇనుప ఖనిజం ధరలు పడిపోవటం, షేర్ల బైబ్యాక్, డివిడెండ్లు వంటి కారణంగా కంపెనీ వద్ద ఉన్న నగదు నిల్వలన్నీ హరించుకుపోనున్నాయని ఎన్ఎండిసి ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టుల కోసం రుణలను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుందని ఆయన చెప్పారు. అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు క్షీణించటంతో గడచిన కొన్ని త్రైమాసికాలుగా లాభాలు హరించుకుపోయాయని ఆయన తెలిపారు. మరోవైపు చత్తీస్‌గఢ్‌లో నాగర్నార్ వద్ద ఏర్పాటు చేస్తున్న 30 లక్షల టన్నుల సామర్థ్యం గల స్టీల్ ప్లాంట్ కోసం వెచ్చిస్తున్న వ్యయాలు భారీగా పెరిగిపోవటం కొంత దెబ్బతీసిందని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణ వ్యయం 15,525 కోట్ల రూపాయలుగా ఉండగా ఎన్ఎండిసి ఇప్పటి వరకు ఈ ప్లాంట్ కోసం 10,800 కోట్ల రుపాయలు వెచ్చించింది.

నాగర్నార్ ప్లాంట్ కోసం కంపెనీ ఏటా 2,500 కోట్ల రుపాయల నుంచి 3,000 కోట్ల రూపాయల వరకు వెచ్చిస్తూ వస్తోంది. ఇటీవలి షేర్ బైబ్యాక్‌తో ప్రభుత్వ ఖజానాకు 7,500 కోట్ల రూపాయలు వెళ్లిపోవటంతో నగదు నిల్వలు భారీగా తగ్గిపోయాయని తెలిపారు.ఇదే సమయంలో 2015-16 ఆర్థిక సంవత్సరానికి 4,300 కోట్ల రుపాయలు,ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,580 కోట్ల రుపాయల మధ్యంతర డివిడెండ్‌ను ప్రభుత్వనికి ఎన్ఎండిసి చెల్లించింది. ప్రస్తుతం ఎన్ఎండిసిలో ప్రభుత్వనికి 80శాతం వాటాలున్నాయి. కాగా 2015-16 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఎన్ఎండిసి వద్ద 18,000 కోట్ల రూపాయల నగదు నిల్వలున్నాయి. నగదు నిల్వలన్నీ హరించుకుపోవటంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులను సమీకరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉన్న తాధికారి తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్మాణంలో ఉన్న నాగర్నార్ స్టీల్ ప్లాంట్ కోసం 3,000 కోట్ల రూపాయల వెచ్చించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు బైలదిల్లా నుంచి జగదల్‌పూర్ మీదుగా వైజాగ్ వరకు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో స్లర్రీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్ఎండిసి భావిస్తోందని ఆయన తెలిపారు.2015-16 ఆర్థిక సంవత్సంరలో కంపెనీ మొత్తం రాబడులు ఏకంగా 6,000 కోట్ల రూపాయల నుంచి 3,000 కోట్ల రూపాయలకు పడిపోయింది.

## కేరళలో ఇరోమ్ షర్మిళ

**తిరువనంతపురం :** మణిపూర్ ఉక్కు మహిళ ఇరోమ్ షర్మిళ నెలరోజులపాటు కేరళలో గడపనున్నారు. సైనిక దళాలకు ప్రత్యేక అధికారాలను తొలగించాలని 16 సంవత్సరాలపాటు దీక్ష చేపట్టిన షర్మిళకు ఈ ఎన్నికల్లో కేవలం 90 ఓట్లు లభించాయి. దీంతో ఆమె నిరాశ చెందినట్లు తెలుస్తోంది. షర్మిళ 45వ పుట్టిన రోజు. ఈ నేపథ్యంలో మానసిక ప్రశాంతత కోసం కేరళలోని గిరిజన ప్రాంతం అట్టపాడేలో ఆమె గడపనున్నారు. ప్రముఖ దాత ఉమా ప్రేమన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతి ఆశ్రమంలో ఆమె సేదతీరనున్నారు. మణిపూర్‌లోని తౌబల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఇబోబి సింగ్‌పై షర్మిళ పోటీ చేశారు.

## రోడ్డుమీదనే ధాన్యం ఆరబోత

**చిట్టమూరు :** కంటికి నిద్రలేక, కడుపునిండా తిండిలేక, సకాలంలో వర్షాలు లేక, రాత్రి పగలు తేడా తెలియకుండా కష్టపడి బోరునీటితోనో లేక ఊటబావుల నీటితోనో పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, ధాన్యం నిల్వచేసే ప్రభుత్వ గిడ్డంగులు లేకపోవడంతో నెల్లూరు జిల్లా రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2015 నవంబరులో కురిసిన భారీ వర్షం తప్ప జిల్లాలో సరైన వర్షాలు పడక అరకొర నీటితో వరిపైరు వేసారు. కష్టనడి పంటలు పండించినా, గిట్టుబాటు ధరలేకపోవడంతో చేసిన అప్పులు తీర్చుకోలేక పడ్డ కష్టాలను నెమరువేసుకుంటూ ధాన్యాన్ని రోడ్ల మీద పట్టలు వేసి ఆరబెట్టుకుంటున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని నిల్వ చేసుకుందామంటే ప్రభుత్వ గోడౌనులు లేకపోవడంతో వాకాడు మార్కెట్ యార్డుకు తరలించి నిల్వచేద్దామన్న రైతుకు అక్కడ పరపతి లేదా బడా పలుకుబడిన రైతు అయినా అయి ఉండాలి. అది లేకపోవడంతో సాధ్యం కాదని రైతులు వాపోతున్నారు.

## గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు : మంత్రి రావెల



**రా.వా ప్రతినిధి, అమరావతి :** ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తం అయింది. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు రక్తహీనతతో మృతిచెందడంపై ప్రభుత్వం స్పందించి, ఈ నిర్ణయం తీసుకుంది. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి శ్రీ రావెల కిషోర్ బాబు తెలియజేశారు. ఎండల తీవ్రత వల్ల కాని, సరియైన పౌష్టికాహారం అందకపోవడం వల్ల కాని, వేరే ఇతర కారణాల వల్ల పిల్లలు రక్తహీనతకు లోనవడం తమ దృష్టికి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు, పాడేరు, రంపచోడవరం, చింతూరు పీవో ఐటీడీఏలతో పాటు అన్ని జిల్లాల జిల్లా వైద్యాధికారులతో చర్చించామన్నారు. విద్యార్థులకు గిరిజనలుకు వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు, పౌష్టికాహారం తీసుకొనే విధంగా గిరిజనులను చైతన్యం పరచాలని కోరామన్నారు. అంతేగాక రక్తహీనతతో బాధపడుతున్న గిరిజన విద్యార్థులు, పిల్లలకు తక్షణం రక్తం ఎక్కించాల్సి వస్తే అందుకు సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని మంత్రి తెలిపారు.

## అసెంబ్లీ వద్ద పటిష్ట బందోబస్తు

**ఏర్పాట్లను పర్యవేక్షించిన రూరల్ ఎస్పీ నారాయణ్ నాయక్**



**రా.వా ప్రతినిధి - గుంటూరు :** వెలగపూడిలోని అసెంబ్లీ వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్పీ నారాయణ్ నాయక్ ఆధ్వర్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. రూరల్ ఎస్పీ అసెంబ్లీ వద్ద మకాం వేసి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. డ్రైవర్లు, వ్యక్తిగత సిబ్బందిని అసెంబ్లీలోకి అనుమతించబోమని రూరల్ ఎస్పీ స్పష్టం చేశారు. వారు వాహనాల పార్కింగ్ వద్దే వేచి ఉండాలని, అందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఉదయం నుండే రూరల్ ఎస్పీ ఆధ్వర్యంలో అణువణువు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. బందోబస్తులు పర్యవేక్షించే అధికారులు, సిబ్బందికి రూరల్ ఎస్పీ తగు ఆదేశాలు జారీ చేస్తూ వారిని అప్రమత్తం చేశారు. అసెంబ్లీకి వెళ్ళే అన్ని ద్వారాలు, ప్రధాన కూడళ్లలో సిబ్బందిని నియమించి ఎటువంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించిన తరువాతనే లోనికి అనుమతించారు.

**చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు**

అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అర్బన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వెలగపూడిలోని అసెంబ్లీకి వెళ్ళే మార్గాలన్నీ అర్బన్ జిల్లా పరిధిలో ఉండడంతో ఎస్పీ పోస్టులు, అసెంబ్లీకి చేరుకునే రూట్లలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. రహదారులలో నిరంతరం బాంబు, డాగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అనుమానిత వ్యక్తులు, ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సిబ్బందిని అర్బన్ ఎస్పీ త్రిపాఠి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహన చోదకులు అసెంబ్లీ సమావేశాల సమయాలను తెలుసుకుని నిబంధనలు పాటించాలని అర్బన్ ఎస్పీ సూచించారు.

## వరలక్ష్మీ పాలిటెక్నిక్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



**రా.వా. ప్రతినిధి, మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు :** ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల రీత్యా, జి.ఓ.ఎంఎస్ 865, 27-11-1982 ప్రకారం వరలక్ష్మీ పాలిటెక్నిక్ కాలేజీని ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని వివిధ రాజకీయ పార్టీ, ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్లు, ఇతర ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జరిపాయి. వరలక్ష్మీ పాలిటెక్నిక్ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు హెచ్‌ఆర్ఎ, డీఏ, వార్షిక ఇంక్రిమెంట్లు బేసిక్ జీతానికి సంబంధించి కోత విధించిన 33 నెలల బకాయిలను, పదవీవిరమణ బకాయిలను వెంటనే చెల్లించాలని వారు డిమాండు చేశారు. మార్చి 20న కాలేజీ నుంచి ధర్నా నిర్వహించి, 21న యాజమాన్యంతో అఖిల పక్ష సమావేశం జరుపుతామన్నారు. ఈ నెల 23న ఉదయం 9 గంటల నుంచి అన్ని యూనియన్లతో కలసి ధర్నా పికెటింగ్ నిర్వహిస్తామన్నారు.

**బ్యాక్‌లాగ్**

## ఉద్యోగాల కోసం ధరఖాస్తులు

**రా.వా. ప్రతినిధి, మచిలీపట్నం :** కృష్ణాజిల్లాలో వివిధ శాఖలలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేయబడిన బ్యాక్ లాగ్ (క్లాస్-4) ఉద్యోగాల కొరకు పూర్తిగా కృష్ణా జిల్లా స్థానికత కలిగిన వారి నుంచి నమూనా దరఖాస్తులు ఈ నెల 25న సాయంత్రం 5 లోపు ఆయా శాఖల అధిపతులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపవలసి వుంటుంది. మరి ఏ ఇతరత్రా పంపిన, నేరుగా దాఖలు చేసిన దరఖాస్తులు అంగీకరిచబడవు.

## గూగుల్‌తో 'జియో' జట్టు




**న్యూఢిల్లీ :** తక్కువ ధరలో 4జీ స్మార్ట్‌ఫోన్‌ను అభివృద్ధి చేసేందుకు సెర్చింజన్ గూగల్‌తో రిలయన్స్ జియో జట్టుకట్ట నుంది. స్మార్ట్‌ఫోన్‌ను ఈ ఏడాది చివరకల్లా విపణిలోకి తీసుకొచ్చేందుకు ప్రయాత్నిస్తున్నట్లు జియో వెల్లడించింది. గూగుల్ బ్రాండ్ ఇమేజి సాయంతో మార్కెట్‌లో విస్తరిస్తామని జియో తెలిపింది. ఇరుసంస్థల భాగస్వామ్యంతో వచ్చే ఏడాది స్మార్ట్ టీవీలకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎల్‌వైఎఫ్ స్మార్ట్‌ఫోన్లు, పాకెట్ రూటర్స్ తయారీ కోసం చైనా, తైవాన్ దేశాల తయారీ సంస్థలను రిలయన్స్ ఇండస్ట్రీస్ సంప్రదించింది. వోల్టే ఫీచర్ ఫోన్ల తయారీకి కోసం లావా ఇంటర్నేషనల్ చైనా సంస్థలతో రిలయన్స్ జియో కలసి పనిచేస్తుంది. కేవలం రూ. 1000లకే 4జీ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి తీసుకోచ్చేందుకు రిలయన్స్ ప్రయత్నాలు చేస్తోంది.

## కొత్త నోట్ల ఖర్చులు




**న్యూఢిల్లీ:** పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రభుత్వతం కొత్తగా రూపొందించిన రూ.500, రూ.2000 నోట్ల ముద్రణ ఖర్చును కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ రాజ్యసభకు లిఖిత పూర్వంగా వివరించారు.కొత్త రూ.500 నోటు ప్రింటింగ్‌కు రూ.2.87 నుంచి రూ.3.09, కొత్త రూ.2000 నోటు ముద్రణకు రూ.3.54 నుంచి రూ.3.77 మేర ఖర్చవుతోందని సభకు మేఘవాల్ తెలిపారు. కొత్త నోట్ల ప్రింటింగ్ ఇంకా కొనసాగుతున్నందున మొత్తం ఖర్చు వివరాలు ప్రస్తుతం వెల్లడించడం సాధ్యం కాదన్నారు.

2017 ఫిబ్రవరి 24 నాటికి దేశంలో రూ.11.64 లక్షల కోట్ల కరెన్సీ చెలామణీలో ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ రాజ్యసభకు వివరించారు. 2016 డిసెంబర్ 10 నాటికి రద్దైన పాత రూ.500, రూ.1000 నోట్ల కరెన్సీ సుమారు రూ.12.44 లక్షల కోట్లు బ్యాంకుల్లో జమ అయ్యాయని, అయితే దీనికి సంబంధించిన వెరిఫికేషన్ ఇంకా జరుగుతోందన్నారు.కొత్త నోట్ల కొరతపైనా ఆయన స్పందిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న 2.18 లక్షల ఏటీఎంలలో 2017 జనవరి 4 నాటికి 1.98 లక్షల ఏటీఎంలను పునరుద్ధరించినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి తెలిపారు. కొత్త నోట్ల కొరత త్వరలోనే తీరుతుందన్నారు.

## పాకిస్థాన్ కొత్త పన్నాగం



**ఇస్లామాబాద్ :** ఇప్పటికే భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య కాశ్మీర్ వివాదం ఆరని చిచ్చుగా మారినప్పటికీ పాకిస్తాన్ తన బుద్ధి మార్చుకోకుండా భారత్కు ఆందోళన కలిగించే నిర్ణయం తీసుకుంది. వివాదాస్పద పాక్ ఆక్రమిత కాశ్మీర్ సరిహద్దులకు ఆనుకుని ఉన్న గిల్గిత్-బాల్టిస్తాన్ ప్రాంతాన్ని అయిదో రాష్ట్రంగా ప్రకటించాలని అనుకుంటున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. భారత్ కూడా గిల్గిత్-బాల్టిస్తాన్ ప్రాంతం తమ భూభాగమేనని వాదిస్తోంది. జమ్మూ కాశ్మీర్ మ్యాప్లో సైతం ఈ భారత్లో భాగంగానే కనిపిస్తుంది. అయితే కాశ్మీర్ వివాదం రెండు దేశాల మధ్య అతిపెద్ద వివాదంగా మారడంతో దీనిగురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

పాకిస్తాన్ ఆక్రమించుకున్న గిల్గిత్-బాల్టిస్తాన్ ప్రాంతం దాదాపు 85 793 చదరపు కిలోమీటర్ల విస్తీర?ం కలిగి ఉంది. పాకిస్తాన్ దీన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతంగా పరిగణిస్తోంది. ఈ ప్రాంతానికి ప్రాంతీయ అసెంబ్లీ ముఖ్యమంత్రి కూడా ఉన్నారు. 1970లో ఈ ప్రాంతాన్ని మిర్పూర్- ముజఫరాబాద్ (పాక్ ఆక్రమిత కాశ్మీర్) కేంద్ర పాలిత గిల్గిత్- బాల్టిస్తాన్గా రెండుగా విడగొట్టారు. 1963లో కుదిరిన సరిహద్దు ఒప్పందంలో భాగంగా పాకిస్తాన్ గిల్గిత్-బాల్టిస్తాన్ లోని షక్సామ్ వ్యాలీపై హక్కులను చైనాకు ఇచ్చింది. దాదాపు 4600 కోట్ల డాలర్ల వ్యయంతో చేపట్టిన చైనా- పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ ఈ ప్రాంతం గుండా వెళ్తున్న కారణంగా ఈ ప్రాంతం చైనా - పాక్ లు రెండింటికీ అత్యంత ముఖ్యమైన ప్రాంతంగానే ఉంది. కాగా గిల్గిత్- బాల్టిస్తాన్ కు రాష్ట్ర హోదా కల్పించాలని ప్రధానికి విదేశీ వ్యవహారాల సలహాదారయిన సర్తార్ అజీజ్ నేతృత్వంలోని కమిటీ సిఫార్సు చేసినట్లు పాక్ మంత్రి రియాజ్ హుస్సేన్ పీర్జాదా జియో టీవీకి చెప్పారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ కూడా చేయనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం పాకిస్తాన్ లో బలూచిస్తాన్ - ఖైబర్ ఫక్తూన్ క్వా - పంజాబ్ - సింధ్ రాష్ట్రాలున్న విషయం తెలిసిందే.

## విద్యాశాఖ నుంచి గంటాను తప్పించాలి

**రా.వాప్రతినిధి ; (అమరావతి) :** శాసనమండలి ప్రారంభం అయిన తరువాత ఇంతవరకు విద్యాశాఖమంత్రి సభకు హాజరు కాలేదని, ఆయన శాఖకు సంబంధించిన ప్రశ్నలకు ఇతర మంత్రులు స్పష్టంగా సమాధానాలు ఇవ్వలేక పోతున్నారని, అందువల్ల విద్యాశాఖా మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు నుండి ఆ శాఖను తప్పిస్తే బాగుంటుందని టీడీపీ ఎమ్మెల్సీ ఎంవివిఎస్. మూర్తి అన్నారు విద్యార్థులు ఆత్మహత్యలపై సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ ఆయన పై అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## విద్యాసంస్థల్లో అసహనం వద్దు

**రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ**



**ముంబై :** విద్యాసంస్థల్లో అసూయ, ద్వేషాలు, అసహనానికి తావివ్వరాదని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ తెలిపారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్‌కు డాక్టరేట్ ప్రదానం పురస్కరించుకుని ముంబై విశ్వవిద్యాలయ ప్రత్యేక స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రణబ్ మాట్లాడుతూ జాతీయ అభివృద్ధి యత్నాల్లో ఉన్నత విద్యారంగం క్రియాశీల పాత్ర పోషిస్తోందన్నారు. 'మనం స్వేచ్ఛగా మాట్లాడటం, చర్చించు కొవడం చేయాలి. సంకుచిత ఆలోచనలను విడనాడాలి. ఆధునిక విశ్వవిద్యాలయ పాఠం కొత్త జీవితం తెలుసుకునే గొప్ప సంప్రదాయంగా ఉండాలి. ఆ పయత్నాలు విశ్వవిద్యాలయ ఆవరణ లోపల ఉండాలి' అని ముఖర్జీ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఈ ఏడాదితో 160 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఇక్కడ తొలిసారిగా విడుదల చేసిన పోస్టర్ స్టాంప్‌ను కూడా రాష్ట్రపతి అందుకున్నారు. ముఖర్జీ మట్లాడూతూ బహుళ అభిప్రాయలు, ఆలోచనలు, తత్వాల సమ్మిళతంగా ఉండేలా అత్యున్నత విద్యాసంస్థలు చర్యలు తీసుకువాలన్నారు. ఉన్నతస్థాయి చర్చలు జరగాలి. 'భారతదేశం కేవలం భౌగోళిక వ్యక్తీకరణ కాదు. కానీ ఇది ఒక సంస్కృతి, ఆలోచనను ప్రతిబింబిస్తోంది. మన విలువలు, జీవనంలో భాగమే చర్చలు. అభిప్రాయాలను పరస్పరం స్వేచ్ఛగా పంచుకొనేందుకు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు మంచి వేదికలు' అని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థపై ఉన్నత విద్య ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, తన పోటీస్థాయిని ఆర్థిక వ్యవస్థ నిర్ణయిచడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు నాణ్యమైన శిక్షణ ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ సత్తా నిర్ణయించబడుతుందన్నారు. ఉన్నత విద్యా వ్యవస్థతో కూడిన ఆర్థిక వ్యవస్థలో నిపుణులైన సిబ్బందిని నియమించుకోవడం తొలి ప్రాధాన్యతగా ఆయన చెప్పారు. పరిశ్రమ అవసరాలకు సమాంతరంగా ఉన్నత విద్యాలయాల్లో కోర్సులు ఉండాలిని ముఖర్జీ అన్నారు. కోర్సులు పాఠ్య ప్రణాళికలో పరిశ్రమల అవసరాలపై విద్యా నిర్వాహకులకు కార్పొరేట్ నిపుణులు సలహాలు ఇవ్వడం ద్వారా మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఒక మంచి విద్యా వ్యవస్థ విద్యార్థుల్లో సామాజిక బాధ్యత అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని రాష్ట్రపతి తెలిపారు. ఉన్నత విద్యా సంస్థలు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోని విద్యా సంస్థలతో సంబంధాలు నెరపడం అనేది కీలకమైన విషయమన్నారు. భారత్‌లో నలందా, తక్షశిల వంటి చారిత్రిక విద్యా సంస్థలు నాణ్యమైన బోధన జరిగించదన్నారు. ఇదిలాఉండగా, 1960వ దశకంలో ప్రారంభమైన హరిత విప్లవంలో స్వామినాథన్ విశేష సేవలందించారని రాష్ట్రపతి ప్రశంసించారు. భారత్ ప్రజల జీవనంలో మంచి మార్పు తీసుకువచ్చేందుకు ఆయన పని చేశారన్నారు. ప్రపంచంలో ఆహార ధాన్యాల ఎగుమతులు, ప్రముఖ ఉత్పత్తిదారుల్లో ఒకరిగా మన దేశాన్ని నిలిపేందుకు స్వామినాథన్ విశేష సేవలందించారని ప్రణబ్ పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన, మొక్కల జన్యుశాస్త్రంలో, విస్తృత స్థాయి సమస్యలపై 65 ఏళ్లు పని చేస్తున్నారని రాష్ట్రపతి కొనియాడారు.

## నిద్రకు 'అపోలో' ప్రత్యేక క్లినిక్

**హైదరాబాద్ :** వరల్డ్ స్లీప్ డే సందర్భాన్ని పురస్కరించు కుని జౌట్‌పేషంట్, ఇన్‌పేషంట్ రోగుల కోసం కాంప్రహెన్సివ్ స్లీప్ ఎవాల్యూయేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (సమగ్రమైన నిద్ర నిర్వహణా వ్యవస్థ) ను 'గాఢంగా నిద్రపోండి, జీవితాన్ని పెంచుకోండి' అనే నేపథ్యంతో ఈ సంవత్సరపు వరల్డ్ స్లీప్ డేను నిర్వహించారు. నాణ్యమై నిద్రను పొందలేనటువంటి వారికి మాత్రమే నిద్ర యొక్క విలువ గురించి బాగా తెలుస్తుందని, ఈ నిద్రలేమి సమస్య వలన ప్రాణాలకే ముప్పుతెచ్చేటటువంటి మధుమేహం, అధిక రక్తపోటు, గుండె వ్యాధులు, ఊబకాయం, అనుకోని ప్రమాదాలు, ఆరోగ్యంగా , సంతోషంగా ఉండలేకపోవడం (పూర్ జనరల్ వెల్‌బీయింగ్) వంటి సమస్యలు శరీరంలో గణనీయంగా పెరుగుతాయని అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ప్రపంచస్థాయికి చెందిన న్యూరాలజీ, పల్మనాలజీ, సైక్రియాట్రీ, ఇఎన్‌టికి వంటి బహుళ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్య బృందంతో ఈ ప్రత్యేక క్లినిక్‌ను అపోలో హాస్పిటల్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అసాధారణమైన వైద్య బృందానికి అత్యాధునికమైన స్లీప్ ల్యాబ్ టెక్నాలజీ, సిపిఎపి, బిఐపిఎపి, అటో మోడ్స్, అక్సిజన్ సపోర్ట్ వంటి అత్యుత్తమ పరీక్షా పరికరాలు వంటివి వెన్నుదన్నుగా ఉంటూ నిద్రకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి ఒకే గమ్యస్థానంగా ఈ కేంద్రాన్ని రూపుదిద్దడం జరిగిందన్నారు.

## బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్

**న్యూఢిల్లీ :** భారీ ఆఫర్‌తో ప్రభుత్వం రంగ బీఎస్ఎన్ఎల్ ముందుకొచ్చింది. 3జీ డేటా రోజుకు 2జీబీ చొప్పున, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పరిధిలో అపరిమిత కాల్స్ చేసుకుంటే. రోజుకు గరిష్ట వేగంతో 2జీబీ డేటా, అనంతరం పరిమిత వేగంతో అపరిమిత డేటాను వినియోగించుకోవచ్చు. పొంత నెట్‌వర్క్ పరిధిలో అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. ఇతర నెట్‌వర్క్‌ల పరిధిలోని ఫోన్లకూ రోజుకు 25 నిమిషాల సేపు ఉచితంగా మట్లాడుకోవచ్చని, అనంతరం కూడా నిమిషానికి 25 పైసలు మాత్రమే ఛార్జి పడుతుందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది. ఈ పథకం కాల వ్యవధి 28 రోజులు 90 రోజుల పాటు ఈ ఆఫర్ అమల్లో ఉంటుందని తెలిపింది.

# డీహైడ్రేషన్..తగు జాగ్రత్తలు

శరీరానికి తగినంత నీరు అందకపోవడమే డీహైడ్రేషన్, ఇప్పుడు ఉన్న వేడి వాతావరణానికి ఎన్ని నీళ్ళు తాగినా సరిపోవు. దీనివల్ల మనకి తెలియకుండానే డీహైడ్రేషన్‌కు గురవుతాం. డీహైడ్రేషన్ పలు అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. ఒక్కోసారి ప్రాణాతకంమూ కావచ్చు. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినవారు మరింత అవగాహనతో ఉండాలి. శరీరంలో నీటి శాతం కొద్దిగా తగ్గినా మనలో శక్తిస్థాయిలు బాగా పడిపోతాయి. ఫలితంగా తీవ్ర అలసట, నీరసం అనిపిస్తుంది.







## డీహైడ్రేషన్‌కు ప్రధానమైన లక్షణం తెలుసుకునేదెలా?

- మూత్రం రంగుని బట్టి తెలుసుకోవచ్చు, ముదురు పసుపు లేదా జేగురు (గోధుమ) రంగులో ఉంటే డీహైడ్రేషన్‌కి గురైనట్లే.
- శరీరానికి తగినంత నీరు అందించకపోతే జీపీ బాగా పడిపోతుంది. మెదడుకు ఆక్సిజన్ సరిగ్గా అందదు.
- డీహైడ్రేషన్ మనిషిని నిస్సత్తువగా మార్చడమే కాదు మూడీగా చేస్తుంది. ఏ విషయంపైనా ఏకాగ్రత పెట్టలేరు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- సాధారణంగా మీ శరీరానికి ఎంత కావాలో ఒక నిర్ధారణకు రండి.
- మీ శరీరం బరువు ఎంత ఉంటే అందులో సగం ఔన్సుల నీరు రోజూ తీసుకోవాలి.
- అతి వేడి వాతావరణంలో ఉండే మనిషికి రోజుకు 13 కప్పుల ద్రావణాలు అవసరం
- అదే మహిళలకైతే 9 కప్పుల ద్రావణాలు సరిపోతాయి.
- దాహంగా ఉన్నా లేకపోయినా రోజంతా బాగా నీరు, ఇతర ద్రవ పదార్థాలూ తీసుకోవాలి
- వ్యాయామం చేసేవారైతే వ్యాయామానికి ముందూ, తర్వాత కూడా నీరు తాగాలి
- కార్బోహైడ్రేట్స్, లవణాలు బాగా ఉండే ద్రవణాలను తీసుకోవాలి
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి
- సోడా, కాఫీ లాంటి షుగర్‌ని పెంచే ద్రవ పదార్థాలు తీసుకోరాదు. ఇవి ఆరోగ్యాన్ని మరింత క్షీణింపచేస్తాయి.
- శరీరానికి చల్లదానాన్ని ఇచ్చే, మనకు ఇంట్లో ఉండే మజ్జిగ, సగ్గుబియ్యం లాంటి వాటిని ఎక్కువ తీసుకోవచ్చు.

# జ్ఞాపకశక్తి, ఏకాగ్రత కోసం...

మెదడు చురుకుగా ఉంటేనే ఏ పనైనా బాగా చేయగలుగుతాం. ముఖ్యంగా చదువుకునే పిల్లలకు ఇది అవసరం. క్లాసులో చెప్పే పాఠాలు ఒంటబట్టాలన్నా చదివింది బాగా గుర్తుండాలన్నా మెదడు పనితీరే అతి ముఖ్యం. అందుకే పిల్ల విషయంలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంచే ఆహారం పైనా దృష్టి సారించాలి. అలాంటి ఆహార పదార్థాలు ఏమేం ఉన్నాయో ఒకసారి తెలుసుకుందాం.






- **రోజ్ మేరీ :** మతిమరపు మనుషులకు ఇది చాలా మంచి మందు ఏకాగ్రతనూ బాగా పెంచే సహజమైన పదార్థం ఇది. ఇందులో ఉండే పదార్థాలు మెదడు పనితీరును చాలా చురుకుగా చేస్తాయి. ఈ మొక్క నుంచి తీసే ఆయిల్‌నూ ఉపయోగించుకోవచ్చు.
- **బీట్‌రూట్ :** ఇందులో ఉండే నైట్రేట్స్ మెదడు,శరీరానికి రక్తం సజావుగా, సక్రమంగా సరఫరా అయ్యేలా చేస్తాయి.
- **గుడ్డు :** అల్పాహారంగా గుడ్డుని తీసుకుంటే జ్ఞాపకశక్తి బాగా పెరుగతుంది. గుడ్డు సొనలో ఉండే కోలినం అనే పదార్థం మెదడు ఆరోగ్యానికి ఉపకరిస్తుంది.
- **చేపలు:** సార్టీన్, సాల్మన్,కాడ్ ఫిష్ రకం చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడును అత్యంత చురుకుగా ఉంచుతాయి.
- **అవకాడో :** ఇది మెదడుకు రక్తాన్ని సక్రమంగా సరఫరా చేసేందుకు దోహదపడుతుంది.
- **క్రాన్‌బెర్రీస్ :** జ్యూసీగా ఉండే ఈ పండులోని యంటీ ఆక్సిడెంట్లు మెదడు దెబ్బ తినకుండా కాపాడతాయి.
- **ఉల్లిపాయలు :** పచ్చి ఉల్లిపాయాలు తింటే మీ జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది.
- **ధాన్యాలు :** పీచు పదార్థం, కార్బోహైడ్రేట్లు, ఒమెగా 3 పుష్కలంగా ఉండే ధాన్యాలు మెదడుకి మంచి ఆహారం అవుతుంది.
- **టమాటా :** ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్, లైకోపీన్ మెదడులో కణాలు దెబ్బతినకుండా చూస్తాయి. మొత్తం శరీర ఆరోగ్యానికీ టమాటా బాగా ఉపయోగపడుతుంది.
- **గ్రీన్‌టీ :** రోజుకి రెండు, మూడు కప్పుల గ్రీన్‌టీ తాగి చూడండి. మీలో ఏకాగ్రతా స్థాయి ఎంతగా పెరుగుతుందో మీకే అర్థమవుతుంది.
- **డార్క్ చాక్లెట్ :** ఇందులో ఉండే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, కెఫీన్ జ్ఞాపకశక్తిని పెంచుతాయి.

అక్రాన్ స్క్వాష్ : విటమిన్ బి12,ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉండే ఇది మెదడులో నరాలు దెబ్బతినాకుండా చూస్తుంది.

- **నట్స్ :** మెదడుకి ఆక్సిజన్‌ని సరఫరా చేయడంలో, మెదడులోని రక్తనాళాలకు అవసరమైన పోషకాలను అందించడంలో ఇవి మంచి పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు శక్తినీ పెంచుతాయి.

**పసుపు :** అనేక అనారోగ్యాలను తీసేసే పసుపు, జ్ఞాపకశక్తి పెంచుకునేందుకూ మందుఆ పనిచేస్తుంది.

## మోడీని కలిసిన కొనకళ్ళ కుటుంబం



**మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు:** ప్రధానమంత్రి నరేంద్రమోడిని ప్యానల్ స్పీకర్, బందరు పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు , కొనకళ్ళ జగన్నాధరావు కుటుంబ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కొనకళ్ళ కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలుకరించి, ఎంపీ మనమరాలు విశాలిని ఎత్తుకొని ముద్దాడారు.

## హైదరాబాద్‌లో బిఆర్‌పి పైప్స్ ప్లాంట్

**హైదరాబాద్ :** బిఆర్‌పి పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ హైదరాబాద్‌లో సిపివిసి పైప్స్, ఫిట్టింగ్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. సుమారు 20 కోట్ల రూపాయల పెట్టుబడితో నాచారంలో ఈ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ పట్వారీ వెల్లడించారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన సిపివిసి పైప్స్ ప్లాంట్‌లో ఇది రెండోదని ఆయన పేర్కొన్నారు. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం నెలకు 1,000 టన్నులని ఆయన చెప్పారు. కంపెనీకి ఇప్పటికే గుజరాత్‌లోని ఆహ్మదాబాద్‌లో ఒక ప్లాంట్ ఉందని ప్రకాశ్ తెలిపారు. దక్షిణాదిలో కార్యకలాపాలు విస్తరించేందుకు హైదరాబాద్ ప్లాంట్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది కంపెనీ టర్నోవర్ 75 కోట్ల రూపాయలుగా ఉందని ప్రకాశ్ వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో కంపెనీ ఉత్పత్తులకు పట్టిష్ఠమైన మార్కెట్ ఉందని, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని చూస్తున్నట్లు చెప్పారు.

## పనులు వసూళ్లు చేయకపోతే నిధులు నిలుపుదల

**70 శాతం పైగా పన్నులు వసూళ్లు చేసిన వారికే 14వ ఆర్థికసంఘం నిధులు**

**రా.వా. ప్రతినిధి- గుంటూరు :** గ్రామపంచాయతీలలో పన్నులు వసూళ్లు చేయకపోతే తాజాగా విడుదలైన 14 ఆర్థిక సంఘం నిధులు నిలుపుదల చేస్తామని అధికార యంత్రాంగం హెచ్చరించింది. గ్రామ పంచాయతీలలో నూరుశాతం పన్నులు వసూళ్లు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 1011 గ్రామపంచాయతీలు ఉండగా ఇంటిపన్నులు,పన్నేతరులు ఈ ఏడాది రూ.60.90 కోట్లు వసూళ్లు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం రూ.36.24 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారు. అంటే కేవలం 59.90 శాతం మాత్రమే వసూళ్లు చేయగల్గేరు. ఇంకా రూ.24.66 కోట్లు పన్నుల బకాయిలు పేరుకు పోయాయి. దీంతో పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలని జిల్లాకలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఎట్టిపరిస్థితిలో నూరుశాతం పన్నులు వసూళ్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈనేపథ్యంలో 70 శాతంకు పైగా పన్నులు వసూళ్లు చేయకపోతే 14వ ఆర్థికసంఘం నిధులు పంచాయతీలకు కేటాయించలేమని అధికారులు అంటున్నారు. పంచాయతీలలో పన్నులు వసూళ్లు శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో ఈ నిబంధన విధించామని అంటున్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు పంచాయతీలకు వచ్చిన మొత్తం నిధుల్లో పదిశాతం కూడా నిలుపుదల చేస్తామని అధికారుల వెల్లడించారు.

బాగా వెనకబడితే నిధులు విడుదల చేయలేం : జిల్లా పంచాయతీ అధికారిణి శ్రీదేవి జిల్లాలో చాలా గ్రామ పంచాయతీలు పన్నులు వసూళ్లులో వెనకబడ్డాయి. అలాంటి పంచాయతీలకు వెనకబడ్డాయి. అలాంటి పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయలేం. కేవలం70 శాతంకు పైగా పన్నులు వసూళ్లు చేసినవాటికి మాత్రమే నిధులు ఇస్తాం. నూరుశాతం పన్నులు వసూళ్లు చేసిన వాటికి అదనంగా ప్రోత్సాహం లభిస్తుంది.

## పేదల ఉపాధికి పోలీసుల గండి ఇసుక తవ్వకాలకు నో ..

**పేదలకు సీపీఐ నాయకుల మద్దతు**

**రా.వా।ప్రతినిధి-(తాడికొండ) :** రాజధాని గ్రామమైన లింగాయపాలెంలో బ్రతుకుదెరువు కోసం పేదలు ఇసుక తవ్వుకోవడాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో ఎక్కువగా పేదలు నివాసముంటున్నారు. రాజధానికి భూములివ్వంటంతో పేదలకు పనులు దొరకటం కష్టంగా మారింది. కొన్ని మాసాలుగా ఇసుకను తవ్వుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి లింగాయపాలెం రేవులో ఇసుకను డంపింగ్ చేసినట్లు తెలిసింది. ఇసుక తవ్వకాల కోసం వెళ్లిన కూలీలను పోలీసులు అడ్డుకున్నారు. వేరే ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. తమ గ్రామంలో ఉన్న వనరులను తాము స్వదినియోగం చేసుకోవద్దా అని కూలీలు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, కూలీలకు మధ్య వాగ్వాదం జరిగింది. నీరు ఉన్న చోట ఇసుకను తవ్వుకోవాలని పోలీసులు తెలపటంతో మరోసారి వాదన జరిగింది. విషయం తెలుసుకున్న సీపీ నాయకులు కాబోతు ఈశ్వరరావు, చింతరాల కోటేశ్వరరావు, వైసిపి తాడికొండ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కత్తెర హెన్నిక్రిస్టినా సంఘటనా స్థలానికి చేరుకుని పేదలకు అండగా నిలిచారు. ప్రభుత్వం రాజధాని గ్రామాల పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందిని విమర్శించారు.

# ఆకాశమే హద్దుగా పరిశ్రమలను ఆకర్షించండి

**ఎంఓయూలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

**రా.వా।ప్రతినిధి - అమరావతి :** రాష్ట్రంలో ఉన్న వనరుల ఆధారంగా ఎక్కడెక్కడ ఏయే పరిశ్రమలు స్థాపించ వచ్చో అధ్యయనం చేసి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికాకారులను ఆదేశించారు. ఏపీలో ఉన్న అపార అవకాశాలు దేశంలో మరెక్కడా లేవని,వీటిని వినియోగించుకొని రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని ఆయన సూచించారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారితో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆయన దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, వ్యవసాయానుబంధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించినట్లయితే ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఆస్కారం ఉంటుందన్నారు. భాగస్వామ్య సదస్సులతోపాటు ఇతర సందర్భాల్లో కుదుర్చుకున్న పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) వాస్తవ స్థితిపై సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకూ మొత్తం ఎన్ని ఎంఓయూలు కుదిరాయి.. వాటి పురోగతి కోసం ఎన్ని సమావేశాలు- సంప్రదింపులు జరిపారు.. ఎన్ని డీపీఆర్‌లు సిద్ధం చేశారు.. ఈ ఏడాది మే నాటికి ఎన్ని కార్యరూపం దాలుస్తాయనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు భూ కేటాయింపులు ఎంతవరకూ వచ్చాయి. సివిల్ పనులు ప్రారంభించినవి ఏయే దశల్లో ఉన్నాయి. ఎన్ని పరిశ్రమలు ఉత్పత్తిదశకు చేరుకున్నాయనే వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుకొచ్చారు. రాష్ట్రంలో 2014 జూన్ నుండి ఇప్పటి వరకూ అన్ని శాఖలు 1,168 ఎంఓయూలను కుదుర్చుకోగా, రూ.16,24,262 కోట్ల పెట్టుబడులు



పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయన్నారు. ఇవి పూర్తిగా కార్యరూపం దాల్చితే 32,55,816 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు - 2017లో రూ. 10, 54, 596 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 664 ఒప్పందాలు, భాగస్వామ్య సదస్సు - 2016లో 328 ఎంఓయూలు చేసుకోగా రూ.4,61,748 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు వివిధ సంస్థలు ఆసక్తి చూపించాయన్నారు. ఈ రెండు సదస్సుల్లోనే కాకుండా మరో రూ. 1,07,917 కోట్ల పెట్టుబడులకు గాను 178 ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు అధికారులు వివరించారు. మొత్తం కుదిరిన ఎంఓయూలలో రూ. 64,250 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 134 యూనిట్లు ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించాయన్నారు. తద్వారా 52,305 మందికి ఉద్యోగాలు లభించాయని వారు తెలిపారు. ఎంఓయూలతో సంబంధం లేకుండా పరిశ్రమల శాఖ పరిధిలో 211 ప్రాజెక్టులు అదనంగా వస్తున్నాయని, నీటి విలువ రూ. 1,08,514 కోట్లుగా సీఎంకు వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, సీఎం ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, పెట్టుబడులు, మౌలికవసతుల ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, రవాదారులు- భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి సుమత్రా దావ్రా, పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీకాంత్, పరిశ్రమలశాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, గనులశాఖ కార్యదర్శి శ్రీధర్, పరిశ్రమలశాఖ కమిషనర్ కార్తికేయ మిశ్రా, ఈడీబీ సీఈవో కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

# జమ్ములో రాయితీలు లేకుంటే శ్రీసిటీలోనే భారీ ప్లాంట్

**హైదరాబాద్ :** త్వరలో అమల్లోకి రానున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో భాగంగా ఉన్న సెంట్రల్ జిఎస్‌టి (సిజిఎస్‌టి) రిఫండ్ చేసేందుకు జమ్ము కశ్మీర్ ప్రభుత్వం నిరాకరిస్తే జమ్ములో ఏర్పాటు చేయతలపెట్టిన ప్లాంట్‌ను పక్కనపెట్టనున్నట్లు బ్లూస్టార్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ వెల్లడించారు.

**బ్లూస్టార్ జెఎండి త్యాగరాజన్ వెల్లడి**

నాడిక్కడ మార్కెట్లోకి కొత్త ఎయిర్ కండీషనర్లను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జూలై 1నుంచి అమల్లోకి రానున్న జిఎస్‌టిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సిజిఎస్‌టి పరిహారం అందకపోతే జమ్ము ప్లాంట్ ఏర్పాటును పక్కనబెట్టి.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో పెద్ద ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. సుమారు 300 కోట్ల రూపాయల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ, జమ్ము కశ్మీర్‌లోని సాంబాలో ఎయిర్ కండీషనర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు బ్లూస్టార్ గతంలో ప్రకటించింది. తాజాగా జిఎస్‌టి అమలు కారణంగా పన్ను విధానాల్లో మార్పులతో రాయితీలు కోల్పోయే అవకాశం ఉండటంతో జమ్ము ప్లాంట్ ఏర్పాటుపై పునరాలోచన చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే శ్రీసిటీ, జమ్ములో




ప్లాంట్‌కు అవసరమైన స్థలాలను తీసుకున్నట్లు త్యాగరాజన్ వెల్లడించారు. ప్రస్తుతం సెన్ వ్యాట్ కింద 14 శాతం మొత్తాన్ని రీయింబర్స్ మెంట్ చేస్తుండగా జిఎస్‌టి కింద ఇది సిజిఎస్‌టి పరిధిలోకి చేరుతుందని ఆయన పేర్కొన్నారు. జిఎస్‌టి అమలుతో సిజిఎస్‌టి 14 శాతం,స్టేట్ జిఎస్‌టి (ఎస్‌జిఎస్‌టి) 14 శాతంగా ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఎస్‌జిఎస్‌టి రాయితీ లను జమ్ము ప్రభుత్వం అందించనున్నప్పటికీ సిజిఎస్‌టిపై స్పష్టత రాలేదని పేర్కొన్నారు. జూలై నాటి కల్లా దీనిపై స్పష్టత వస్తే జమ్ము ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ ప్లాంట్ పనులను మొదలు పెడతామని ఆయన చెప్పారు. నిర్మాణ పనులు ప్రారంభించి ఎనిమిది నెలల్లో ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఎగుమతులకు శ్రీసిటీ ప్లాంట్ ఎంతో కీలంగా ఉండనుందని పేర్కొన్నారు.

**ఏటా 35 శాతం వృద్ధి..**

కాగా బ్లూస్టార్ ఎయిర్ కండీషనర్ల వ్యాపారం ఏటా 35 శాతం వృద్ధి చెందుతూ వస్తోందని త్యాగరాజన్ వెల్లడించారు. మార్కెట్లోకి పట్టును చేజిక్కించుకునే లక్ష్యంతో కొత్త ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రసుత్తం ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రాబడులు 5,000 కోట్ల రూపాయలకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 2018-19 నాటికి టర్నోవర్‌ను 7,000 కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు త్యాగరాజన్ చెప్పారు.

# మరుగుదొడ్ల నిర్మాణంలో కొత్త చరిత్ర

- 100 గంటల్లో పదివేలు పూర్తి
- కలెక్టర్ వివేక్ యాదవ్ నిరంతర పర్యవేక్షణ
- ఇదే స్ఫూర్తితో 20 వేల నిర్మాణులకు సన్నద్ధం

**రా.వా ప్రతినిధి - విజయనగరం :** విజయనగరం జిల్లా అధికారుల సమన్వయ కృషితో కొత్త చరిత్ర లిఖితమైంది. రాష్ట్రంలోనే తొలిసారి వంద గంటల్లో పది వేల మరుగుదొడ్ల నిర్మాణంతో రికార్డు నెల కొల్పారు. జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ప్రత్యేక కృషితో ఒకేసారి 71 గ్రామాలను ఓడీఎఫ్‌గా ప్రకటించి సంపూర్ణ బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాల దిశగా బాటలు వేశారు.

సమాజంలో అనాదిగా పాతుకుపోయిన బహిరంగ మలవిసర్జ దురాచారం అనేక సమస్యలకు కారణమవుతుంది. పేదరికం, అవగాహన లేకపోవడం, కట్టుబాట్లు, సంప్రదాయాలు, ఇతరత్రా కారణాలతో వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మించుకొనేందుకు పల్లెవాసులు పెద్దగా ఉత్సాహం చూపేవారు కాదు. ఒకవేళ కట్టినా వాటిని కాకుండా స్టోర్ రూములుగా వినియోగిస్తూ అలంకారప్రాయంగా మార్చేశారు. అయితే బహిరంగ మలవిసర్జన కారణంగా సోకుతున్న వ్యాధులు, దిగజారుతున్న పారిశుధ్యం, ప్రజా ఆరోగ్యం, చదువుకొనేవారి సంఖ్య పెరుగుతుండటంతో ఇప్పుడిప్పుడే ప్రజల ఆలోచనల్లో మార్పువస్తోంది. బహిరంగ మలవిసర్జనకు స్వస్తిచెప్పి, వ్యక్తిగత మరుగు దొడ్లను నిర్మించుకొనేందుకు, వాటిని వినిమోగించుకొనేందుకు ప్రజల ఆస్తికి చూపుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటు కూడా ఇందుకు దోహదపడుతోంది. దీంతో ప్రభుత్వాలు కూడా స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిరించుకొనేందుకు ఒక్కోదానికి రూ.15 వేలు ప్రోత్సాహకాన్ని ప్రకటించాయి. అయినప్పటికీ మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు రాని వారిని అధికారులు నయానో భయనో బుజ్జగించి, ఈ మహా కార్యక్రమంలో భాగస్వాముల్ని చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం విజయనగరం జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణం ఒక ఉద్యమంలా సాగుతోంది. 2018 నాటికి సంపూర్ణ బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ దశలవారీ ప్రణాళికను అమలుచేస్తున్నారు. 'ఆత్మగౌరవ నివాదంతో' ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత ప్రచారం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేటట్టు చేయగలిగారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బిల్లులు చెల్లించేందుకు ముందస్తుగానే నిధులను రప్పించారు. అలాగే ఒక్కో లబ్ధిదారునికి స్త్రీనిధి నుండి రూ.12 వేలను రుణంగా ఇప్పించారు. తొలిదశల్లో వంద గంటల్లో పది వేల మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఈ నెల 10వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రారంభించారు. ఉదయం 10 గంటల సమయానికి మొత్తం 10,448 మరుగుదొడ్లను నిర్మించి, 71 గ్రామాలను ఓడీఎఫ్‌గా మార్చారు. దీనికి అవసరమైన నిర్మాణ సామగ్రినంతా సిద్ధం చేసుకొని, ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి నుండి మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములయ్యారు. 20 వేల మంది తాపీమేస్త్రులు, 3 వేల మంది అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఆరోపణలు రాకుండా మరుగుదొడ్లను జియో ట్యాగింగ్ చేసి, సకాలంలో బిల్లులు చెల్లించేందుకు వెంటవెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. యూనిసెఫ్, వరల్డ్‌బ్యాంకు ప్రతి నిధులతో థర్డ్‌పార్టీ ఎంక్వయిరీ కూడా చేయించారు. దీంతో ఈ కార్యక్రమం లిమ్కాబుక్ రికార్డులో నమోదు కానుంది. వంద గంటల్లో పదివేలకు పైగా మరుగుదొడ్లను నిర్మించడం అందరి సమష్టి విజయమని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ అన్నారు. ఇదే స్ఫూర్తితో మరో 20 వేల మరుగుదొడ్లను నిర్మించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

## అమెరికా,సియోల్‌పై దాడి చేస్తాం

**ఉత్తరకొరియా ప్రకటన**



**పోంగ్‌యాంగ్ :** తమ భద్రతకు ముప్పు కలిగించే విధంగా అమెరికా, దక్షిణకొరియాలు కలిసి సైనిక విన్యాసాలను ప్రారంభించాయని వీటిని నిలిపివేయకపోతే ఆ రెండు దేశాలపైన దాడులు చేస్తామని ఉత్తరకొరియా హెచ్చరించింది. సైనిక విన్యాసాలకు సమాధానంగానే భూతలం, ఆకాశ, జల మార్గాల ద్వారా దాడులు చేస్తామని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ ఒక వీడియో క్లిప్పింగ్ ద్వారా హెచ్చరిక సందర్భంగా తయారుచేసిన ఈ వీడియోను తాజాగా విడుదల చేశారు. అణుశక్తితో కూడిన క్యారియర్లు, ఇతర వ్యూహాత్మక ఆయుధాలతో అమెరికా, దక్షిణ కొరియా సైన్యం తమకు అత్యంత సమీపంలో విన్యాసాలు నిర్వహిస్తున్నాయని, ఇవి తమ భద్రతకు ముప్పు కలిగిస్తాయని ఉత్తరకొరియా తెలియజేసింది. కిమ్‌జాంగ్‌ఉన్ వీడియోను విడుదల చేశారు. ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ఫోల్ ఈగల్ సైనిక విన్యాసాలు ఏప్రిల్ చివరిదాకా జరుగుతాయి. గతంలో ఏనాడూ లేనంతస్థాయిలో ఎఫ్-35బి యుద్ధ విమానంతో సహా పలు శక్తివంతమైన ఆయుధాలను సైనిక విన్యాసాల సందర్భంగా ప్రదర్శిస్తున్నారు. ఈ ఆయుధాలన్నీ తీసుకొని కొరియా ద్వీపకల్పంలోకి ప్రవేశించే అవకాశం ఉందని తమ రక్షణకోసం విన్యాసాలు నిర్వహిస్తున్నామని అమెరికా దక్షిణకొరియా చెప్పడం సరైంది కాదని పోంగ్‌యాంగ్ తెలిపింది.

## దిగొస్తున్న చమురు ధర



**న్యూమార్క్ :** ముడి చమురు ధర మళ్లీ దిగొస్తోంది. ఒక దశలో పీపా (159 లీటర్లు) బ్రెంట్ క్రూడ్ ధర 50 . 95 డాలర్లకు దిగొచ్చింది. గత నవంబర్ 30 తర్వాత బ్రెంట్ ముడి చమురు ధర ఈ స్థాయికి తగ్గడం ఇదే మొదటిసారి. యుఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ గ్రేడ్‌కు చెందిన పీపాక్రూడ్ ధర అయితే 47 .99 డాలర్లకు దిగొచ్చింది. గత వారం అమెరికా ముడి చమురు నిల్వలు 82 లక్షల పీపాలు పెరిగాయన్న వార్తలు , అమెరికాలో షేల్ గ్యాస్ ఉత్పత్తి మరింత పెరగబోతోందన్న వార్తలు ఇందకు రోహదం చేస్తున్నట్టు మార్కెట్ వర్గాల అంచనా . ధరలు పెంచేందుకు ఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఒ పెక్ దేశాలు, రష్యా రోజువారీ చమురు ఉత్పత్తిని 1.8 కోట్ల పీపాలు తగ్గించేశాయి. దీంతో ఈ ఏడాది ఒక దశలో పీపా చమురు ధర 59 డాలర్లకు చేరువైంది.

### జీతభత్యాలతో కూడిన

## ప్రసూతి సెలవులు ఇవ్వాలి : ఎంపీ పండుల

**రా.వా(ప్రతినిధి,అమలాపురం -ఏ.తేజ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ప్రసూతి శెలవుల హక్కుల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అమలాపురం ఎంపి పండుల రవీంద్రబాబు బిల్లులో కొన్ని మార్పులు చేయాల్సిందిగా సూచించారు. విధి నిర్వహణలో ఉండగా గర్భం దాల్చిన మహిళలకు ఆరునెలలు ప్రసూతి శెలవులను పొడిగిస్తూ, గర్భధారణ నిర్ధారణ తరువాత ఆరునెలలు, ప్రసవానంతరం ఆరునెలలు జీతభత్యాలతో కూడిన శెలవుల బిల్లు సవరణను ప్రతిపాదన చేశారు. ఎయిర్ ఇండియాలో పనిచేస్తున్న మహిళలకు గర్భధారణ జరిగిన తరువాత ఆరునెలలు, ప్రసవానంతరం ఆరునెలలు జీతభత్యాలతో కూడిన శెలవులను మంజూరు చేసేవిధానం అమలులో ఉందన్నారు. అదే రీతిలో ప్రస్తుత వివాహిత మహిళా ఉద్యోగులకు కూడా వర్తింపజేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపి ప్రతిపాదించారు.

## పశువైద్యశాలను ప్రారంభించిన హోంమంత్రిచినరాజప్ప



**రా.వా(ప్రతినిధి,కోనసీమ-జీఎన్.రావ్ :** పశువుల ఆరోగ్య పరిరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని పశుగణాభివృద్ధికి తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంశాఖా మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో రూ.18లక్షల నాబార్డు ఆర్ఐడిఎఫ్ నిధులతో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పశు సంపద ద్వారా పాల ఉత్పత్తి పెరిగి దిగుబడి అధికమవడం ద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. పశుగణాభివృద్ధికి ప్రభుత్వ పరంగా కూడా చర్యలు తీసుకోవడం జరుగుతోందని మంత్రి అన్నారు. పశువులకు అవసర కాలంలో తగు వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు తగు సూచనలు, సలహాలు ఇస్తుండాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలగుప్తం జడ్‌పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, చల్లపల్లి సర్పంచ్ కొల్లు అమ్ములు, ఎంపిటిసి వరసాల వెంకటలక్ష్మి, అమలాపురం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, మున్సిపల్ విప్ నల్లా స్వామి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఏ.విశ్వేశ్వరరావు, బండారులంక పశువైద్యాధికారి సిహెచ్.వెంకటనారాయణ, భీమనపల్లి వైద్యాధికారి మేడిద నారాయణరావు, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూమా నాగిరెడ్డి మృతికి కాపుయువసేన, కాపునాడు సంతాపం

**రా.వా(ప్రతినిధి,అమలాపురం -ఏ.తేజ :** నంధ్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ కాపుయువసేన మరియు కాపునాడు సంతాపం వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు యువసనే, కాపునాడు కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల సురేష్ మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి పేదల పలు సహాయ సహకారాలు అందించేవారని, ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. ఎం.భాస్కరరావు స్వగృహం వద్ద నిర్వహించిన సంతాప సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపుయువసేన,కాపునాడు ప్రచార కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, అమలాపురం నియోజకవర్గ అధ్యక్షులు కొప్పుల భాస్కరరావు, సహాయ కార్యదర్శి చిక్కాల రవిశంకర్ తదితరులు పాల్గొని భూమా నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## మంజునాథ్ కమిషన్‌కు వినతిపత్రం సమర్పణపై చర్చ



**రా.వా(ప్రతినిధి,అమలాపురం -ఏ.తేజ :** రెండు కోట్ల మంది కాపులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా 2015 సంవత్సరంలో కాపు వెల్ఫేర్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యాళ్ల శ్రీనివాసవరప్రసాద్ అన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రతి ఒక్కరూ ఉచిత రిజిస్ట్రేషన్, ఉద్యోగ, ఆరోగ్య, ఆర్థిక, ఇతర సహాయాలను పొందవచ్చన్నారు. అలాగే మరింత మంది కాపులకు ఉపయోగపడేలా వచ్చేనెలలో కాపువెల్ఫేర్ డాట్ కామ్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించబడనున్నట్లు తెలిపారు. ఈ మొబైల్ యాప్ ఏవిధంగా ఉపయోగపడుతుందో చెప్పడానికి ఏర్పాటు చేయబోయే అవగాహన సదస్సు గురించి చర్చించడానికి అమలాపురం వచ్చినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ నెల 22వ తేది మంజునాథ్ కమీషన్ బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కోనసీమ వ్యాప్తంగా ఉన్న కాపు వెల్ఫేర్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మంజునాథ్ కమిషన్ కాపు వెల్ఫేర్ వెబ్‌సైట్ తరపున సమర్పించే వినతిపత్రానికి స్థానికుల నుండి సూచనలు, సలహాలు స్వీకరించినట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కాపులకు సహాయం అందించడానికి లక్షల రూపాయిల వ్యయంతో రూపొందించిన ఈ వెబ్‌సైట్‌ను అందరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రిజిస్ట్రేషన్ ఫారంలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో కాపుమిత్ర బృందం కన్వీనర్ బండారు రామ్మోహనరావు, కాపు ఉద్యోగ జేఏసీ కన్వీనర్ నంధ్యాల నాయుడు, కాపుమిత్ర సభ్యులు ముత్యాల శరత్‌బాబు, మద్దింశెట్టి రాంబాబు, కరాటం ప్రవీణ్, వి.సత్యశ్రీనివాసరావు, కాపుయువసేన రాష్ట్ర నాయకులు నిమ్మకాయల సురేష్, కాపు వెల్ఫేర్ సభ్యులు నిమ్మకాయల జగదీష్, చిక్కాల జగదీష్‌నాయుడు, నందుల ప్రసాద్, అడపా స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంతో మానసిక ప్రశాంతత



**రా.వా(ప్రతినిధి,కోనసీమ -జీఎన్.రావ్ :** విద్యార్థినిలలో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని ఏజిసి కోనా శ్రీనివాస్ అన్నారు. ముమ్మిడివరంలో శ్రీకృష్ణదేవరాయ, రఘుపతి వెంకటరత్నంనాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతో పాటు అన్నిరంగాల్లో విద్యార్థినిలు నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్నిరంగాల్లోను ముందుంటున్నారని, మహిళా శక్తి దేశానికి ఎంతో దోహద పడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ పిఓ మోహనరావు మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగిన ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో విద్యార్థిణులకు వివిధ అంశాలు, రంగాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, జి.వి.శ్రీరామ్మూర్తి, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయం కోసం కార్పొరేషన్ పరుగులు

**రా.వా ప్రతినిధి- అమరావతి :**

ఆదాయంకోసం కార్పొరేషన్ విరుచుకు పడుతోంది. ప్రధానమంత్రి మోదీ చేసిన పెద్ద నోట్ల రద్దుతో రాష్ట్ర ప్రజలు నగదు కొరకు కటకటలాడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పన్నులు కట్టాల్సిందే నంటూ లేకుంటే ఆస్తులు జప్తు చేస్తాం, షాపులకు తాళాలు వేస్తామంటూ చెబుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నోట్ల రద్దు వల్ల పాత నోట్లు కట్టినా తీసుకుంటామనడంతో ప్రజలు అవకాశం ఉన్న మేరకు పన్నులను చెల్లించారు. ప్రస్తుతం బ్యాంకుల్లో నగదు కొరత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు నోట్ల రద్దు సమయంలో ఒక్క గుంటూరు జిల్లాలో 13వేల కోట్ల పాత నోట్లను ప్రజలు డిపాజిట్ చేశారు. అయితే ఇప్పటి వరకు ఈ జిల్లాకు నాలుగువేల కోట్లు మాత్రమే అందాయి. ఈ నెలకు వేయి కోట్లు పంపాలని ఆర్‌బిఐను జిల్లా బ్యాంకుల అధికారులు కోరినా కేవలం 95 కోట్ల నగదును మాత్రమే జిల్లా బ్యాంకులకు పంపారు. ఇందులో 45 కోట్లు ప్రభుత్వ పెన్షన్ల క్రిందనే చెల్లించాలి. దీన్ని బట్టి నగదు కొరత ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నగదు కోసం ప్రజలు తపించి పోతున్న ఇలాంటి తరుణంలో కూడా కార్పొరేషన్ల అధికారులు పన్నుల వసూళ్ళ కోసం ప్రజలపై ఒత్తిళ్ళు పెంచారు. దీంతో ఏమిచేయాలో పాలుపోక కార్పొరేషన్లలో నివాసం ఉంటున్న ప్రజానీకం అల్లాడిపోతుండటం

- బేజారెత్తుతున్న ప్రజలు
- ఏడాది టార్గెట్ 69315,43 లక్షలు
- ఇప్పటి వరకు వసూలైంది 41504.50 లక్షలు

తెలుస్తోంది. కార్పొరేషన్లలో పన్నుల వసూళ్ళ టార్గెటు పూర్తి చేసేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద 13 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో పన్నుల వసూళ్ళకు ప్రభుత్వం ఏడాదికి టార్గెట్లు విధించింది. దీని ప్రకారం 69315,43 లక్షల టార్గెట్ విధించగా ఇప్పటి వరకు 41504.50 లక్షలు వసూలయ్యాయి. ఈ వసూళ్ళకు గాను ప్రభుత్వం ఆయా కార్పొరేషన్లకు ర్యాంకింగ్ కూడా ఇచ్చింది. ర్యాంకింగ్‌లో ఆరో స్థానంలో విశాఖపట్నం ఉండగా వందో ర్యాంకును నెల్లూరు కార్పొరేషన్ సాధించింది. అలాగే కార్పొరేషన్లకు మార్కులు కూడా వేసింది. విశాఖపట్నం కార్పొరేషన్‌కు 10కి 9.18 మార్కులు రాగా, నెల్లూరు కార్పొరేషన్‌కు 4.03 మార్కులు వచ్చాయి. గుంటూరు కార్పొరేషన్ 8.97 మార్కులతో రెండవస్థానంలో ఉంది.

### 13 కార్పొరేషన్ల టార్గెటు వసూళ్ళ వివరాలు

**టార్గెట్లు :** విశాఖపట్నం 19792.00 గుంటూరు 5818.28, విజయవాడ 9384,55, తిరుపతి 4289.73, కాకినాడ 3536.20, కర్నూలు 4225.04, రాజమండ్రి 4443.37, కడప 2538.19, ఒంగోలు 2220.82, అనంతపూర్ 2608.45, ఏలూరు 2434.58, చిత్తూరు 1704.61, నెల్లూరు 6322.61 అయితే ఇప్పటి వరకు వసూలు అయింది. విశాఖపట్నం 15144.04, గుంటూరు 4348.50, విజయవాడ 6444.04, తిరుపతి 2551.81, కాకినాడ 1767.37 కర్నూలు 2079.98, రాజమండ్రి 2093.11, ఒంగోలు 1016.86, అనంతపురం 1188.73, ఏలూరు 965.19, చిత్తూరు 600.84, నెల్లూరు 2120.86. ఈ లెఖ్ఖన మొదటి 10 కార్పొరేషన్లు 54 నుండి 91 శాతం వరకు పన్నులను వసూసులు చేశారు. పన్ను వసూళ్ళలో విశాఖపట్నం కార్పొరేషన్ అధికారులు 91.82 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, గుంటూరు అధికారులు 89.69 శాతంతో రెండవ స్థానంతో ఉన్నారు. నెల్లూరు అధికారులు 40.25 శాతంతో చివర స్థానంలో ఉన్నారు. నోట్ల కొరత గురించి మున్సిపల్ అధికారులు ఆలోచించకుండా తమ టార్గెటు కట్టాల్సిందేనంటూ ప్రజలను వేదించటం సరికాదంటూ ఆయా ప్రాంత ప్రజలు, కార్పొరేషన్ల ప్రజలు ప్రజా సంఘాల తరపున నాయకులు వాదిస్తూన్నారు. పన్నుల టార్గెటు వసూలు చేసే విషయంలో ఉన్న శ్రద్ధ నగదు కొరతను తీర్చే అంశంపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పన్నుఎగవేత







**రా.వార్తలు ప్రతినిధి ;(విజయవాడ) :** ఇది అధికార ప్రజాప్రతినిధుల భాగోతం. నగరానికి చెందిన పెద్దమనుషులు నగర పాలక సంస్థకు పన్నులు కట్టకుండా ముఖం చాటేస్తున్నారు. ఆర్థిక వనరుల లేమితో కొట్టుమిట్టాడుతున్న నగర పాలక సంస్థను పన్నుల రూపంలో మొండి బకాయిలు పీడిస్తున్నాయి. పన్ను కట్టని వారిలో టాప్ 100లో టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలే ఉన్నట్లు తేలింది. అందువల్లనే మేయరు కోనేరు శ్రీధర్ మౌనంగా ఉన్నారన్న విమర్శలున్నాయి. కోట్లలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూలకు కలెక్టరు , నగర పాలక సంస్థ పన్ను ఎగవేతదార్లులో టీడీపీ ప్రజాప్రతినిధులు ఉన్నారన్న సమాచారం బయటకు వెల్లడవ్వడంతో ప్రజల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. వామపక్ష, ప్రతి పక్ష పార్టీలు ఈ నేతల తీరును ఎండగడుతున్నాయి. సామాన్యుడు పన్నుల చెల్లింపులో జాప్యం జరిగితే డ్రైన్, వాటర్ కనెక్షన్లను మున్సిపల్ అధికారులు కట్‌చేసి ఇబ్బందులు పెడతారు. పన్ను ఎగవేతదార్లుల్లో టీడీపీ నేతలు, కార్పొరేటర్లు పేర్లు ఉన్నప్పటికీ, వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. నగర పాలక సంస్థకు పన్నుల రూపంలో రూ.74 కోట్లు పేరుకుపోయాయి. ఇందులో టాప్ 100లో టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నట్లు తేలింది. మరికొందరు టీడీపీలోని కీలక నేతలు, కార్పొరేటర్లూ ఉన్నారని సమాచారం. ఎగవేత దారుల జాబితాలలో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ రూ.14.86 లక్షల, విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), రూ.9.44 లక్షల, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు రూ.2.85లక్షలతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు.

### అధికారంలో ఉన్నామనే ధీమాతోనే

తామంతా అధికారంలో ఉన్నామని, ఎవరేమీ చేయలేరనే ధీమాతో వారున్నట్లు కనిపిస్తోంది. కోట్లలో పేరుకుపోయిన పన్నుల బకాయిలు చెల్లింపుపై దృష్టిపెట్టకపోవడం అసమర్థ పాలనకు నిదర్శనం. గతంలో విదేశీ టూర్ల పేర్లతో పాలకవర్గం ప్రజాధనాన్ని దేర్వినియోగం చేసిందన్న విమర్శలున్నాయి. అధికార కార్పొరేటర్లంతా తప్పతాగి విజయవాడ పరువును బజారు కీడ్చిన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పుడు టీడీపీ నేతలు పన్నులు చెల్లించకుండా, నగర పాలక సంస్థ తేల్చిన లెక్కల్లో అడ్డంగా దొరికిపోయిన సంఘటన పాలకవర్గానికి కంటిమీద కునులేకుండా చేస్తోంది.

### కలెక్టరు, కమిషనర్లు రంగంలోకి దిగేలా ?

నగర పాలక సంస్థలో పేరుకుపోయిన పన్నుల వసూలు కలెక్టరు బాబు, కమిషనరు వీరపాండ్యన్‌కు సవాలుగా మారింది. ముక్కుసూటి అధికారులుగా ముద్రపడిన వారిద్దరూ ఈ విషయంలో ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి. కోట్లాది రూపాయల మేర పన్నులు కట్టాల్సిన టీడీపీ ప్రజాప్రతినిధులతో ముక్కుపిండి మరీ వసూలు చేయిస్తారా, లేక రాజకీయ ఒత్తిళ్లతో మౌనంగా ఉంటారా అనేది త్వరలో తేలనుంది.

## ఎన్ఆర్ఐ సూపర్‌మార్కెట్‌కు నిప్పు




**వాషింగ్టన్ :** అమెరికాలో జాతి విద్వేష దాడులు మరింత ఉధృతమవుతుడటం ఎన్నారైలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఫ్లోరిడాలో ఓ అమెరికన్ భారత్ సంతతి వ్యక్తికి చెందిన ఓ స్టోర్‌ను మంటల్లో బుగ్గి చేయాలని యత్నించాడు. సమయానికి ఫైరింజన్లు అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తేవడంతో భారీ ఆస్తి నష్టం తప్పింది. రిచర్డ్ లియోడ్ అనే ఫ్లోరిడా వాసి కొన్ని రోజుల కిందట ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లి తనకు కావలసిన ఐటమ్స్ కొనుగోలు చేశాడు. ఆ స్టోర్‌లో అరబ్ నుంచి అమెరికాకు వలస వచ్చిన ముస్లింలు పనిచేస్తున్నట్లు గ్రహించాడు. ఎలాగైనా సరే ఆ షాపును సర్వనాశనం చేయాలని రిచర్డ్ ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో ఉదయం స్టోర్ తెరవకముందే అక్కడికి వెళ్లి నిప్పుపెట్టాడు. అది గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి కాల్ చేశారు. వారు వెంటనే ఘటనాస్థలానికి వచ్చి మంటలను ఆర్పేయడంతో భారీ ఆస్తి నష్టం తప్పిపోయింది. నిందితుడిని పట్టుకుని సెయింట్ లూయిస్ కౌంటీ పోలీసులకు అప్పగించారు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

## హౌసింగ్ డాట్‌కామ్‌కు భారీ నష్టం

**న్యూఢిల్లీ :** రియల్ ఎస్టేట్ కంపెనీ హౌసింగ్ డాట్‌కామ్ 2016 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 400 కోట్ల రూపాయల నష్టాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే కంపెనీ నష్టాలు 45 శాతం పెరిగాయి. 2015-16 సంవత్సరంలో కంపెనీ రాబడి 111 శాతం పెరిగి 26.76 కోట్ల రూపాయలకు చేరుకుంది. ఇదే కాలంలో మొత్తం వ్యయాలు 48 శాతం ఎగబాకి 430 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఈ హౌసింగ్ డాట్‌కామ్‌ను స్థాపించిన పన్నెండు మంది వ్యవస్థాపకులు కూడా వివిధ కారణాలతో కంపెనీని విడిచివెళ్లారు. ప్రస్తుతం ప్రాప్‌టైగర్ చేతిలో ఈ కంపెనీ ఉంది. 2012లో హౌసింగ్ డాట్ కామ్ కార్యకలాపాలు ప్రారంభించింది. దీని సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన రాహుల్ యాదవ్‌ను 2015 జూలైలో కంపెనీ డైరెక్టర్లు తొలగించారు. ఆ తర్వాత కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల స్థాయిలో చాలా మార్పులు జరిగాయి. ఫలితంగా ఉద్యోగుల కోసం ఇచ్చే ప్రయోజనాల వ్యయాల ఏకంగా 120 శాతం పెరిగి 188.5 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాది కాలంలో కంపెనీ వ్యాపార తీరులో మార్పులు చేర్పులు చేయడం మొదలు పెట్టింది. అగ్రస్థాయి మేనేజ్‌మెంట్ స్థాయిలోనూ ఇవి చోటు చేసుకున్నాయి. తొలుత ఈ కంపెనీ వివిధ రకాల ప్రాపర్టీల లిస్టింగ్ పోర్టల్‌గా ఉండేది. ఆ తర్వాత ప్రాపర్టీల కొనుగోలు, అమ్మకాలు చేపట్టే పోర్టల్‌గా మారిపోయింది. అద్దె వ్యాపారాన్ని నిలిపివేసింది. ప్రాపర్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరే కస్టమర్ల నుండి ఫీజులు వసూలు చేయడం ప్రారంభించింది. నష్టాలు పెరిగిపోతున్న నేపథ్యంలో కంపెనీ వ్యూహాలను మార్చుకునే పనిలో పడింది.

## కానిస్టేబుల్‌పై కేసు నమోదు

**తాడికొండ :** మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై ఎస్సై వీరానాయక్ కేసు నమోదు చేశారు. తాడికొండ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎం కిరణ్‌బాబు పెద్ద మసీదు సమీపంలో నివాసం ఉంటున్నారు. తమ ఇంటికి సమీపంలో ఉన్న ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో ఆమె బంధువులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## చిత్రకళా పరిషత్ సేవలు అమోఘం : హోంమంత్రి రాజప్ప



**రా.వా రాజధాని,అమలాపురం -ఏ.తేజ :** చిత్రకళా రంగంలో కోనసీమ చిత్రకళాపరిషత్ అమోఘమైన సేవలు అందిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఇటీవల చిత్ర కళాపరిషత్ అమలాపురంలో జాతీయస్థాయిలో నిర్వహించిన 27వ చిత్రకళా ప్రదర్శన, పోటీ మరియు బహుమతి ప్రదానోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్.యానం క్రైయిర్న్ ఎనర్జీ సంస్థ సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా(సిఎస్ఆర్ నిధులు) అందించిన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ఆనందరావుతో కలసి కోనసీమ చిత్రకళాపరిష్ కార్యదర్శి కొరసాల సీతారామస్వామికి మంత్రి రాజప్ప అందజేశారు. మంత్రి నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిత్రకారుల్లో నిగూఢంగా ఉన్న కళను వెలికితీసేందుకు కోనసీమ చిత్రకళాపరిషత్ విశేషమైన కృషి చేస్తోందని అభినందించారు. అలాగే జాతీయస్థాయిలో దేశం నలుమూలల నుండి చిత్రకారులను ఆహ్వానించి వారిలోని ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహాన్ని చిత్రకళాపరిషత్ అందిస్తోందని ఇది కోనసీమ ప్రాంతానికే గర్వకారణమని అన్నారు. చిత్రకళాపరిషత్ కార్యదర్శి కొరసాల సీతారామస్వామి మాట్లాడుతూ చిత్రకళాపరిషత్ అభివృద్ధికి మంత్రి ఎంతో సహకారం అందించారని కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల అమలాపురంలో నిర్వహించిన చిత్రకళాపరిషత్ ప్రదర్శనలో జాతీయస్థాయిలో 270 మంది చిత్రకారులు పాల్గొని చిత్రాలు ప్రదర్శించడం జరిగిందని అన్నారు. చెన్నై, బెంగుళూరు, పూనే, కర్ణాటక, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుండి చిత్రకళా పోటీల్లో పాల్గొన్నారని, ఈ సందర్భంగా రూ.2లక్షల నగదును అవార్డు పురస్కారాలుగా అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరక్టర్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీవొ జి.గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని మౌలిక వసతులతో విలసవిల్లిని అభివృద్ధి చేస్తా

### డిప్యూటీ సీఎం



**రా.వా రాజధాని,కోనసీమ -జీఎన్.రావ్ :** ఉప్పల గుప్తం మండలం విలసవిల్లి గ్రామానికి అవసరమైన అన్ని మౌళిక వసతులు కల్పించి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడడం జరుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంశాఖా మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. విలసవిల్లి గ్రామంలో రూ.46లక్షల పుష్కర నిధులతో పున:నిర్మించిన శ్రీపార్వతీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయాన్ని ఎమ్మెల్యే ఆనందరావుతో కలసి మంత్రి రాజప్ప ప్రారంభించారు. అనంతరం సామాజిక ఉప్పుగంటి వీరభద్రుడు, మాణిక్యం కల్యాణ వేదికలో జరిగిన సమావేశం మంత్రి మాట్లాడుతూ విలసవిల్లి గ్రామాన్ని నా సొంత గ్రామంగా భావించి అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ఇందుకు అవసరమైన బాధ్యతలను ఎమ్మెల్యేకు అప్పగించడం జరిగిందన్నారు. స్థానిక చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, వృత్తిపరంగా నేతపనివారలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే గ్రామంలో రహదారులు, కాలనీలు అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రజలందరూ ఐక్యమత్యంగా మెలగి అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండడం సంతోషంగా ఉందన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ మంత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. మంత్రి సూచనల మేరకు విలసవిల్లి గ్రామానికి అవసరమైన మౌళిక వసతులు ఇతర సౌకర్యాలు కల్పించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో మంత్రికి దుశ్శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ముందుగా మంత్రి శ్రీపార్వతీ సమేత వీరేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరక్టర్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆర్డీవొ జి.గణేష్‌కుమార్, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, ఉప్పలగుప్తం జడ్.పి.టి.సి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, విలసవిల్లి సర్పంచ్ గంటు అనంతలక్ష్మిసత్యవతి, ఎంపిటిసి పెల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ విజయంపై సంబరాలు చేసుకున్న పార్టీ శ్రేణులు



**రా.వా రాజధాని,అమలాపురం-ఏ.తేజ :** ఇటీవల ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అమలాపురం పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పట్టణ బిజెపి కార్యాలయంలో సీనియర్ నాయకుడు యర్రమిల్లి పాండురంగారావు అధ్వర్యంలో స్వీట్లు పంచి, బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి.నాయుడు, మోకా వెంకసుబ్బారావు, బసవా శివరామ్‌ప్రసాద్, పెయ్యల శ్యామ్‌ప్రసాద్, ముదునూరి రంగరాజు, సంసాని వెంకటరమణ, కర్రి తాతారావు, గుమ్మళ్ళ రెడ్డినాయుడు, నిమ్మకాయల వెంకటరెడ్డినాయుడు, యల్లమిల్లి కొండ, చిట్టూరి రాజేశ్వరి, దొంగ నాగజ్యోతి, జంపన బుచ్చిరాజు, మల్లాది హనుమంతరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బిజెపి యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దేశినీడి కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని వేడుకలు జరుపుకున్నారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా పవన్, ఆకుల వీరబాబు, దేవాదుల సూర్యనారాయణమూర్తి, నున్న రాంబాబు, కాటా బాలయ్య, ఈతకోట బాలాస్వామి, యర్రంశెట్టి వెంకన్న, జంగా రాజేంద్ర, గోకరకొండ గంగన్న, అరిగెల నాని, సలాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యూపీ విజయానికి RELIANCE

రిలయన్స్ ఏది చేసినా సంచలనమే... ఆసంస్థకున్న ఆశ అంతా ఇంతాకాదు..చేతివృత్తులకు ముప్పు తెస్తూ బార్బర్ షాపులు కూడా రిలయన్స్ ఏర్పాటు చేస్తుందన్న ప్రకటనతో దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు మిన్నంటతంతో వెనకడుగువ వేసిన సంస్థ రిలయన్స్... 1980లో క్రికెట్ మ్యాచ్‌ను స్పాన్సర్ చేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన సంస్థ భారతదేశంలో శతాబ్ధాల చరిత్రగల టాటా,బిర్లాలను పక్కకు తోసి, ప్రస్తుతం తానే నెంబర్‌వన్‌గా దేశంలో మనగలుగుతోంది. సంస్థ లాభాల బాటలో దూసుకుపోతున్నప్పటికీ, ప్రజలను, ప్రభుత్వాలను, సహచర పారిశ్రామిక వేత్తలను కుదేల్ చేయడంలో ఎప్పటికప్పుడు నూతన పథకాలతో ముందుంటుంది రిలయన్స్. ఆంధ్రప్రదేశ్ ఈ కంపెనీతో కోటాను కోట్లు నష్టపోయింది. ఎలా అంటే ఇక్కడి గ్యాస్ తవ్వకాలను ఆనాటి ప్రభుత్వం ఆయిల్ అండ్ నాచురల్ సంస్థకు కాకుండా రిలయన్స్‌కు కట్టబెట్టింది. గ్యాస్ తవ్వకాల అనుమతి లభించే వరకు పైపుల ద్వారా రాష్ట్రంలో గ్యాస్ సరఫరా చేయిస్తామని, రాష్ట్ర అవసరాల తర్వాతే గుజరాత్‌కు గ్యాస్ తరలింపు ఉంటుందని,ఇక్కడ పెట్టుబడులు పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని, ఇకపై నూతనంగా నెలకొల్పే పరిశ్రమలకు కొదువలేకుండా గ్యాస్‌సరఫరా చేస్తామంటూ ప్రజలకు అరిచేతిలో స్వర్గం చూపిన సంస్థ పైసా రాయల్టీ కట్టకుండా గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసింది. ప్రతి ఎన్నికల్లోనూ తనకు కావాలనుకున్న పార్టీ తరుపున డబ్బు ఖర్చుపెట్టి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటోంది. మోడీని ప్రధానిగా నిలపడంలో ఆశేష సేవలందించిన రిలయన్స్ ఉత్తరప్రదేశ్‌లో కూడా అదే చేసింది.

నోట్లరద్దు గురించి ముందుగానే తెలుసుకున్న ముఖేష్ అంబానీ తన దగ్గరున్న నెట్‌క్యాష్‌ను జియోలో పెట్టుబడిపెట్టారు. ఇంటర్‌నెట్ లేకుండానే 2 జీబీ డేటాను ఉచితం అంటూ కుర్రకారుకు ఎర వేశారు.. ప్రభుత్వం రిలయన్స్ సంస్థకు మాత్రమే సర్వీసు ప్రొవైడర్లను ఉచితంగా అందించింది. ఇలా దేశంలోని ఇతర మొబైల్ సంస్థలకు పంజా విసిరి ఇతర కంపెనీలను కుప్పకూల్చే ప్రయోగం చేశారు. దీంతో మిగిలిన సంస్థలన్నీ ఉచితాలు,ఆఫర్లు ప్రకటించక తప్పలేదు. వొడాఫోన్ అధినేత సునీల్ మిట్టల్‌తో సహా అన్ని మొబైల్ సంస్థలు హాహాకారాలు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అత్యధిక సీట్లుగల యూపీలో బీజేపీ యేతర ఏపార్టీ వచ్చినా రిలయన్స్ సంస్థ చిక్కుల్లో పడుతుంది. ప్రస్తుతం గెలుచుకున్న సీట్లబట్టి చూస్తే ఉత్తరప్రదేశ్‌లో 84 ఎంపీస్థానాలు వస్తాయి. దీంతో ఆయన సంస్థల మనుగడ నల్లేరుపై నడకలా సాగుతుంది. అందుకే బీజేపీ ఉచిత ప్రొవైడర్ల కేటాయింపుకు రుణం తీర్చుకోవాలన్నారు. ఎన్నికల్లో డబ్బు వెదజల్లారు. గెలుపు జమచేసుకున్నారు. అదే జరగకపోతే ఉచిత ప్రొవైడర్లు ఉండవు, దాంతో ఖాతాదారులకు ఇతర కంపెనీల కంటే ఎక్కువ ఆఫర్లు ప్రకటించలేరు. అంతేకాదు బీజేపీ యేతర (కాంగ్రెస్ ప్రభుత్వం కూడా శక్తిమేరకు ఆసంస్థకు సాయం అందించింది లెండి) ఇతర పార్టీలు ఏవి వచ్చినా, బీజేపీ బలహీన పడినా, నోట్లరద్దు ఎందుకు చేశారన్నది బయటకు వస్తుంది, అంతేకాదు మిగతా పారిశ్రామిక వేత్తలంతా మూకుమ్మడిగా దాడి చేస్తారు, అందువల్ల రిలయన్స్ మోడీ ప్రభుత్వాన్ని కాపాడటంలో రిలయన్స్ (నమ్మకాన్ని) ప్రదర్శించి, యూపీ గెలుపును బహుమతిగా ఇచ్చింది.

# బాదుడికి బ్యాంకులు రెడీ

బిజినెస్

## బడా బాబులను వదిలి సామాన్యుడిపై ప్రతాపం

ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన జన్‌ధన్ ఖాతాలతో బ్యాంకులు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. జన్‌ధన్ (జీరో బ్యాలెన్సు) ఖాతాల ద్వారా రూ.65,250 కోట్లను వెలికి తీసామని, దేశంలోని 28 కోట్లమంది కొత్త ఖాతాదారులకు బ్యాంకు సేవలు అందించామని గొప్పలు చెప్పుకున్న మోడీ చర్యలు సామాన్య ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్నాయి. గ్యాస్ సబ్సిడీ, సామాజిక పింఛను, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులందరికీ బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరుపుతామని ఊదర గొట్టిన ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి పెనాల్టీలు విధిస్తున్నామని బ్యాంకులు హుంకరిస్తుంటే కేంద్రం చోద్యం చూస్తూ కూర్చొంది. బడాబాబులు ఎగవేసిన లక్షల కోట్ల బకాయిలతో బ్యాంకులు నానా అవస్థలు పడుతుంటే మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన నోట్లరద్దుతో పాతనోట్లన్నీ రిజర్వుబ్యాంకుకు చేరుకోవడం, వినియోగదారులకు కొత్తనోట్లు అందించడంతో బ్యాంకుల ఉనికి ప్రశ్నార్థంగా మారింది. ఈ నేపథ్యంలో ఒక్క జన్‌ధన్ ఖాతాలే మా బ్యాంకులో దాదాపు 11 కోట్లు ఉన్నాయని వాటి నిర్వహణకోసం ఖచ్చితంగా పెనాల్టీలు విధిస్తామని ఎస్‌బీఐఏ ఛైర్మన్ అరుంధతీ బట్టాచార్య హుకుంజారీ చేశారు. ఐదేళ్ల విరామం తర్వాత ఖాతాల్లో కనీస నెలవారీ నిల్వ రూ.5000 లేకుంటే అపరాధరుసుం వసూలుచేస్తామని, ఉంచాల్సిన నిల్వకంటే 75 శాతం తక్కువగాఉంటే రూ. 75 పెనాల్టీతోపాటు సర్వీసు చార్జీలు వసూలు చేస్తామని,50 శాతం తక్కువ చార్జీలు ఉంచితే 50 రూపాయల పెనాల్టీతోపాటు సీర్వీసు ఛార్జీలు వసూళ్లు ఉంటాయంటున్నారు. అలాగే ఏటీఎం ఖాతాదారులు సొంత ఖాతాలలఏటీఎంల నుంచి 5సార్లు ఇతర ఖాతాల ఏటీఎంల నుంచి మూడుసార్లు పరిమితిని విధిస్తున్నామన్నారు. ఆపై చేసే ప్రతి లావాదేవికి రూ. 20 వసూలు చేస్తారు. అయితే ఖాతాలో రూ. 25 వేలకంటే మించి ఉన్న ఖాతాలకు ఎస్‌బీఐ ఏటీఎంల నుంచి జరిపే విత్‌డ్రాలపై రుసుము వసూలుచేయబోరు. రూ. 1 లక్ష జమ కలిగిన వారు ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి చేసే నగదు డ్రాలకు కూడా రుసుము ఉండదని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాదారులు నాలుగు నెలల లావాదేవీల అనంతరం ప్రతి నగదు ఉపసంహారణపై రూ. 150 పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దేశంలోనే అతి పెద్ద బ్యాంకు




ఐసీఐసీఐ బ్యాంకు నాలుగు నగదు లావాదేవీలు ఉచితంగా ఇచ్చి ఆపై జరిగే ప్రతి లావాదేవికి వెయ్యికి రూ. 5 చొప్పున వసూలు చేయనుంది. వీటి ప్రభావం 31 కోట్ల మందిపై భారంగా మారనుంది. ఈ బాదుడిపై ప్రజలు అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకు బ్రాంచీల్లో ఉపసంహరణలు, డిపాజిట్లపైన చార్జీలు వసూలు చేయనట్లయితే ప్రభుత్వ నగదురహిత దెబ్బతినిపోతాయని బ్యాంకులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి. బ్యాంకు నిర్వహణా ఖర్చులైన ఖాతాదారుల వివరాలను కంప్యూటరీకరించడం, చెక్‌బుక్, ఏటీఎం/ డెబిట్ కార్డులు, బ్యాంకు సిబ్బంది వేతన, భత్యాలు,



బ్యాంకు శాఖల అద్దె, విద్యుత్ ,ఫోన్ ఖర్చులు సగటున రూ. 30 అవుతున్నాయంటున్నారు.

జన్‌ధన్ ఖాతాలు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, పింఛన్లతో ఖాతాల్లో సొమ్ములేకుండా లావాదేవీలు జరగటంతో ఖర్చులు పెరిగి పోతున్నాయని, అందువల్ల చార్జీలు విధించడం తప్పని సరని బ్యాంకుల వాదిస్తున్నాయి.

అయితే సామాన్యుడికి రుణాలు ఇవ్వాలంటే అనేక నియమనిబంధనలతో నానా అగచాట్లకు గురి చేసే బ్యాంకులు పారిశ్రామికులకు పోటీపడి వేల కోట్లు అందించాయి.కింగ్ ఫిషర్ అధినేత విజయ మాల్యానే రూ. 9వేలకోట్లు బ్యాంకులకు ఎగవేసి లండన్ చెక్కేసిన విషయం తెలిసిందే..గత సెప్టెంబరు నాటికి దేశంలోని 49 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఇచ్చినరుణాల్లో నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) గా మారినవి రూ. 6.30 లక్షల కోట్లు. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలు రుణంగా పొంది నిరర్థక ఆస్తులుగా మారిన 20 ఖాతాల్లోని మొత్తం 1.54 కోట్లు 2013 ఏప్రిల్‌నుంచి 2016 జూన్ వరకు పీఎస్‌బీలు రద్దు చేసినవి( వసూలు చేయలేమని నిర్ధారించినవి) 1.54 లక్షల కోట్లు. ఈ సొమ్మునంతటినీ ఇప్పుడు ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేయడానికి బ్యాంకులు ముందుకొస్తున్నాయి.

ప్రజలపై నానా రకాల పన్నులు విధించే బ్యాంకులు జన్‌ధన్ ఖాతాలతో తమపై భారం పడుతుందని ప్రభుత్వానికి ఎందుకు తెలియ చెప్పలేదు... వీటిపై ముందుగా చర్చించి ప్రజలకు భారం కలుగని విధంగా ప్రణాళికలు ఎందుకు రచించలేదు ? బడా పారిశ్రామిక వేత్తలు కోటానుకోట్లు రుణాలు పొంది చెల్లించకుండా వారి ఆస్తులు నిరర్థకంగా మారుతున్నా ఈ బ్యాంకులు ఏంచేస్తున్నట్లు ? సామాన్యుడినే ఎందుకు బలిపశువును చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించదు సరికదా..11 ఏళ్లలో ఏళ్లలో రూ. 2.51 లక్షల కోట్లను రద్దు చేసింది.

– ఖాన్

## ఈవీఎంల టాంపరింగ్ ఆరోపణలు నిరాధారం

**న్యూఢిల్లీ :** ఇటీవల ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొన్ని రాజకీయ పార్టీలు ఈవీఎంల టాంపరింగ్ జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం త్రోసిపుచ్చింది. ' ఆ ఆరోపణలన్నీ నిరాధారమైనవి, పసలేనివి. సమర్థవంతమైన సాంకేతిక, నిర్వహణపరమైన రక్షణ చర్యలు చేపట్టాం. ఈవీఎంలు టాంపరింగ్‌కు గురికాలేదు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను అవి రక్షిస్తాయి' అని ఈసీ తెలిపింది. '2009లో ఢిల్లీ హైకోర్టు ముందుకు వచ్చిన ఒక కేసులో ఈవీఎంల టాంపరింగ్‌ల గురించి అన్ని అంశాలూ లేవనెత్తబడ్డాయి. అయితే ఈవీఎంపై ఎందుకు రిగ్గింగ్ జరగదనే విషక్ష్మీమై భారత ఎన్నికల సంఘం ఇచ్చిన సవివరమైన వివరణతో ఢిల్లీ హైకోర్టు సంతృప్తి చెందింది. అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదించిన తర్వాత వీవీపీఏటీని అభివృద్ధి చేయడం జరిగింది' అని ఈసీ పేర్కొంది. ప్రస్తుతం నిర్దిష్ట ఆరోపణలకు సంబంధించి ఏదైనా వాస్తవ ఆధారాలను సమర్పించి నట్లయితే, పాలనా పరమైన లోపాటు ఏమైనా జరిగాయా అనే విషయాన్ని చిత్తశుద్ధితో పరిశీలిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీఎస్‌పీ ఓటమి పాలుకావడంతో ఆ పార్టీ అధ్యక్షురాలు మాయావతి ఈవీఎంలపై తొలిసారిగా సందేహాలు వ్యక్తం చేశారు.

## బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు మొండిచెయ్యి :కత్తి



**పొన్నూరు :** ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ యస్‌సి, యస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు మొండిచెయ్యి ప్రదర్శించిందని నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ కత్తి పద్మారావు విమర్శించారు. పొన్నూరులోని ఆపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఈ విషయాన్ని ముందే సూచించిందన్నారు. సంవత్సరానికి బడ్జెట్ పెరిగి 2019 కల్లా 2 లక్షల కోట్ల బడ్జెట్‌ను రాష్ట్రప్రభుత్వం సమర్పించి గలుగుతుందని చెప్పినప్పుడు దానిని ముఖ్యమంత్రి కూడా ఖండించారన్నారు. యనమల రామకృష్ణుడు ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు రావాల్సిన సబ్‌ప్లాన్ కోటాను జనాభా నిష్పత్తి నుంచి కాక ఆయన ఇష్టమొచ్చిన పద్ధతిలో ఇచ్చారని విమర్శించారు. ఎస్సీలకు 9,847 కోట్లు, ఎస్టీలకు 3,528 కోట్లు కేటాయించారు. నిజానికి రావాల్సింది జనాభా నిష్పత్తి ప్రకారం 22.71 శాతం ఇప్పుడు రాష్ట్రంలో జనాభా ఎస్సీలు 17.4 శాతం, ఎస్టీలు 5.31 శాతంగా ఉన్నారు. ఈలెక్క ప్రకారం మొత్తం ఎస్సీ, ఎస్టీలకు వార్షిక నిధులు 35,654 కోట్లు, ఎస్సీలకు 27,317 కోట్లు, ఎస్టీలకు 8337 కోట్లు రావాలన్నారు. 2016-17లో 62 శాతం మాత్రమే ఖర్చుచేశారన్నారు. తెలుగుదేశ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు పూర్తి వ్యతిరేకంగా నిలుస్తుందన్నారు. సబ్‌ప్లాన్ నిధులకు జనాభా నిష్పత్తిని బట్టి కేటాయించకపోగా కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయకుండా మిగల్చటం సామాజిక న్యాయానికి ద్రోహం చేస్తున్నట్లే అని ఆయన నిరసన వ్యక్తం చేశారు.

## ఆధారాలున్నా..
## నల్లధనం వెలికితీతలో ఐటీ శాఖ విఫలం : కాగ్

**న్యూఢిల్లీ :** తగిన ఆధారాలున్నాగానీ నల్లధనాన్ని వెలికితీయడంలో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ విఫలమైందని కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) పేర్కొంది. మహారాష్ట్రకు చెందిన పలుకంపెనీలు బోగస్ బిల్లులు సమర్పిస్తూ రూ.10,640 కోట్లకు పైగా పన్నులను ఎగవేసినటుట్ట ఆధారాలు ఉన్నా ఐటీశాఖ నల్లధనాన్ని వెలికితీయలేకపోయిందని అధికారిక ఆడిటర్ తెలిపింది. మహారాష్ట్రలో 12.5 శాతం గరిష్ట వ్యాట్‌తో సహా రూ. 10,640 కోట్లకుపైగా పన్ను ఎగవేతకు సంబంధించి సుమారు 2,059 మంది డీలర్లు ఇన్వాయిస్లు జారీచేసినట్టు గత వారం పార్లమెంటులో సమర్పించిన నివేదికలో కాగ్ వెల్లడించింది. మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ. 1,333 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను ముందుకు తీసుకువెళ్లిన 39,488 లబ్ధిపొందిన డీలర్లతో సహా 1,555 హవాలా ఆపరేటర్లపై జరిపిన విచారణకు సంబంధించిన వివరాలను (2008-19లో) మహారాష్ట్ర అమ్మకపు పన్ను శాఖ (ఎంఎస్‌టీడీ) బాంబే హైకోర్టుకు తెలిపింది. 2009-10 నుంచి 2013-14 వరకు రికార్డులను పరిశీలించిన కాగ్ ఎంఎస్‌టీడీ బోగస్ కొనుగోళ్ల జాబితాలో 35 కేసులు ఉన్నట్టు 2009-10 వెల్లడించింది.

## బ్రాడీపేటలో సెంట్రల్ పార్కింగ్

**రా.వా. ప్రతినిధి,గుంటూరుక్రైం :** గుంటూరు నగరం బ్రాడీపేట నాల్గవ లైనులో సెంట్రల్ పార్కింగును ఏర్పాటుచేసి పాదచారులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ కండే శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు అర్బన్ జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠత్రిపాఠి ఆదేశాల మేరకు ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు చేస్తున్న కృషిలో భాగంగా బ్రాడీపేటలో సెంట్రల్ పార్కింగును ఏర్పాటుచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. ప్రతినిత్యం పెరగుతున్న రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్య తీవ్రమై ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సెంట్రల్ పార్కింగు నిర్ణయంవలన ప్రజలకు ఎంతగానో మేలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై ఉన్న అక్రమ కట్టడాలను, ఆక్రమణలను, మెట్లను,ర్యాంప్‌లను, దుకాణదారులను, బళ్లను మునిసిపల్ శాఖ వారి సమన్వయంతో తొలగించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి, సహకరించాలని, గుంటూరు నగరం అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. రోడ్లుకు ఇరువక్కల ఎటువంటి పరిస్థితుల్లోనూ పూలబండ్లు, ప్లాస్టిక్ సామాన్లు విక్రయించేవారు. పండ్లు, కూరగాయలు, తినుబండారాలు, టిఫిన్ సెంటర్లను నిర్వహించేవారు. అడ్డుతగుల కూండా ఉండాలని ఆయన సూచించారు.

# 'బాహుబలి' 2 రికార్డుల మోత



సినిమా

"బాహుబలి" ట్రైలర్ వస్తూనే సంచలనాలు షురూ చేసింది. యూ ట్యూబ్ రికార్డుల దుమ్ము దులిపేస్తోంది. 'బాహుబలి ది కంక్లూజన్' ట్రైలర్ సోషల్ మీడియాలో విడుదలైన 24 గంటల్లోనే 5 కోట్ల వ్యూస్ దాటేసింది. అవెంజర్స్, ఏజ్ ఆఫ్ అల్ట్రాన్‌లను మించిపోయింది. అవెంజర్స్‌కు 5 లక్షల 16 వేల లైక్స్ రాగా బాహుబలి 2 24 గంటల్లోనే ఆ రికార్డు బ్రేక్ చేసి సెన్సేషన్స్ సృష్టించేసింది. ఇదంతా ఒక్క తెలుగు వెర్షన్ రికార్డ్ మాత్రమే. అన్ని భాషల్లోనూ కలిపితే ఈ రికార్డ్ ఇంకా అల్లంత దూరంలో ఉంటుంది. ఈ రోజు ఉదయం ఎంపిక చేసిన థియేటర్లలో ట్రైలర్‌ని విడుదల చేయడంతో, థియేటర్ల వద్దకు జనం పోటెత్తారు. ఇదీ 'బాహుబలి' మేనియా అంటే.! దేశవ్యాప్తంగా చూసుకుంటే, ఇప్పుడన్ని భాషల్లోనూ అత్యంత ఉత్కంఠతో ఎదురుచూస్తున్న సినిమా 'బాహుబలి ది కంక్లూజన్' మాత్రమేనన్నది నిర్వివాదాంశం. ఇప్పుడే 'బాహుబలి ది కంక్లూజన్' మేనియా ఇలా వుంటే, సినిమా విడుదలకు దగ్గరయ్యేకొద్దీ, ఆ మేనియా ఏ స్థాయిలో వుంటుందో ఊహించుకోవడం కూడా కష్టమే. 'బాహుబలి'2కు ఇంతటి మేనియా రావడానికి రియో ఫ్రీ ఆఫర్ మూలంగానే ఇది సాధ్యమయిందటున్నారు. దేశవ్యాప్తంగా తెలుగు సినిమాకి ఇంతటి గౌరవం దక్కడం.. తెలుగువారందరికీ గర్వకారణం.

**అమ్మో నాలుగా ?**

ఈ సినిమా స్టోరీ లీక్ కాకుండా ఉండేందుకు 4 క్లైమాక్స్ లు చిత్రీకరించారనే టాక్ ఉంది. దీనికి స్పందించిన రాజమౌళి.. ఒక్క క్లైమాక్స్ ను పూర్తి చేసేందుకే చాలా కష్టపడాల్సి వచ్చిందని, ఇక నాలుగు క్లైమాక్స్ లను చిత్రీకరించడం అంటే సామాన్యమైన విషయం కాదని.. అలాంటిదేమీ లేదని చెప్పేశాడు జక్కన్న. తొలి భాగం సక్సెస్ కారణంగా.. రెండో పార్ట్‌కు భారీగా మార్పులు చేయడంపై కూడా రియాక్ట్ అయ్యాడు రాజమౌళి. యుద్ధ సన్నివేశాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వడం తప్పు.. మూల కథలో కానీ.. కేరక్టర్స్ లో కానీ ఏ మాత్రం మార్పులు చేయలేదన్న జక్కన్న.. తొలిభాగం పూర్తయ్యేనాటికే రెండో భాగానికి సంబంధించి 30 శాతం షూటింగ్ పూర్తి చేశామన్నారు.

# అనవసరపు జోక్యం తగదు

## రాజ్యసభలో వెంకయ్యపై విపక్షాల ఫైర్

**న్యూఢిల్లీ :** గోధుమ పంట బాగా పండిన సమయంలో ఎలాంటి రుసుం లేకుండా దిగుమతులకు అనుమతివ్వండంపై ప్రభుత్వాన్ని సమర్థించేందుకు ప్రయత్నించిన కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుపై విపక్షాలు మండిపడ్డాయి. పంట ఖర్చులో 11/2 వంతు కనీస మద్దతు ధర ఇస్తామంటూ రైతులకు ఇచ్చిన హామీలని నిలబెట్టుకోలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. దీంతో జీరోఅవర్‌లో వాగ్వాదం జరిగింది. ప్రజలకు సంబంధించిన అంశాలను సభికులు ప్రస్తావించే సమయంలో పట్టణాభివృద్ధి మంత్రి అనవసరంగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎమిటని ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ ప్రశ్నించారు. ఆయన వ్యవసాయ మంత్రి కాదు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కూడా కానప్పుడు తనకు సంబంధం లేని వ్యవహారంలో జోక్యం ఎందుకని నిలదీశారు. మీకు ప్రతిదాంట్లో వేలు పెట్టడం అలవాటైపోయిందని వెంకయ్యనుద్దేశించి ఆజాద్ వ్యాఖ్యానించారు. డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని విమర్శించే సమయంలో జోక్యం చేసుకునే హక్కు మంత్రులకు ఉంటుందని అన్నారు. జీరో డ్యూటీ ఇంపోర్టు నేపథ్యంలో రైతులు తక్కువ ధరలకు తమ పంటను అమ్మేలా బలవంతం పెడుతున్నారని శరత్ యాదవ్ (జేడీ-యూ) తెలిపారు. క్వింటాల్ గోధుమల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.1,625గా ఖరారు కాగా, మార్కెట్‌లో అది రూ.1,550గా ఉందన్నారు. అలాగే వేర్వేరు పప్పుధాన్యాల క్వింటాల్ ధరలు రూ.4,527 నుంచి రూ.4,850గా; రూ.3400నుంచి 3,500గా ఉందని తెలిపారు. ఆయన వాదనను సీపీఐ(ఎం) నేత తపన్‌సేన్ సమర్థించారు. సీపీఎం నాయకులు సీతారాం ఏచూరీ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటికీ రైతులకు కనీస మద్దతు ధర లేదని, వారికిచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోలేదని అన్నారు. ఈ అంశంపై వామపక్ష పార్టీలతో పాటు కాంగ్రెస్, ఎస్పీ సభ్యులు గళం వినిపించారు. దీనిపై వెంకయ్య స్పందిస్తూ ఈ విషయమై చర్చకు విపక్షాలు నోటీసు ఇవొకవచ్చునని, ఈ విధంగా ప్రభుత్వాన్ని, దాని ఉద్దేశాలను విమర్శించడం తగదని అన్నారు. దీంతో తనకు సంబంధం లేని విషయాల్లో మంత్రి జోక్యం చేసుకోవడం ఎందుకని ఆజాద్ వాఖ్యానించడంతో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం తలెత్తింది.

# వచ్చే నెలలో కేంద్ర కేబినెట్ విస్తరణ?

**న్యూఢిల్లీ :** ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించిన తరువాత ప్రధాని నరేంద్ర మోడీ ఇక మంత్రివర్గ పునర్వ్యస్థీకరణపై దృష్టిపెట్టనున్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తరువాత కేంద్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశాలు కనబడుతున్నాయి. ఏప్రిల్ 12 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయి. కొన్ని ముఖ్యమైన శాఖలను భర్తీచేయడంతో పాటు కొత్త వారికి మంత్రవర్గంలో చోటు కల్పించేందుకు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాల్సి ఉందని విశ్వసనీయ వర్గాల కథనం. గోవా ముఖ్యమంత్రిగా మనోహర్ పారికర్ బాధ్యతలు స్వీకరించేందుకు అవకాశం కల్పిస్తూ ఆయన రాజీనామాను ఆమోదించారు. ఆయన నిర్వహించే రక్షణ మంత్రిత్వ శాఖ బాధ్యతలను ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి అదనంగా అప్పగించారు. జైట్లీ కీలకమైన ఆర్థికశాఖకు అదనంగా రక్షణశాఖను కూడా అప్పగించడంతో ఆయనకు పనిభారం పెరిగింది. నిత్యం ఆయన ఆర్థిక సంబంధమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించాల్సి రావడంతో మరో కీలకశాఖ అయిన రక్షణ బాధ్యతల్ని కూడా నెరవేర్చడం కష్టసాధ్యమని భావిస్తున్నారు. అలాగే, గత డిసెంబరులో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నందువల్ల విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ శాఖను కూడా మారుస్తారని చెబుతున్నారు. అయితే, ఆమె లోక్‌సభకు హాజరైనప్పుడు కోలుకున్నట్టుగానే కనిపించారు. పదిహేను నిమిషాల సేపు ప్రసంగంలో ఎక్కడా తడబడకుండా ఆమె నిలబడే ఉన్నారు. మంత్రివర్గంలో కొంతమంది కొత్తవారికి చోటు లభించడంతో పాటు ఇప్పుడున్న వారిలో కొంతమంది బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకుంటాయని, వారికి పదోన్నతి లభించే అవకాశాలున్నాయని సమాచారం. మోడీ ప్రధాని బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తయ్యాయి. కొత్తవారిలో మరింత ఉత్సాహం నింపేలా అవకాశం కల్పించే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గత సంవత్సరం జూలైలో మోడీ మంత్రివర్గాన్ని విస్తరించారు. అప్పుడు జైట్లీ నుండి సమాచారం, ప్రసారాల శాఖను వెంకయ్యనాయుడు స్వీకరించారు. అలాగే ప్రముఖ జర్నలిస్టు ఎంజే అక్బర్‌ను విదేశాంగ శాఖ సహాయమంత్రిగా నియమించారు.

## స్థానిక సంస్థల్లో ఏప్రిల్ 9 ఉప ఎన్నికలు

**37 ఖాళీల భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్**

**రా.వా ప్రతినిధి – విజయవాడ :** మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీల్లో 37 ఖాళీలను భర్తీ చేసేందుకు ఏప్రిల్ 9వ తేదీన ఉప ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఎన్నికల నోటీస్‌ను ఈనెల 20వ తేదీన రిటర్నింగ్ అధికారులు విడుదల చేస్తారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎన్ రమేష్‌కుమార్ దాఖలు చేసేందుకు ఈ నెల 20వ తేదీ నుండి 23 వరకూ కేటాయించామన్నారు. నామినేషన్లను 24వ తేదీన స్క్రూటినీ చేస్తారని, ఉపసంహరించుకునేందుకు 27వ తేదీ ఆఖరు తేదీగా ఆయన పేర్కొన్నారు. అదే రోజున అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఎన్నికల ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గటంల వరకూ జరుగుతుయన్నారు. ఓట్లలెక్కింపు 11వ తేదీ ఉదయం 8 గంటల నుండి ప్రారంభించి ఫలితాలను అదే రోజున వెల్లడిస్తామని ఆయన తెలిపారు. ఉప ఎన్నికలు జరిగే చోట కోడ్ ఈ నెల 16వ తేదీ నుండి ఏప్రిల్ 11 వరకూ అమలులో ఉంటుందని రమేష్‌కుమార్ తెలిపారు.

# కార్పొరేట్ కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలపై ఆందోళన

## సభా కమిటీ వేయాలని మండలి సభ్యుల డిమాండ్

**రా.వా ప్రతినిధి – అమరావతి :** రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయని, రెండు రోజుల క్రితం తిరుపతిలోని నారాయణ సంస్థలో విద్యార్థి సాయిచరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని, కేవలం ప్రైవేటు పాఠశాలల్లోనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇందుకు కారణాలు తెలుసుకొని నిరోధించేందుకు వీలుగా సభా కమిటీ వేయాలని శాసన మండలిలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. మహ్మద్‌జాని, పీరుకట్ల విశ్వప్రసాదరావులు అడిగిన ప్రశ్నపై సభలో పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి తరుపున పల్లె రఘునాథరెడ్డి విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాల్లో తల్లిదండ్రుల ఒత్తిడి కూడా ఒకటిగా పేర్కొనటాన్ని పీడీఎఫ్ సభ్యులు డాక్టర్ గేయానంద్, యండవల్లి శ్రీనివాసులురెడి, ఎంవీఎస్.శర్మ, బొర్డు నాగేశ్వరరావులు ఆగ్రహంతో శాసన మండలి వెల్‌లోకి దూసుకువచ్చి మంత్రి తప్పు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సీపీఐ సభ్యుడు చంద్రశేఖర్‌రావుకూడా మద్దతు పలికారు.

కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలను కాపాడేందుకు మంత్రి విద్యార్థుల తల్లిదండ్రులపై నెపం మోపుతున్నారని, విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా లక్షలాది రూపాయల ఫీజులే కారణమని అన్నారు. టిడిపి సభ్యుడు ఎంవివిఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటివి జరగటం లేదని, కార్పొరేట్ కళాశాలల్లోనే ఆత్మహత్యలు జరుగుతున్నాయని, కారణాలను అన్వేషించి ఆ సమస్య పునరావృతం కాకుండా పరిష్కారించాలన్నారు. మంత్రి పల్లె మాట్లాడుతూ తాను అన్నమాటకు సభ్యుల మనోభావాలు దెబ్బతింటే క్షమించాలని కోరారు. ఆ తరువాత ఈ ప్రశ్నకు సమాధానమిస్తూ ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం ఇప్పటికే రిటైర్డ్ వీసీ రత్నకుమారిలతో ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఏప్రిల్ 15న అందుతుందన్నారు. అయితే విద్యార్థుల ఆత్మహత్యలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూనే ఉందన్నారు. సభలో చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు, అల్పసంఖ్యాకుల సంక్షేమం కోసం నిధులు, ఆరోగ్య కార్డులు, క్రిమిసంహారక మందుల డీలర్లపై చర్చ జరిగింది.



యూపీలో బీజేపీ తరుపున గెలుపొందినవారిలో 200 మంది పైగా కోటీశ్వరులు, నాలుగోవంతు మంది కరడుగట్టిన నేరస్తులు, ఎంత గింజుకున్నా 2014 కంటే తక్కువ ఓటింగుకే బీజేపీ పరిమితమైంది.

## విపక్షాలను చిత్తు చేసేందుకు

# విలువలకు పాతర

- కుల,మత,ప్రాంతాలవారీగా విభజన
- 10 వేల గ్రూపుల వాట్సప్‌లు

దేశంలో బీజేపీ అధికారం కొనసాగాలంటే నాలుగు రాష్ట్రాలపెట్టయిన ఉత్తరప్రదేశ్‌లో ఎలాగైనా గెలవాలనుకున్నారు. అందుకు ప్రణాళిక రచించి, దాని ప్రకారమే పనిచేసి, ప్రత్యర్థులను చిత్తు చేశారు. 2015 నుంచి ఎన్నికలకు సిద్ధమైన బీజేపీ బూత్ స్థాయినుంచి పార్టీ, దాని అనుబంధ సంస్థలను బలోపేతం చేసుకుంటూ వచ్చింది. ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల ప్రణాళికలను రూపొందించిన ఘనత బీజేపీదే..ఓటర్లను యువత, మహిళలు, ఓబీసీలు దళితులు ఎస్‌సీ, ఎస్టీ, ముస్లింలుగా విడగొట్టారు. వీరందరినీ తనకు అనుకూలంగా మార్చుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను రూపొందించారు. యూపీలో తాము అధికారంలోకి వస్తే రామమందిర నిర్మాణం చేస్తామంటూ ఎన్నికల ప్రణాళికల్లో పేర్కొంటూ ఎన్నికల కమిషన్ (కులాలు-మతాలను ఎన్నికల్లో ప్రస్తావించరాదన్న) ఆదేశాలను బేఖాతరు చేసింది. ముస్లింలకు ఒక్కస్థానాన్ని కూడా కేటాయించని బీజేపీ ప్రతిపక్షాల అనైక్యతనూ ఉపయోగించుకుంది. ఎన్నికల్లో కుల,మత,వర్గ విభేధాలు సృష్టించడానికి వెనుకాడలేదు. ప్రధాని ఖబరిస్తాన్‌కు 24 గంటలూ కరెంటు ఉంటే శ్మశానానికి ఉండాలి,రంజాన్‌కు కరెంటు ఉంటే దీపావళికి ఉండాలంటూ ఓటర్లను రెచ్చగొట్టారు. పెద్దనోట్లపై విమర్శలు కురిపించనవారిపై వ్యక్తిగత విమర్శలు చేశారు. ఏడు దశల్లో జరిగిన యూపీ పోలింగ్‌లో 23 బహిరంగ సభల్లో ప్రధాని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 900 ర్యాలీలు నిర్వహించి 67 వేల మంది కార్యకర్తలను రంగంలోకి దించారు. సామాజిక మాధ్యమం వాట్సప్‌లోనూ, యువత, విద్యావంతులు లక్ష్యంగా ప్రచారం చేసింది. సుమారు 10 వేల వాట్సప్ గ్రూపులను తయారు చేసుకుందంటే ఎంత పకడ్బంధీగా ప్రణాళిక తయారు చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ ఏ రాజకీయ నాయకుడు అవసరమనిపిస్తే అక్కడకు తరలించడానికి హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచింది. గెలుపుకోసం అంగబలం,అర్థబలం, అవకాశవాద బలం అన్నీ ఉపయోగించి రాజకీయ విలువలకు పాతర వేసింది. సాద్యాసాధ్యాలను బేరీజు వేయకుండా రైతురుణాలు మాఫీ చేస్తానని వాగ్దానం ఇచ్చారు. దీంతో 403 స్థానాల్లో 325 స్థానాలు కైవసం చేసుకుంది.

నాలుగు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగానే నల్లధనం నిర్మూలనే ధ్యేయం అని పెద్దనోట్లురద్దు చేశారు. నోట్లరుద్దుతో ప్రజల అగచాట్లు పడుతున్న విషయాన్ని గట్టిగా నిలయ్యేలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తే , పేదల ద్రోహులు, అభివృద్ధి నిరోధకులు, దేశద్రోహులు అని ఎదురు దాడి చేసి, వాటి గొంతు నులిమింది. దీంతో ప్రతిపక్షాలు నోట్లరద్దును మంచిదేకాని అమలు తీరుబాగోలేదు అని మాత్రమే అనగలిగాయి. బడాబాబుల పనిపడతాం అన్నారు, నల్లధనాన్ని వెలికి తీసి పేదల ఎకౌంట్లో వేస్తాం అని చెప్పారు. ఇవేమీ జరగలేదు. పెళ్లిళ్లు ఆగిపోయాయి. మృతిచెందినవారి అంత్యక్రియలు జరపటానికి నానా అగచాట్లు పడ్డారు. అయినా ఆశ్చర్యకరంగా వారి విజయం నల్లేరుపై నడకలా సాగింది. దీన్నిబట్టి తెలిసేదేమంటే ప్రధాని మోడీ ప్రజలను మోసం చేయడంలో ఎంతో చాకచక్యం చూపుతారని. నోట్లరద్దునుంచి కోలుకుంటానికి ప్రజలకు 6 నెలలు పైగానే పడుతుందని తెలుసు ..అందుకే నాలుగోనెలలో ఎన్నికలు వస్తున్నాయనగా నోట్లరద్దును చేపట్టింది. ప్రజలు, అధికారపార్టీలు డబ్బులు లేక కటకటలాడుతుండగా, రద్దుకు ముందే రూ. బ్యాంకుల్లో నగదును దాచి, విస్తారంగా డబ్బు పంపిణీ మొదలు పెట్టింది. పకడ్బందీగా పథకాన్ని నెరవేర్చడానికి ప్రధాని మోడీ అక్కడే మకాం వేశారు. పని సాధించారు... ప్రత్యర్థులను మట్టికరిపించారు.

**నోట్ల రద్దుకంటే ముందే రూ. 2000 నోట్లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోకి ఎలా వచ్చాయి?రద్దుకు 3నెలల ముందే రూ. 60 లక్షల కోట్ల డిపాజిట్లు ఎలా వచ్చాయి?నోట్లరద్దు ప్రకటనకు ముందే గుజరాత్‌లోని ప్రైవేట్ బ్యాంకులకు ఎలా నోట్లు చేరాయి ? పదవీకాలానికి ముందే రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకం ఎలా వచ్చింది? రద్దు రోజు అమిత్‌షా ఇంటి ముందు పెద్దలైన్లు ఎందుకున్నాయి ? లాంటి ప్రశ్నలకు జవాబు లేదు.**

### ఈసీలు ఓడించాయి : మాయావతి



ఎగ్జిట్ పోల్స్‌లో కేవలం 180 సీట్లు వస్తాయని మాత్రమే వెల్లడించడం, అద్యానితో సహా బీజేపీ వర్గాలన్నీ బంపర్ మెజారిటీ చూసి అవాక్కవడంతో ఎన్నికల్లో చీటింగ్ జరిగిందన్న అనుమానం బలపడింది. మమ్మల్ని బీజేపీ ఓడించలేదు.. ఈవీఎంలు ఓడించాయని బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత్రి మాయావతి వ్యాఖ్యలతో చాలా మంది ఏకీభవించారు. ఇక్కడ ఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టాలని కాదుకాని, అధికారులు ఎంత పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించినప్పటికీ అవకాశ రాజకీయన నాయకులు అంత తూట్లు పొడుస్తానికి ఎదురు చూస్తారన్నది నిజం..ఎందుకంటే పూర్తిగా ముస్లిం ప్రాంతాల్లోకూడా బీజేపీ విజయంసాధించడం ఆ అనుమానాలకు తావిస్తోంది. విలువలకు తిలోదకాలిచ్చే బీజేపీ ఎంతకైనా తెగిస్తుందన్న అపవాదు (నిజమేలెండి) బీజేపీపై ప్రభలంగా ఉంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు) ఏ మీట నొక్కినా బీజేపీకే వెళ్లేట్లు, లేదంటే ఆయా ఎన్నికల గుర్తులు పనిచేయకుండా చేశారన్న ఆమె ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. నిజానికి ఇంతకుముందు సాధారణ ఓట్లలెక్కింపులో లానే మళ్లీ ఒకసారి లెక్కింపు జరిపితే బాగుండేదని అందరి మనస్సుల్లో ఉండిపోయింది. ముస్లిం,దళిత ఓట్లు ఎక్కువగా ఉన్నచోట్ల ఆయావర్గాలకు చెందిన వారిని అభ ్యర్థులుగా ఇవ్వడంతో మిగతావారు ఓట్లువేయలేదని, దీంతో బీఎస్పీకి గట్టి ఎదురుదెబ్బ తలిందన్న వాదం ఉన్నా ప్రజల అనుమానం మాత్రం ఈవీఎంల మీదే ఉంది. ఏది ఏమైనా మోడీ గుజరాత్ కుతంత్రాల ముందు యపీనాయకులు చతికిల పడ్డారని చెప్పక తప్పదు. ఈ ఫలితాలతో దెబ్బతిన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలు ఈవీఎంలతో వద్దని ఈసీని కోరడం మాయావతి వాదానికి బలం చేకూర్చుతోంది.

**ఎన్నికల్లో గెలవడానికి మనకు ఎన్ని ఓట్లుకావాలో అన్నే రిగ్గింగ్ చేయాలి అవకాశం ఉంది కదా అని ఎక్కువ వేసుకుంటే ప్రత్యర్థులకు అనుమానం వస్తుందని అమెరికా మాజీ అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ వెల్లడించారు.**

### ఆప్ ఆక్రోషం



అవినీతికి వ్యతిరేకంగా గోవాలో అనేక ఉద్యమాలు చేపట్టి, ప్రభుత్వాన్ని గడగడ లాడించిన ఆమ్‌ఆద్మీపార్టీకి ఒక్క స్థానంలో కూడా గెలుపు సాధించకపోవడం ఆపార్టీని క్రుంగతీస్తోంది. ఎన్నికల్లో మిస్టర్ క్లీన్‌లను నిలిపాం, నిజాయితీని ఎలుగెత్తి చాటాం... అయినా ఒక్కసీటు కూడా రాబట్టలేకపోయాం..ఈ రాష్ట్ర ప్రజలకు ఇంతకన్నా ఏంకావాలో అర్థం చేసుకోలేకపోతున్నా అంటూ ఆరాష్ట్ర అప్ కన్వీనర్ ఎల్విస్ గోమేజ్ చెప్పడం గమనార్హం. ఎన్నికల కమిషన్ వేలం నిర్వహిస్తే బావుండేదని, ఎవరు ఎక్కువ డబ్బు కుమ్మరిస్తే వారికే పదవి దక్కేదని ఆయన ఘాటుగా విమర్శించారు. 70 ఏళ్ల స్వతంత్ర భారత్ ఓటర్లకు డబ్బునిచ్చి ఓట్లు వేయించుకోవడం అలవాటు చేసిందన్న సత్యాన్ని ఆయన మరిచిపోయినట్లున్నారు.

### పాపం పసివాళ్లు





మతోన్మాదాన్ని రాష్ట్రంలోకి రానీయకూడదని యువనాయకులైన రాహుల్- అఖిలేష్ చేసిన ప్రయత్నం, కృషి అభినందనీయం. సమాజ్‌వాదీ-కాంగ్రెస్‌లకు చెందిన ఇద్దరు యువనాయకులు తమ పరిపాలన చూసి, తాము ఎన్నికల్లో ప్రకటించిన వాగ్దానాలకు యువతరం ఓట్లు వేస్తారని భావించారు.అందుకు గాను వారు అనేక వరాలు కురింపించారు. దాన్లో స్మార్ట్‌ఫోన్లు, ఉచిత విద్య, నిరుద్యోగభృతి, ఉపాధికల్పన తదితర అంశాలున్నాయి. ఎస్పీ కుటుంబ కలహాలు కూడా ఓటమికి దోహదపడ్డాయంటున్నారు. శక్తి కొద్దీ ప్రచారాలు చేసినప్పటికీ పెద్దతరం నాయకులు జిత్తులమారి రాజకీయాల ముందు వారి లక్ష్యాలన్నీ చిత్తయ్యాయి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మతరాజకీయాలను రాష్ట్రంలోకి అనుమతించబోమని అవసరం అయితే బహుజన సమాజ్‌వాదీపార్టీతో పొత్తు కుదుర్చుకుంటామన్న అఖిలేష్ తన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఎందుకంటే అవి మూడు కలసి కూడా కనీసం 100 స్థానాలను గెలుచుకోలేక పోయాయి. ఒక్క బీజేపీ మినహా యూపీలోని అన్నిపార్టీలు మహాకూటమిగా కలసి ఉంటే బహుశ బీహార్ ఎన్నికల ఫలితాలు వచ్చి ఉండేవని ఆశించవచ్చు. అనుభవరాహిత్యంతో రాహుల్- అఖిలేష్ ఒక్కోచోట ఫ్రెండ్లీ పోటీ అంటూ ఇద్దరు తమతమ అభ్యర్థులను నిలబెట్టడంతో బీజేపీకి అధికారాన్ని వెండి పళ్లెంలో పెట్టించినట్లయింది. ఏదిఏమైనా ఓటర్లను ఆకట్టుకోవడంలో మేము విఫలం చెందామని, ఇదిసమిష్టి విఫలం అని ఎస్పీ అధినేత ములాయం సింగ్ తన కుమారుడికి వత్తాసు పలకడం ఊరట నిచ్చే విషయం.

### అయ్యో.... షర్మిల



మణిపూర్ సాయుధ దళాలకు కేంద్రం కట్టబెట్టిన అసాధారణ హక్కులను నిరసిస్తూ 16 ఏళ్ల పాటు సుదీర్ఘ నిరాహార దీక్ష చేసిన ఆమె ప్రభుత్వాలు స్పందించకపోవడంతో రాజకీయాలతో ఈ పరిస్థితిని సరిదిద్దు తానన్నారు. అందులో భాగంగా ఆమె మణిపూర్ సీఎంకు పోటీగా ఎన్నికల్లో నిలిచారు.ఆమె సాదా-సీదాతనం ఎవరికీ నచ్చలేదు. అందుకే కేవలం 90 ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. ఈ పరిణామంతో విస్తుపోయిన షర్మిల ఇంక రాజకీయాల్లో కొనసాగేది లేదని స్పష్టంచేశారు. తన వ్యక్తిగత జీవితాన్ని ఒదులుకొని ప్రజలకోసం పాటు పడ్డ ఆమెను ప్రభుత్వాలు, ప్రజలు ఇద్దరూ వెన్నుపోటు పొడిచారు. ప్రజలు హంగు ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత నీతి నిజాయితీకి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత విచారకరం.

- బోస్

## మగవారికీ పితృత్వ సెలవులు

**న్యూఢిల్లీ :** మహిళలతో సమానంగా పురుషులకూ 26 వారాల పాటు పితృత్వ సెలవులను అందించనుంది. స్వీడన్‌కు చెందిన ఫర్నిచర్ తయారీ సంస్థ ఐకియా ఇండియా. ఈ మేరకు భారత్‌లోని తమ సంస్థ ఉద్యోగులకు 26 వారాల పేరేటంల్ లీవ్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యోగులకు సమానావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ అన్నా కేరిన్ మాన్సన్ తెలిపారు. సరోగసీ, దత్తత మార్గాన్ని అనుసరించిన వారికి కూడా ఈ పాలసీ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. మహిళలకు మాతృత్వ సెలవులతో పాటు అదనపు సౌకర్యాలను కూడా కల్పించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. మాతృత్వ సెలవుల అనంతరం మరో 16 వారాల పాటు మహిళలు తమ పనిగంటలను సగానికి తగ్గించుకునే అవకాశం కలిస్తోంది.

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు
యాడ్స్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442

అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు రాష్ట్రవ్యాప్తంగా
విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెం:9440662699
Email : Info@rajadhanivartalu.com


ఎం.బేగ్
శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహా
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.

## యూపీకి మాత్రమే కాదు ..

# దేశమంతటా రైతు రుణాలు మాఫీ చేయాలి

'వ్యవసాయ సంక్షోభం' పై కేంద్రంపై ప్రతిపక్షాల ధ్వజం



**న్యూఢిల్లీ :** వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు తూర్పారబట్టాయి. ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన రైతు రుణ మాఫీని కేవలం ఉత్తరప్రదేశ్ రైతులకే కాకుండా దేశమంతటా రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లోక్ సభలో వ్యవసాయ మంత్రిత్వ శాఖకు నిధుల డిమాండుపై చర్చ జరిగిన సమయంలో ప్రతిపక్ష పార్టీల సభ్యులు మాట్లాడుతూ గతేడాది 12 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక దృఢ కార్యాచరణతో ముందుకు రావాలని ప్రభుత్వాన్ని సభ్యులు కోరారు. వ్యవసాయ సంక్షోభం వల్ల మొత్తం ఆర్థిక వ్యవస్థ విఫలం కావచ్చున్నారు. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలపై ఎన్సీపీ సభ్యుడు ధనంజయ్ మహాదిక్ మాట్లాడుతూ పంట ఉత్పత్తులకు సమర్థవంతమైన మార్కెటింగ్ సౌకర్యాలు, పంట బీమాను పొడిగించడంతో సహా రైతులకు ప్రభుత్వం గట్టి మద్దతు ఇవ్వాలన్నారు. 'ఆత్మహత్యల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం తప్పనిసరిగా దేశంలోని రైతులందరి రుణాలను మాఫీ చేయాలి' అని అన్నారు. కాగా మధ్యాహ్న భోజన పథకం క్రింద పాఠశాల విద్యార్థులకు పప్పుగింజలను వడ్డించాలని మహారాష్ట్ర ఎంపీ ఒకరు సూచించారు. దీనివల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పాడి పరిశ్రమకు గట్టి సహాయం చేయాలని డిమాండు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ సభ్యుడు నినోంగ్ ఎరిన్గ్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యల పరంపరను పరిగణనలోకి తీసుకుని రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసే చర్యలను ప్రభుత్వం చేపట్టాలన్నారు. బహరుద్దీన్ అజ్మల్ (ఏఐయూడీఎఫ్) మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డిమాండు చేశారు. ఈశాన్య భారతాన్ని సేంద్రియ సాగుకు హబ్‌గా చేస్తానన్న హామీని ప్రధాని పరిపూర్తి చేయాలని కోరారు. వరదల్లో పంట నష్టపోయిన అస్సాం రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. బీజేపీ సభ్యుడు ఉదయ్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాల విధాన ప్రణాళిక అవసరమన్నారు. ల్యాండ్ సీలింగ్ విధానాన్ని సమీక్షించాలని, పెద్ద భూమిలో వ్యవసాయం చేసుకునేలా రైతులను అనుమతించాలని పేర్కొన్నారు. అలాగే, వ్యవసాయ భూమి అమ్మకం అనుమతికి సంబంధించి ఒక పరిమితి విధించాలని పేర్కొన్నారు. అలాగే, వ్యవసాయంతో సహా నదుల అనుసంధాన పనులను చేపట్టాలని కూడా వేర్వేరు సభ్యులు డిమాండు చేశారు. ఆర్.కె.భారతి మోహన్ (ఏఐఏడీఎంకే) మాట్లాడుతూ కావేరీ జలాల వివాదానికి ఒక శాశ్వత పరిష్కారం కనుగోనేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండు చేశారు. వ్యవసాయాన్ని లాభదాయక వృత్తిగా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ సభ్యుడు కె.హరిబాబు సూచించారు. సముద్ర లోతుల్లో చేపల వేటపై ఒక సమగ్ర విధానాన్ని తీసుకురావాలన్నారు. జైప్రకాష్ నారాయణ్ (ఆర్‌జేడీ) మాట్లాడుతూ వ్యవసాయానికి పరిశ్రమ హోదా కల్పించాలన్నారు. నోట్ల రద్దు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన పూర్కొన్నారు.

## హోదానా... మర్చిపొండి

**రా.వా ప్రతినిధి - విజయవాడ :** 'రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చే పద్ధతిని 14వ ఆర్థిక సంఘం నిలిపివేసిన తరుణంలో అందుకు సమానమైన ప్రత్యేక కేంద్ర పొందగలిగాం. దీనికి తగినచట్టబద్ధతసాధించడానికిఅన్నిచర్యలు తీసుకుంటున్నాము' ఇది ఏపీ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు తేల్చి చెప్పిన మాట. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్ష, హక్కు అయిన ప్రత్యేక హోదాను వదులుకున్నట్లు ఆయన ఈ ప్రసంగం ద్వారా చెప్పకనే చెప్పేశారు. ప్రత్యేక హోదా కోసం ఓ వైపు ప్రజలు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా పోరాడుతున్నప్పటికీ.. వదిలేసి ప్యాకేజీ కోసం పాకులాడుతున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో యనమల ప్రకటన చేయడం విమర్శలకు తావిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా కోసం మరో దఫా పోరాటం కోసం ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతుండగా.. హోదా లేదంటూ యనమల బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం గమనార్హం.

## చత్తీస్‌గఢ్ 'బాధిత కుటుంబాలకు అక్షయ్ ఆర్థిక సాయం



**ముంబై :** ఇటీవల చత్తీగఢ్‌ల నక్సల్స్ దాడిలో మరణించిన సీఆర్‌పీఎఫ్ కుటుంబాలకు ప్రఖ్యాత బాలివుడ్ హీరో కోటీ ఎనిమిది లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సంఘటన తరువాత ఆయన సంబంధిత ఐపీఎస్ అధికార, డీఐజీలతో చర్యలు జరిపారు. బాధిత కుటుంబాల్లోని ఒక్కొక్కరికి తొమ్మిది లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు.

## తెలుగుకు రూ.72 కోట్లు

**రా.వా ప్రతినిధి - అమరావతి :** తెలుగు భాషాభివృద్ధికీ, తెలుగు భాషను ప్రోత్సహించేందుకు మరింత పటిష్టంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నది. ప్రస్తుతం ఉన్న అధికారా భాషా సంఘం స్థానంలో 'తెలుగు భాషా ప్రాధికార సంస్థ' రాబోతోంది. భాష, సంస్కృతి, సాహిత్యం, కళలు, చరిత్ర పరిశోధనను పెంపొందించే విధంగా ఎన్నో చర్యలు చేపట్టేందుకు దిశానిర్దేశం చేసేందుకు ఈ సంస్థకు ఏర్పాటు చేయనున్నది.

## సీఎంను కలిసిన సంధ్యారాణి తండ్రి

### రూ.2 లక్షల సాయం



**రావాప్రతినిధి, అమరావతి :** గుంటూరు జీజీహెచ్‌లో పీజీ చదువుతూ ఆత్మహత్య చేసుకున్న మెడికల్ పీజీ విద్యార్థిని బాల సంధ్యారాణి తండ్రి బాల సత్తెయ్య .వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. సీఎం చంద్రబాబు బాలసత్తెయ్యకు రూ.2 లక్షలు మంజూరు చేశారు. సంధ్యారాణిని వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ లక్ష్మిపై దర్యాప్తు వేగవంతం చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, అమరావతిలో జైనుల పాఠశాల, పాఠశాల ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయించాలని శ్రీజైన శ్వేతాంబర సభ ప్రతినిధి దినేషజైన్ సీఎం చంద్రబాబును కోరారు.

## కల్తీ తినుబండరాల తయారీ ముఠా గుట్టురట్టు



**విజయవాడ:** విజయవాడలో కల్తీ తినుబండరాలు తయారీ ముఠా గుట్టురట్టయింది. సోంపాపిడి, సున్నుండలు తయారుచేసే కేంద్రాలు, దుకాణాలపై ఆహార నాణ్యత నియంత్రణ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. గద్దె వెంకటరామయ్య కాలనీలోని శంకర్ బిస్కట్స్ తయారీ కేంద్రంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాణ్యతలేని పదార్థాలతో సున్నుండలు తయారుచేస్తున్నట్టు గుర్తించారు. పశువులకు వాడే దాణా సహా ఇతర వ్యర్థ పదార్థాలతో ఈ తినుబండరాలను తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. రెండు క్వింటాళ్ల పశువుల దాణా స్వాధీనం చేసుకొని తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. నగరంలోని పలుచోట్ల ఇలాంటి కల్తీ పదర్థాలు అమ్ముతున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని జోనల్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణ చంద్రరావు వెల్లడించారు. విజయవాడలోని అన్ని దుకాణాలు, తయారీ కేంద్రాల్లోనూ తనిఖీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. తినుబండరాలు కొనే ముందు నాణ్యత, లేబుళ్లను తప్పకుండా పరిశీలించాలని ఆయన ప్రజలకు సూచించారు. కల్తీ తినుండరాల తయారీ, విక్రయాల వివరాలపై అనుమానం వస్తే 9440379755, 9848316338 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కల్తీతో తినుంబరాల తయారీ, విక్రయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని ఆయన హెచ్చరించారు.

## తుళ్ళూరులో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



**రా.వా. ప్రతినిధి-తుళ్ళూరు :** మండలంలో వైసీపీ 7వ సంవత్సరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తుళ్లూరులో సినిమాలు హాలు సెంటర్ వద్ద గల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి తాడికొండ నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కత్తెర క్రిస్టీనా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేసారు. రేద ప్రజలకు వైసీపీ పార్టీ అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. జగన్ పోరాట నాయకుడని అన్నారు. పార్టీ పెట్టిన అతి తక్కువ సమయంలో ప్రజల ఆదరాభిమానాలు పొందామన్నారు. పేదల కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేశాయన్నారు.

కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, శాఖమూరుసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, నాయకులు కొప్పుల శేఖగిరి, రాంబాబు, కంతేటి చిన వెంకటశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఖనిజవనరుల సంస్థ : సీఎం నిర్ణయం

**రా.వా ప్రతినిధి- అమరావతి :** రాష్ట్రంలో అపారంగా వున్న ఖనిజ వనరులను వెలికి తీసే ఇంజనీరింగ్ వ్యవస్థను నెలకొల్పడంతోపాటు, నిపుణుల కొరతను అధిగమించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో తొలిసారి మైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రమాబు నిర్ణయించారు. ఇందుకోసం ఆస్ట్రేలియా ప్రభుత్వ సహాయ సహకారాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గవర్నర్‌మెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. మైనింగ్‌లో తమకున్న అనుభవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా వున్నామని ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాంతంలో మైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసేలా తమ దేశంలోని కర్టిన్ యూనివర్సిటీ తగిన సహాయ సహకారాలందిస్తుని హామీఇచ్చారు. దీంతోపాటు వివిధ రంగాల్లో భాగస్వామలయ్యేందుకు ముందుకొచ్చారు. వాన, వరద నీటిని సద్వినియోగం చేసుకొని గ్రీన్‌బెల్ట్ ఏర్పరచే సాంకేతికతతో తమకు గుర్తింపు వుందని సీఎంకు వారు వివరించారు. ఇప్పటికే సింగ్‌పూర్, ఇజ్రాయిల్‌లో నీటి పరిరక్షణ చర్యలతో పచ్చదనాన్ని పెంపొందించామని చెప్పారు. దీనిపై ఆసక్తి కనబర్చిన సీఎం ఏపీలోని అన్ని పట్టణాలు, నగరాలతోపాటు అమరావతిలోనూ వాన నీటి సంరక్షణతో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని కోరారు. 3 నుంచి 8 మీటర్ల లోతున రాష్ట్రంలో భూగర్భ జలాల వుండేలా తీసుకున్న చర్యలను ప్రతినిధులకు చెప్పిన సీఎం భూగర్భ జలాల పెంపునకు మరింత సాంకేతికత అందించేలా చూడాలని సూచించారు. ఏపీలో కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టేందుకు వీలుగా సాంకేతికతను అందిచేందుకు తాము సిద్ధమని ఆస్ట్రేలియా ప్రతినిధుల చెప్పగా సీఎం దానికి రాష్ట్రం అనుకూలంగా వుందని, మిగులు విద్యుత్ వుందన్నారు. ఆస్ట్రేలియా రాయబారి సీన్‌కెల్లీ, సీఎం ముఖ్యకార్యదర్శి సాయి ప్రసాద్, పెట్టుబడులు, మౌలిక వసతుల ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, గనుల శాఖ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.oo

# టీడీపీ-వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు

## 8 మందికి తీవ్రగాయాలు


ఎనిమిది మందికి గాయాలు... ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్తలు రాళ్లపల్లిబాబు, ముస్తఫా, దస్తగిరి
చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్తలు బాలరాజు, మురళి, పోతలయ్య

**అనంతపురం /ధర్మవరం :** పట్టణం టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య గూడ్స్‌షెడ్‌కొట్టాలలో శుక్రవారం ఘర్షణ జరిగింది. దీంతో ఇరు వర్గాలకు చెందిన 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ కౌన్సిలర్ రాళ్లపల్లి బావమ్మ తనయుడు రాళ్లపల్లి బాబు, దస్తగిరి, ఫక ృద్దీన్, ముస్తఫా, వైసీపీకి చెందిన బాలరాజు, శ్రీనివాసులు, పోతలయ్య, మురళి తీవ్రంగా గాయప డ్డారు. వీరిలో రాళ్లపల్లి బాబు, బాలరాజుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... టంరీడీపీ వర్గీయులు తమపై దాడి చేశారని వైసీపీ వర్గానికి చెందినవారు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఉదయం కాలనీలో ఇరు వర్గీయుల మ ధ్య వాగ్వాదం జరిగింది. తాము కాలనీలోనే లేమనిం, అలాంటప్పుడు మాపై ఎందుకు అన వసరంగా కేసులు పెడతారని రాళ్లపల్లి బాబు వైసీపీ వర్గీయులను ప్రశ్నించాడు. కాలనీలో మీవల్ల మాకు గుర్తింపు లేకుండా పోతోందని, మిమ్మల్ని రాజకీయంగా అణగదొక్కాలనే కేసులు బనాయించామని బాబుతో వాదనకు దిగారు. మాటామాట పెరగడంతో అప్పటికే బాబువర్గానికి చెందిన కొందరు అక్కడికి చేరుకొన్నారు. దీంతో ఎక్కడ తమపై దాడి చేస్తారో అనే అనుమానంతో వైసీపీ వర్గీయులు దాడికి దిగారు. కట్టెలతో కొట్టుకొన్నారు. ఈ దాడిలో రెండువర్గాల్లోనివారు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అనంతరం రాళ్లపల్లి బాబు, బాలరాజుల ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అయితే గూడ్స్‌షెడ్‌కొట్టాల సమస్యాత్మక వార్డు అని తెలిసినా పోలీసు యంత్రాంగం ప్రత్యేక ద ృష్టి ఉంచకపోవడంతోనే ఈ ఘర్షణలు జరిగాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరువర్గాల ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కాలనీలో శుక్రవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

**బాధితులకు ఎమ్మెల్యే గోనుగుంట్ల , జడ్పీ చైర్మన్ పరామర్శ**

ధర్మవరం జరిగిన ఘటనలో గాయపడిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగిన వైద్యమందించాలని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ చమనసాబ్ పేర్కొన్నారు. శుక్రవారం ధర్మవరంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన గొడవలో గాయపడిన ఫక ృద్దీన్, ముస్తఫ, శేఖర్, అన్వర్, బాబు, అశాన్‌లు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ధర్మవరం ఎమ్మెల్యే, జడ్పీ చై ర్మన్ ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యమందించాలని వై ద్యులకు సూచించారు. ఏం భయపడకండి.. అండగా నేనున్నా.. అంటూ ఎమ్మెల్యే వారికి భరో సానిచ్చారు. గాయపడిన వారిలో బాబు అనే వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండ టంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జగన్నాథ్, ఆర్ఎం లలిత, పలువురు వైద్యులు, టీడీపీ నాయకులు, మేనేజర్ శ్వేత పాల్గొన్నారు.

## మర్యాదలు ముగిశాయి...

**కడప/ రాజంపేట :** ఎమ్మెల్సీ ఓట్లనిమిత్తం అధికార,ప్రతిపక్షపార్టీలు ఎంపిటీసీలకు ,జడ్పీటీసీలకు నిన్నటి వరకు ఒక రేంజ్‌లో విందులు, వినోదాలు సమకూర్చారు. ఒక పార్టీ ఏమో బెంగుళూరులో 20రోజులుగా ఇచ్చిన మర్యాదలు అన్నీ ఇన్నీ కావు. ఇరు పార్టీల ఉంచి లక్షల కొద్ది సొమ్ము, విందు వినోదాలు. పురుష ఎంపీటీసీలకు, కౌన్సిలర్‌లకు విందులే విందులు. సముద్రస్నానాలు, మహిళా మసాజ్‌లు, కుండ బిరియానీలు, ఫైవ్‌స్టార్ హెూటళ్ళను మించే రీసార్ట్స్‌లో వారు పడ్డ ఆనందాలు అన్నీ ఇన్నీ కావు. చివరకు ఏసీ బస్సుల్లో గురువారం రాత్రి వారిని ఎంతో రాచమర్యాద చేస్తూ పోలింగ్ బూత్ వద్దకు తీసుకువచ్చారు. ఓటు వేశారా.. సరే. ఏదో కొందరు ప్రత్యేక వాహనాల్లో తిరిగి వారివారి ఇళ్ళకు పంపారు తప్ప అనేక మందిని పట్టించుకుంటే ఒట్టు. ఈ విధంగా రాచమర్యాదలకు అలవాటు పడ్డ అనేక మంది ఓటు వేసిన అనంతరం ఊసురోమని ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది.

## 30న సీఎంఏ ర్యాంకర్లకుసత్కారం

**గుంటూరు(జిల్లాపరిషత్):** దిఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఇటీవల నిర్వహించిన సిఎంఏ పరీక్షలలో ర్యాంకులు సాధించినవారిని మార్చి 30న కలకత్తాలో ఘనంగా సన్మానిస్తారు. కొల్లా భవాని మొదటి ర్యాంకు, పులగం సాయి కుమార్ రెడ్డి రెండవ ర్యాంకు, షాహిల్ మూడవ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మోహన్ మట్లాడుతూ ఈ ఫలితాలను అందించిన సిబ్బందికి ధన్యవాదాలు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## మంత్రి - జడ్పీచైర్మన్ వర్గాల ఘర్షణలు



**రావాప్రతినిది, ప.గో:** పశ్చిమ గోదావరి జిల్లా పెద్ద తాడేపల్లిలో మేకల సంత విషయమై మంత్రి మాణిక్యాలరావు, జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గీయుల మధ్య రేగిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మేకల సంత ద్వారా వచ్చే ఆదాయం స్థానిక పంచాయతీకి చెందాలని టీడీపీ వర్గీయులు వాదించగా మేకల సంత ప్రైవేటు స్థలంలో ఉన్నదని కాబట్టి సంత ద్వారా వచ్చే ఆదాయం తమకే చెందాలని బీజేపీ వర్గం గొడవకు దిగింది. స్వయంగా మంత్రి మాణిక్యాలరావు వర్గం గ్రామ కార్యదర్శిని గదిలో నిర్బంధించి బలవంతంగా లైసెన్సు రాయించుకున్నారని జడ్పీ చైర్మన్ వర్గీయులు ఆరోపించారు. టీడీపీ వర్గీయులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకున్నారు. బాహాబాహీకి దిగారు. వివాదం తారాస్థాయికి చేరుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇరు వర్గాల వారికీ నచ్చజెప్పడంతో వివాదం తాత్కాలికంగా సమసి పోయింది.

## కదిరి రథోత్సవంలో అపశ్రుతి

**కదిరి:** అనంతపురం జిల్లా కదిరి పట్టణంలో శనివారం జరుగుతున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవంలో అపశ్రుతి చోటు చేసుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో ఒక హెూమ్‌గార్డుతో సహా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామిరథోత్సవంకన్నులపండు వగా ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేతుడ్కైన నృసింహుడికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసిశోభాయమానంగా అలంకరించారు.

## ఆమె కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదు : నారాయణ



**గుంటూరు, మార్చి 17:** వైసీపీ ఎమ్మెల్యే రోజా కన్నీరు పెట్టడం రాష్ట్రానికి మంచిదికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆమెను మరో ఏడాదిపాటు అసెంబ్లీ నుంచి నిషేధించే ప్రయత్నం సరైనది కాదన్నారు. గుంటూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అయినా రోజా చేసిన తప్పు ఏమిటి' అని ప్రశ్నించారు? చంద్రబాబు, అధికార పక్షానికిరోజా..కాళికాదేవిలా కనబడు తున్నట్లుందన్నారు. ఇప్పటికైనా రోజాను అసెంబ్లీలోకి అనుమతిస్తూ సభ తీర్మానం చేయాలన్నారు. రాష్ట్రాలు, కేంద్రంలోనూ ప్రతి పక్షాలకు ప్రశ్నించే అవకాశం లేకుండా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ నియంత ృత్వ పాలన గంగలో కలిసిపోయే రోజు వస్తుందన్నారు. బీజేపీయేతర పక్షాలన్నీ కలిస్తేనే ప్రధాని మోదీని ఓడించగలవన్నారు.

## ఏటీపీ అధ్యక్షుడిగా రాజనాల ఘన విజయం



**రా.వా ప్రతినిధి, ఆటోనగర్ :** విజయవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఆటోనగర్‌లో శుక్రవారం ఏటీపీ హాలులో మధ్యాహ్నం జరిగిన ఎన్నికల్లో ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్(ఏటిపి) అధ్యక్షుడిగా రాజనాల వెంకటరమణరావు(బాబ్జి) ఘన విజయం సాధించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యదర్శి నెల్లి సత్యనారాయణ నివేదిక సమర్పించగా, కోశాధికారి సయ్యద్‌షా సాహెబ్‌హుస్సేని(బాబా) 2016కు సంబంధించిన జమా ఖర్చులను సభ్యులకు తెలియచేశారు. అనంతరం అధ్యక్షుడు బాబ్జి తాను చేసిన అభివృద్ధిని సభ్యులకు వివరించారు. అనంతరం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు రాజనాల వెంకటరమణరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, పొలాసి వెంకట నాగభూషణం,సైకం రమేష్‌లు పోటీ చేశారు. మొత్తం 1894 ఓటర్లు ఉండగా 1774 ఓట్లు పోలయ్యాయి. రాజనాల వెంకట రమణరావు తన సమీప ప్రత్యర్థి గొల్లపూడి నాగేశ్వరరావుపై 985 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజనాలకు 1332 ఓట్లు రాగా, గొల్లపూడికి 347 ఓట్లు వచ్చాయి. పొలాసికి 26 ఓట్లు, సైకం రమేష్‌కు 69 ఓట్లు వచ్చాయి. ఎన్నికల కన్వీనర్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు బాయన వెంకట్రావు, ఉసా రమేష్,గొల్లు రంగారావు, పంచకర్ల వెంకట రమణరావు, అబ్దుల్ హై, డీవీకె.రామారావు, నడకుదిటి బ్రహ్మేశ్వరరావు, అరిగే శివాజీలు ఎన్నికలను పర్యవేక్షించారు. ఏటీపీ అధ్యక్షుడిగా గెలుపొందిన రాజనాలను ఆటోనగర్‌లోని పలు సంఘాల నేతలు అభినందించారు.

## బీజేపీ శ్రేణుల్లో విజయ గర్వం

- ట్రంప్ బాటలో బీజేపీ శ్రేణులు
- ఒక వర్గమే లక్ష్యంగా యూపీ గ్రామస్తులకు తాఖీదులు

**బరేలీ :** ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో బీజేపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. తమకు నచ్చని వర్గాలను బెదిరించడం, హెచ్చరిండం వరకూ బీజేపీ శ్రేణులు దురాగతాలకు అంతులేకుండా పోతోంది. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీకి 70 కిలోమీటర్ల దూరంలో గల జియంగాల గ్రామంలోని ఒక వర్గానికి ఇప్పుడు ఇదే బెడద ఎదురైంది. గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్లకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ఒక వర్గాన్ని బెదిరిస్తూ పోస్టర్లు గ్రామంలో వెలిశాయి. ఒక వర్గానికి చెందిన. ఇళ్లకు... ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ విజయం సాధించినందువల్ల డిసెంబర్ 30లోగా ఊరిని వదిలిపెట్టి వెళ్లిపోవాలని హెచ్చరికలతో వెలిసిన ఈ పోస్టర్లను చూసి పోలీసులు రంగంలోకి దిగారు. ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, పోలీసులను ఈ అంశంలో తగుచర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ సురేంద్ర సింగ్ తెలిపారు. ఈ సమాచారం అందినవెంటనే గ్రామానికి పోలాసులు తరలివెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించామని, శిశుఘర్ పోలీసు స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదైందని ఆయన చెప్పారు. ఈ పోస్టర్లు తయారు చేసిన కంప్యూటర్ కేంద్రం, ముద్రణాలయం యజమానుల్ని కూడా ప్రశ్నించామని సీనియర్ సూపరింటెండెంట్ జోగేంద్రకుమార్ పేర్కొన్నారు.

**ట్రంప్ చర్యలు ఇక్కడా తప్పవు**

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రాత్రే ఈ పోస్టర్లను తయారు చేశారు. ఒకవేళ ఆ వర్గానికి చెందిన వారు గడువులోగా ఊరిని వదిలిపెట్టి వెళ్లకపోతే అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం నుంచి ఆ వర్గానికి ఎదురవుతున్న పరిస్థితినే ఎదుర్కోవలసి ఉంటుందని ఆ పోస్టర్లలో హెచ్చరించారు. ఆరు ముస్లిం దేశాల నుండి వలసలు నిషేధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న అంక్షలను ఈ సందర్భంగా పోస్టర్లలో గుర్తుచేశారు. ఇళ్లకు అంటించిన పోస్టర్లలో చాలాభాగం పోలీసులు, ఇతర అధికారులు తొలగించారు.

# అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- నిందితుడిపై ఏపీ, తెలంగాణలో 17 కేసులు
- రూ.12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ జయలక్ష్మి

**తిరుపతి :** అంతర్ రాష్ట్ర గజ దొంగను రేణిగుంట, చంద్రగిరి హైవే రోడ్డులోని రామానుజపల్లె క్రాస్ వద్ద గురువారం సాయంత్రం అరెస్టు చేసినట్లు తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ జయలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిందితుడిపై మొత్తం 17 కేసులు నమోదై ఉన్నాయని, హత్య కేసులో జైలుకు వెళ్లాడని, మరో హత్య కేసు నడుస్తోందన్నారు. ఓ సెల్‌ఫోన్ చోరీ కేసుకు సంబంధించి చేసిన విచారణలో అతని దారుణ కృత్యాలు, చోరీలు వెలుగులోకి వచ్చాయని వెల్లడించారు. శుక్రవారం అర్బన్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను జయలక్ష్మి వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం పెద్దపూజార్లకు చెందిన నారా బసవరాజు అలియాస్ రాజు, అలియాస్ మహేష్ (38) ప్రస్తుతం బెంగళూరు సమీపంలోని బుధగేరిలో నివాసం ఉంటున్నాడు. ఇతడిని అరెస్టు చేసి విచారణ చేయగా 19 ఏళ్ల కాలంగా ఎన్నో నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. గతంలో హైదరాబాద్‌లో ఉంటూ అక్కడ తనతో పాటు నేరస్తుడైన ఇబ్రహీం అనే వ్యక్తిని 2003లో గొడవ పడి చంపేశాడు. ఆ హత్య కేసులో జైలుకు వెళ్లాడు. ఆ కేసును కొన్ని రోజుల తర్వాత కొట్టేశారు. తనతో పాటు చోరీలకు పాల్పడే స్వగ్రామానికి చెందిన సలీంను కూడా పాతకక్షలతో 2011లో చంపేశాడు. ఆ కేసులో కోర్టులో శిక్ష పడగా దానిపై ఇతను అప్పీలుకు వెళ్లాడు. అనంతరం 2010లో బళ్లారి నుంచి ఇన్నోవా కారును బాడుగకు మాట్లాడుకుని ఇద్దరు స్నేహితులతో కలిసి విజయవాడకు వెళ్లే దారిలో అద్దంకి సర్కిల్ పరిధిలో డ్రైవర్‌ను హతమార్చి కారును తీసుకెళ్లాడు. ఇంకా ఆ కేసు పెండింగ్‌లో ఉంది. ఇప్పటి వరకూ వైఎస్సార్ జిల్లా మాధవవరం, బెంగళూరులో బుధగేరిలో కాపురం ఉం టూ రాజంపేట, బద్వేల్, మార్గాపురం, ఆదోని, ఆత్మకూర్, గుంతకల్, అనంతపురం, మదనపల్లె, ఒంగోలు, గూడూరు, నెల్లూరు తిరుపతిలో చోరీల కు పాల్పడ్డాడు. ప్రస్తుతం తిరుపతి, నెల్లూరు, నందలూరు, ఒంగోలు ప్రాంతాల్లో చోరీ కేసులకు సంబంధించి వస్తువులను మాధవరంలో నిందితు డు నివాసం ఉన్న ఇంటి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 250 గ్రాముల బంగారు, 9 కేజీల వెండి, టీవీ, సెల్‌ఫోన్, ట్యాబ్‌లు, మోటార్ సైకిళతో పాటు హత్యకు ఉపయోగించిన కత్తి, దొంగతనాలకు ఉపయోగించే వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఆకాశంలో రెండు విమానాలు ఢీ




**మాంట్రియల్ / కెనడా :** రెండు చిన్న విమానాలు గాల్లో ఢీకొన్న ఘటన కెనడాలో చోటుచేసుకుంది. బిజీ షాపింగ్ ప్రాంతం పైనే ఈ రెండు విమానాలు ఢీకొనడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మాంట్రియల్‌కు 20కిలోమీటర్ల దూరంలోని సెయింట్-బ్రూనో మాల్ పైకప్పుపై ఓ విమానం కూలిపోగా, మరో విమానం పార్కింగ్ ప్రాంతంలో పడిపోయింది. ఈ ప్రాంతం షాపింగ్‌మాల్ ప్రధాన ద్వారానికి 20మీటర్ల దూరంలో మాత్రమే ఉంది. ప్రమాదంలో ఓ విమాన పైలట్ ప్రాణాలు కోల్పోగా మరొకరు గాయాలపాలయ్యారు. జనావాసాల మధ్య విమానం కూలినప్పటికీ అదృష్టవశాత్తూ పౌరుల ప్రాణాలకు ఎలాంటి హాని జరగలేదని పోలీసులు తెలిపారు. ఈ రెండు విమానాలు సెస్నానా 152 ఎయిర్‌క్రాఫ్ట్. ఇవి సమీపంలోని కార్‌గెయిర్ ఫ్లైట్ స్కూల్‌కు చెందినవి. ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని కెనడా రవాణా భద్రత అథారిటీ అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విమానాలు సెయింట్ హుబెర్ట్ విమానాశ్రయానికి వెళు తున్నాయి. విమానాలు చాలా దగ్గరగా ఉన్నాయని ఓ విమానాన్ని ఎడమ వైపునకు తిరగాల్సిందిగా కంట్రోలర్ సూచించినట్లు టీవీఏ నెట్‌వర్క్ తెలిపింది. 'కేవలం 800 మీటర్ల దూరంలో మరో విమానం ఉంది.. మీరు వింటున్నారా?' అని కంట్రోలర్ పైలట్‌తో రెండోసారి కూడా అన్నట్లు ఇద్దరి మధ్య జరిగిన సంభాషణలో తెలిసినట్లు టీవీఏ పేర్కొంది.

## స్టార్టప్ కంపెనీలే యువతకు భవిత

**సీఎం చంద్రబాబు**



**రావా ప్రతినిధి, అమరావతి:** స్టార్టప్ కంపెనీలు యువత భవితకు మార్గం చూపిస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్య విధానం వివిధ వృత్తులు చేపట్టిన యువతకు, కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో తనను కలిసిన పలువురు యువకులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్టార్టప్ విధానం తమకు ఉపయోగపడిందని చెప్పిన వారు గెట్ మై టైలర్, గెట్ మై బుక్స్, హైర్ పప్పీ, గ్లోసీ ట్రెండ్స్ పేర్లతో స్టార్టప్‌లను ప్రారంభించామని తెలిపారు. వీటి ద్వారా ఏడాదికి ఆరున్నర కోట్ల టర్నోవర్‌ను అంచనా వేస్తున్నట్లు జీబీఐ బిజినెస్ డెవలప్‌మెంట్‌కు చెందిన స్వప్న సిద్ధార్థ్ ముఖ్యమంత్రికి చెప్పారు. గెట్ మై టైలర్ ఆన్‌లైన్ స్టోర్ ద్వారా టైలరింగ్ వచ్చినవారిని ఆన్‌లైన్ ద్వారా అందరికీ పరిచయం చేస్తున్నామన్నారు. ఈ స్టార్టప్‌ను ప్రారంభించిన రాజమండ్రికి చెందిన తాడిమళ్ల కమలాకర్ 241 మీటర్ల వస్త్రంతో 47 అడుగుల పొడవు, 21 అడుగుల వెడల్పు ఉన్న చొక్కాను చంద్రబాబుకు చూపించారు. హైర్ పప్పీ.కామ్ ద్వారా ఎవరైనా తాము కొనలేని వస్తువులను ఒకరోజు అద్దెకు తీసుకుని ఉపయోగించుకోవచ్చని మరో యువతి తెలిపింది. తాము కాకినాడ సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా గుంటూరు జిల్లా నల్లమడ డ్రైన్ ప్రభావిత ప్రాంతంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన పలువురు రైతులు శు క్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. నల్లమడ డ్రైన్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తరాఖండ్ సీఎంగా త్రివేంద్ర ప్రమాణస్వీకారం



**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా త్రివేంద్ర సింగ్ రావత్ శనివారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. పెరేడ్ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ఉత్తరాఖండ్ 9వ సీఎంగా త్రివేంద్ర సింగ్ రావత్ చేత గవర్నర్ కృష్ణ కాంత్ పాల్ ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు ప్రకాష్ పంత్, హరక్ సింగ్ రావత్, మదన్ కౌశిక్, సత్పాల్ మహరాజ్ కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, ఉమాభారతి, ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీష్ రావత్ తదితరులు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తరాఖండ్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు జార?ండ్ పార్టీ ఇన్‌చార్జిగా త్రివేంద్ర సింగ్ రావత్ క ృషి చేశారు. డొయివాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 24 వేల ఓట్ల మెజారిటీతో ఆయన విజయం సాధించారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ అయిన రావత్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు అత్యంత సన్నిహితుడు. 2014లోక్‌సభ ఎన్నికల్లో అమిత్‌షాతో కలిసి యూపీలో పార్టీ గెలుపునకు కృషి చేశారు.

## సర్వేకు సహకరించండి : వెంకటప్పయ్య



**రా.వాప్రతినిధి-రాయపూడి :** రాయపూడి గ్రామంలో ఈనెల 11 నుంచి 22 వరకు కుటుంబ వికాసం, సామాజిక వికాసం సర్వే జరుగుతోంది. గ్రామంలోని 3 వంతుల కుటుంబాల సర్వే పూర్తయిందని పంచాయతీ కార్యదర్శి గాదే. వెంకటప్పయ్య తెలిపారు. ఈ సర్వేకు గ్రామ ప్రజలు సహకరించ వలసినదిగా ఆయన విజ్ఞప్తి చేశారు.




Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18